పసుపు పండుగ సూపర్ హిట్!

జనసంద్రమైన కడప

- మూడ్రోజుల వేడుకలో ఆద్యంతం లోకేశ్ మార్క్
- 'కార్యకర్తే అధినేత' సహా 6 శాసనాలకు ఆమోదం
- చంద్రబాబు నుంచి నేతల వరకు చర్చ దానిపైనే
- పార్టీ నియమావళిని సవరించి చేర్చిన వైనం
- మొత్తం 14 అంశాలపై తీర్మానాలు
- సమయ పాలనకు పెద్దపీట
- బాబు నుంచి లోకేశ్ వరకు నేతలంతా నిర్దేశిత టైంలోనే ప్రసంగాల ముగింపు
- 12వ సారి అధ్యక్షుడిగా చంద్రబాబు ఎన్నిక
- చివరి రోజు బహిరంగ సభకు లక్షల్లో తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు

www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI పేజీలు: 14 వెల (Price) : Rs. 6.50

శుక్రవారం | 30-5-2025 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: చవితి రా.9.23 తదుపరి పంచమి, నక్షత్రం: పునర్వసు రా.9.29 తదుపరి పుష్యమి, వర్జ్యం: ఉ.10.04-11.35, తె.5.21 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8.19-9.11, మ.12.38-1.30, అమృతఘడియలు: రా.7.12-8.43, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.41

సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 44 విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కడప మహానాడు బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన జనం.. చంద్రబాబు అభివాదం

ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్

ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తితో ఆర్థిక ఉగ్రవాదులను ఏరేస్తాం: సీఎం

రాజకీయాల్లో లేకుండా చేస్తాం

- ఇటుక.. ఇటుక పేర్చి రాష్ట్ర పునర్నిర్మాణం
- వచ్చే మహానాడుకల్లా భూసమస్యలన్నీ పరిష్కారం
- వై నాట్లు..గొడ్డలిపోట్లు మన రాజకీయం కాదు
- పాలన ఎలా ఉండాలనేందుకు టీడీపీ కేస్ స్టడీ
- ప్రజాతీర్పు వైసీపీకి ఇంకా అర్థం కాలేదు
- రాష్ట్రాన్ని సమస్యల చీకట్లోకి నెట్టేసింది
- దీపం డబ్బులు 2 విడతలుగా ఖాతాల్లో వేస్తాం
- వచ్చేనెల 12నాటికి వాట్సాప్‌లో 500 సేవలు
- అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదు.. నిరంతర పాలన ఉండాలి
- రాయలసీమ అభివృద్ధికి బ్లూప్రింట్ ఉంది

మహానాడు ముగింపు సభలో చంద్రబాబు

(మహానాడు ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

పాకిస్థాన్ ఉగ్రవాదులను ఏరిపారేసిన ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తితో రాష్ట్రంలో ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్‌కు నాంది పలుకుతామని, ఆర్థిక ఉగ్రవాదులను తుడిచిపెడతామని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "వై నాట్లు.. గొడ్డలి పోట్లు.. మన రాజకీయం కాదు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా భావించి ప్రజాసేవ చేస్తున్నాం. ఏడాదిగా మన పాలన అదే విధంగా సాగుతోంది." అని పేర్కొన్నారు. అధికారం కోసం కాదు.. ప్రజాసేవ కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని వ్యాఖ్యానించారు. "పరిపాలన ఎలా ఉండాలో, పార్టీ ఎలా ఉండాలో చెప్పేందుకు కేస్ స్టడీ టీడీపీ. పాలన ఎలా ఉండకూడదో, పార్టీని ఎలా నడపకూడదో తెలిపేందుకు కేస్ స్టడీ వైసీపీ." అని పేర్కొన్నారు. కడపలో గురువారం జరిగిన

మిగతా 13వ పేజీలో...



మహానాడు బహిరంగ సభలో పార్టీ నేతలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు అభివాదం

'రెడ్ బుక్'తో వాళ్లకు వణుకు!



సమగ్ర కథనాలు 12, 13లో

ఒకడికి గుండెపోటు.. ఒకడు బాత్రూమ్‌లో కాలు జారిపడ్డాడు

- ఇంకొకడు ఏమయ్యాడో అందరికీ తెలుసు.. రెడ్ కలర్ చూసినా వాళ్లకు నిద్రపట్టడం లేదు
- రెడ్ బుక్ అంటే అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలుచేయడమే.. దాని నుంచి ఎవరూ తప్పించుకోలేరు
- దాని పని అది చేసుకుపోతుంది.. మనం అభివృద్ధి బుక్‌పై దృష్టిపెడదాం.. ప్రజల కోసం కష్టపడదాం
- పద్ధతి ప్రకారం వాళ్ల తప్పులు రుజువు చేయాలి.. దానికి టైం పట్టొచ్చు.. శిక్షలు మాత్రం ఖాయం
- విషపు మద్యానికి 30 వేల మంది బలి.. అంతులేని ధనదాహంతో వేల కోట్ల దోపిడీ
- రాష్ట్రాన్ని విధ్వంసం చేసి పోయారు.. మోదీ, పవనన్న, చంద్రన్న జెండాలు పక్కనపెట్టి కలిసి పనిచేశారు.. కూటమిని ప్రజలు ఆశీర్వదించారు
- విడాకులుండవ్.. రాసిపెట్టుకోండి.. రాష్ట్రం బాగుపడాలంటే కలిసి ఉండాల్సిందే
- ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే పసుపు సైన్యమే మన బలం

కడప బహిరంగ సభలో మంత్రి లోకేశ్ స్పష్టీకరణ

ఉగ్రవాదులు సమాజానికి చాలా ప్రమాదకరం. పాక్ ఉగ్రవాదులు మన దేశంలోకి వచ్చి పర్యాటకులను చంపేస్తే ప్రధాని మోదీ పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులను 20 నిమిషాల్లో హతమార్చారు. దేశంలోని ఉగ్రవాదులతోనే కాదు, రాష్ట్రంలో రాజకీయ ముసుగులోని ఆర్థిక ఉగ్రవాదుల వల్ల కూడా చాలా నష్టం. మన రాష్ట్రంలో రాజకీయాల ముసుగులో కొందరు ల్యాండ్, మైన్, శాండ్ దోచేసుకున్నారు. జే బ్రాండ్లతో కొల్లగొట్టారు. కొండలను మింగేశారు. అడవులను ఆక్రమించి ప్యాలెస్‌లు, ఎస్టేట్లు నిర్మించుకున్నారు. చెరువులను చెరబట్టారు. ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్‌లో భాగంగా వీటన్నింటికీ చెక్ పెడతాం. ఆర్థిక ఉగ్రవాదులను రాజకీయాల్లో లేకుండా చేస్తాం. - సీఎం చంద్రబాబు

అంతులేని ధనదాహంతో విషం కంటే ప్రమాదకరమైన మద్యాన్ని ఏరులై పారించి, 30 వేల మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నారు. వేల కోట్లు దోచి, రాష్ట్రాన్ని ధ్వంసం చేసి పోయారు. వైసీపీ వాళ్లకు వెయ్యి రూపాయల పెన్షన్ పెంచడానికి ఐదేళ్లు పడితే.. మేం వచ్చిన తొలిరోజు నుంచే వెయ్యి పెంచి ఇస్తున్నాం. పేదవాళ్లు కడుపు నిండా భోజనం చేయడం జగన్‌కు ఇష్టం ఉండదు. అందుకే అన్న క్యాంటీన్లను మూయించాడు. - మంత్రి లోకేశ్

(మహానాడు ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

'రెడ్‌బుక్ పేరు చెప్పగానే ఒకడికి గుండెపోటు వచ్చింది. మరొకడు బాత్రూమ్‌లో కాలు జారిపడ్డాడు. ఇంకొకడు ఏమయ్యాడో మీ అందరికీ తెలుసు. అర్థమైందా రాజా' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. రెడ్‌బుక్ అంటే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయడమేనన్నారు. ఎవరైతే చట్టాలను ఉల్లంఘించి ప్రజలను, టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టారో వారిని చట్టప్రకారం శిక్షిస్తామని చెప్పామని.. ఇప్పుడు రెడ్‌బుక్ అదే చేస్తోందని చెప్పారు. రెడ్ కలర్ చూసినా వాళ్లకు నిద్ర పట్టడం లేదని వైసీపీ నేతలను ఎద్దేవాచేశారు. కడప మహానాడు ప్రాంగణంలో బహిరంగ సభ వేదికపై నుంచి లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలను, కార్యకర్తలను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడారు. 'ఒక పద్ధతి ప్రకారం వాళ్లు చేసిన తప్పులను రుజువుచేయాలి. దానికి సమయం పట్టొచ్చు. కానీ శిక్షయితే తప్పదు. రెడ్‌బుక్ నుంచి ఎవరూ తప్పించుకోలేరు. దాని పని అది చేసుకుంటూ పోతుంది. ఇప్పుడు మనం డెవలప్‌మెంట్ బుక్‌పై

మిగతా 12వ పేజీలో...



విశాఖలో తొలి కొవిడ్ మృతి?

- 64 ఏళ్ల వృద్ధుడికి కరోనా పాజిటివ్ 3
- ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ఆ మరణం కరోనాతో కాదు.. డీఎంహెచ్‌ఓ ప్రకటన

ట్రంప్ సుంకాలకు బ్రేక్!



ఆయన అధికారాలను అతిక్రమించారు

- మనకు విక్రయించే వాటిపై సుంకాల మోత మోగించారు
- అమెరికా వాణిజ్య కోర్టు వ్యాఖ్య.. సుంకాలను నిలిపేస్తూ తీర్పు
- సుంకాల వల్లే భారత్-పాక్ కాల్పుల విరమణ
- చైనా కూడా దిగొచ్చే అవకాశముంది.. అధ్యక్షుడి వాదనలు కొట్టేసిన కోర్టు.. న్యాయం గాడితప్పింది: ట్రంప్ సలహాదారు
- ఆ చర్చ రాలేదు.. ట్రంప్ వాదనను వ్యతిరేకిస్తున్నాం: భారత్

2

ముగిసిన ట్రంప్-మస్క్ బంధం

- 'డోజ్' నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించిన ఎలాన్ మస్క్
- ట్రంప్ బిల్లుపై వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే వైదొలగిన వైనం

మేం దాడి చేసేలోపే.. బ్రహ్మోస్‌తో కొట్టారు



- మే 10న తెల్లవారుజామున భారత్‌పై దాడికి సిద్ధమయ్యాం
- 9 రాత్రే వ్యూహ రచన చేశాం
- మాకన్నా ముందే భారత్ క్షిపణులతో విరుచుకుపడింది
- మా వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి
- భారత్ దాడులపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యలు
- శాంతి చర్చలకు ముందుకు రావాలని భారత్‌కు పిలుపు

2

ఉగ్రవాదంపై చర్యలు తీసుకునేదాకా చర్చల్లేవ్

- పీవోకేను ఖాళీ చేసి, ఉగ్రవాదులను అప్పగించాల్సిందే
- నీళ్లు, రక్తం కలిసి ప్రవహించవు
- మా షరతుల్లో మార్పు లేదు
- శాంతి చర్చలపై భారత్ స్పష్టీకరణ

ఉత్తమ నటుడు అల్లు అర్జున్





నాగ్‌అశ్విన్

ఉత్తమ కథా రచయిత కృష్ణా జిల్లా వాసి శివ పాలడుగు

- ఉత్తమ నటి నివేదా థామస్
- ఉత్తమ చిత్రం కల్కి 2898 ఏడీ
- 2024కుగాను తెలంగాణ ప్రభుత్వ ఫిల్మ్ అవార్డుల ప్రకటన
- లక్కీ భాస్కర్ చిత్రానికి 4.. రజాకార్ చిత్రానికి 3 అవార్డులు

(ఆంధ్రజ్యోతి-సినిమా డెస్క్)

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా తెలుగు చలన చిత్ర పరిశ్రమలో సినీ పురస్కారాల సందడి మొదలైంది. 2024 సంవత్సరానికి గాను ఆ రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 11వ పేజీలో...

సంతకాలు అవుతాయి.. ఆయుధాలు రావు

- ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టు కూడా సకాలంలో పూర్తికాలేదు 2
- 2024 మార్చిలో అందాల్సిన తేజస్ విమానాలు ఒక్కటీ రాలేదు
- దేనికైనా కట్టుబడితే గడువులోగా అందించాలి
- సీఐఐ సదస్సులో వాయుసేన చీఫ్ అమర్‌ప్రీత్
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సమక్షంలోనే వ్యాఖ్యలు



పీవోకే తిరిగొస్తుంది

- ఆ రోజెంతో దూరం లేదు
- అక్కడి ప్రజలకు భారత్‌తో అనుబంధం ఉంది
- పాక్‌తో ఎప్పుడు చర్చలు జరిపినా ఉగ్రవాదం, పీవోకేనే కీలకం
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్

పీఓకే తిరిగొస్తుంది: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, మే 29: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) త్వరలోనే తిరిగొస్తుందని, తాను భారత్‌లో అంతర్భాగమని ప్రకటించుకుంటుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. పీఓకే ప్రజలు భారత కుటుంబంలో భాగమని, వారు తామంతట తాము భారత్‌వైపు వచ్చే రోజు ఎంతో దూరంలో లేదని చెప్పారు. గురువారం సీఐఐ వార్షిక సదస్సులో రాజ్‌నాథ్ ప్రసంగించారు. "ఒకే భారత్.. శ్రేష్ఠ భారత్ విజన్‌కు కట్టుబడి ఉన్నాం. భౌగోళికంగా, రాజకీయంగా విడిపోయినవారు ఏదో ఒకరోజు ఆత్మగౌరవంతో తిరిగి దేశంలో కలుస్తారని నమ్ముతున్నాను. విడిపోయి ఉన్నా అక్కడి ప్రజలకు భారత్‌తో బలమైన సాంస్కృతిక, మానసిక అనుబంధం ఉంది. అక్కడి వారిలో ఎవరో కొందరు తప్పుదారిపట్టి ఉండవచ్చు. భారత్‌ది ఎప్పుడూ ఏకత్వం, నమ్మకం, ప్రేమమయమైన మార్గమే. పీఓకే ఏదో ఒకరోజు.. 'నేను భారత్. నేను తిరిగొచ్చాను' అని ప్రకటిస్తుందని ఆశిస్తున్నా" అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో ఎప్పుడు చర్చలు జరిగినా ఉగ్రవాదం నిర్మూలన, పీఓకేను తిరిగి అప్పగించడమనే రెండు అంశాలే కీలకమని చెప్పారు.

పాక్ ర్యాలీలో 'పహల్గాం' సూత్రధారి

» బహిరంగ వేదికపై లష్కరే కమాండర్ సైఫుల్లా



న్యూఢిల్లీ, మే 29: పహల్గాం దాడి వెనుక కీలక సూత్రధారిగా అనుమానిస్తున్న ఉగ్ర సంస్థ లష్కరే తాయిబా కమాండర్ సైఫుల్లా కసూరీ మరోసారి బహిరంగ వేదికపై కనిపించాడు. అది కూడా పాకిస్థాన్ రాజకీయ నేతలు, పలువురు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు పాల్గొన్న ఒక ర్యాలీలో వారితో కలిసి వేదిక పంచుకున్నాడు. పాక్ అణుపరీక్షల వార్షికోత్సవం సందర్భంగా పాకిస్థాన్ మర్కాజీ ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో వీరంతా ఒక్కచోట చేరారు. ఈ సందర్భంగా రెచ్చగొట్టే ప్రసంగాలు, భారత వ్యతిరేక నినాదాలు చేశారు. ర్యాలీల్లో పాల్గొన్న వాళ్లలో లష్కరే వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్ కుమారుడు, భారత్ ఉగ్రవాదిగా ముద్ర వేసిన తల్హా సయీద్ కూడా పాల్గొన్నాడు.

ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులూ పైలట్ కావొచ్చు!

» పౌర విమానయానశాఖకు డీజీసీఏ ప్రతిపాదన

న్యూఢిల్లీ, మే 29: సైన్స్, మ్యాథ్స్ చదివిన విద్యార్థులే పైలట్ శిక్షణకు అర్హులన్న నిబంధనకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) స్వస్తి పలకబోతోంది. ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులు కూడా పైలట్ శిక్షణ తీసుకోవచ్చని కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతమున్న నిబంధనల మేరకు.. 12వ తరగతి/ఇంటర్మీడియెట్‌లో ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులు చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులే కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్) శిక్షణకు అర్హులుగా ఉన్నారు. దీంతో మిగతా స్ట్రీమ్‌ల విద్యార్థులు ఓపెన్ స్కూల్స్/ఇంటర్ ద్వారా ఆయా సబ్జెక్టులు చదివి శిక్షణ కోసం వచ్చేవారు.. అయితే తాజాగా దీన్ని సవరించి మిగతా స్ట్రీమ్‌ల వారికి అవకాశం కల్పించాలనే ప్రతిపాదనను డీజీసీఏ కేంద్ర పౌర విమానయాన శాఖకు పంపింది. ఆ శాఖ ఆమోదం తర్వాత న్యాయ శాఖకు ఆమోదానికి ఆ ఫైలు వెళ్లనుంది. అనంతరం కొత్త నిబంధన అమల్లోకి రానుంది.

కొవిడ్ బెడ్లు ఖాళీ లేకుంటే..
ఆ పేషెంట్‌ని చంపెయ్

» మహారాష్ట్రలోని లాతూర్‌లో తోటి వైద్యుడికి సర్జన్ సలహా

» 2021 నాటి ఆడియో.. మే 2 నుంచి వైరల్

లాతూర్, మే 29: 'బెడ్లు ఖాళీ లేకుంటే ఆ పేషెంట్‌ను చంపెయ్' అంటూ ఒక వైద్యుడు మరో వైద్యుడికి సలహా ఇచ్చాడు!! 2021లో కొవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో.. మహారాష్ట్రలోని లాతూర్‌లో జరిగిందీ ఘటన. లాతూర్‌కు చెందిన కౌసర్ ఫాతిమా అనే మహిళ కొవిడ్ బారిన పడడంతో.. ఆమె భర్త దయామీ అజీమొద్దీన్ గౌసుద్దీన్ ఆమెను 2021 ఏప్రిల్ 15న ఉద్గిర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ కొవిడ్ పేషెంట్లకు డాక్టర్ శశికాంత్ డాంగే వైద్యం చేశారు. ఆ ఆస్పత్రిలో ఆమె పదిరోజులపాటు చికిత్స చేయించుకుని డిశ్చార్జ్ అయ్యారు. అయితే.. ఏదో రోజున కౌసర్ ఫాతిమా భర్త దయామీ డాక్టర్ శశికాంత్ డాంగే వద్ద ఉన్న సమయంలో.. డాక్టర్ డాంగేకు సీనియర్ సర్జన్ డాక్టర్ శశికాంత్ దేశ్‌పాండే నుంచి ఫోన్ వచ్చింది. ఆ సమయంలో డాక్టర్ డాంగే భోజనం చేస్తుండడంతో.. ఫోన్‌ను స్పీకర్‌లో పెట్టి మాట్లాడారని, దీంతో వారి మాటల్లో కొన్ని తనకు కొంత అస్పష్టంగా వినిపించాయని ఫాతిమా భర్త దయామీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ప్రకారం.. ఆస్పత్రిలో పడకలు ఏవైనా ఖాళీగా ఉన్నాయా అని ప్రశ్నించారు. దీనికా డాక్టర్ డాంగే.. ఖాళీ పడకలేవీ లేవని బదులిచ్చారు. అప్పుడు దేశ్‌పాండే.. "ఎవర్నీ లోపలికి రానివ్వొద్దు (చేర్చుకోవద్దు). ఆ దయామీ పేషెంట్‌ని చంపెయ్" అన్నట్టుగా తనకు వినపడిందని దయామీ తన ఫిర్యాదులో వివరించారు. దీనికి డాక్టర్ డాంగే.. అప్పటికే ఆక్సిజన్ సపోర్టు తగ్గించినట్టు సమాధానమిచ్చారని తెలిపారు. ఇప్పుడు ఆ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. తనను నాడు ఎంతగానో కలచివేసిన ఆ వ్యాఖ్యలు మళ్లీ విని బాధపడ్డానని, తన మతపరమైన మనోభావాలు దెబ్బతిన్నాయని ఫిర్యాదులో వెల్లడించారు. ఆయన ఫిర్యాదు మేరకు ఉద్గిర్ నగర పోలీసులు మే 24న డాక్టర్ దేశ్‌పాండేపై కేసు నమోదు చేశారు. వైరల్ అవుతున్న ఆడియో క్లిప్‌లో ఉన్నది ఆయన స్వరమేనా అని నిర్ధారించుకునే పనిలో ఉన్నామని పోలీసులు తెలిపారు.

సంతకాలు అవుతాయి..
ఆయుధాలు రావు

» ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టు కూడా సకాలంలో పూర్తికాలేదు

» 2024 మార్చిలో అందాల్సిన తేజస్ విమానాలు ఒక్కటీ రాలేదు

» దేనికైనా కట్టుబడితే గడువులోగా అందించాలి

» సీఐఐ వార్షిక సదస్సులో వాయుసేన చీఫ్ అమర్‌ప్రీత్ సింగ్

» రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలోనే వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 29: ఆయుధాలు, ఆయుధ వ్యవస్థల ఉత్పత్తిలో మన దేశ సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ విమర్శించారు. ఆయుధాల సరఫరా కోసం కాంట్రాక్టుల మీద సంతకాలైతే చేస్తారని, కానీ సరఫరా మాత్రం జరగదని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టు కూడా అనుకున్న సమయంలో పూర్తికాలేదని, సమయానికి చేయలేనప్పుడు ఎందుకు వాగ్దానాలు చేయాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా 'నేను ఒక్కసారి కమిటైతే.. నా మాట నేనే వినను' అనే సినిమా డైలాగ్‌ను గుర్తు చేశారు. దేనికైనా కట్టుబడితే గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. దేశీయంగా రక్షణ వ్యవస్థల ఉత్పత్తిని పెంచడానికి, మేకిన్ ఇండి యా కోసం వాయుసేన కృషి చేస్తోందని చెప్పారు. సీఐఐ వార్షిక సదస్సులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సమక్షంలోనే అమర్‌ప్రీత్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "రక్షణ పరికరాలు, ఆయుధాల సరఫరాలో నిర్ధారిత గడువు అన్నదే లేకుండా పోయింది. 83 తేజస్ ఎంకే1ఏ యుద్ధ విమానాల సరఫరా కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో 2021 ఫిబ్రవరిలో రూ.48 వేల కోట్ల కాంట్రాక్టు కుదిరింది. 2024 మార్చి నుంచే విమానాల డెలివరీ మొదలుకావాలి. కానీ ఇప్పటివరకు ఒక్కటి కూడా అందజేయలేదు. గతంలో తేజస్ ఎంకే1 విమానాల సరఫరాలోనూ జాప్యం జరిగింది. తేజస్ ఎంకే2 ప్రొటోటైప్ అందాల్సి ఉంది. ఆమ్కా ఫైటర్‌కు సంబంధించి ప్రొటోటైప్ కూడా సిద్ధంకాలేదు. మన దేశంలో ఉత్పత్తి చేయడం కాదు, మన దేశంలోనే రూపొందించడం, అభివృద్ధి చేయడం (డిజైన్ అండ్ డెవలప్‌మెంట్)పై దృష్టిపెట్టాలి. సైనిక దళాలకు, పరిశ్రమకు మధ్య విశ్వాసం నెలకొనాలి. దేనికైనా కట్టుబడితే గడువులోగా అందించాలి. ప్రాణం పోయినా పర్లేదు, మాట పోవద్దనే సూక్తిని గుర్తుంచుకోవాలి" అని అమర్‌ప్రీత్‌సింగ్ పేర్కొన్నారు.

యూట్యూబర్ సన్నీ యాదవ్ అరెస్టు

హైదరాబాద్ సిటీ/నూతనకల్/చెన్నై, మే 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు వ్లాగర్/యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు అరెస్టు చేశారు. మోటార్ సైకిల్‌పై దేశవిదేశాల్లో పర్యటిస్తూ.. వ్లాగింగ్(అక్కడి పరిస్థితులను వివరించే వీడియోలు చేయడం) చేసే సన్నీ.. ఇటీవల పాకిస్థాన్‌ను సందర్శించారు. దీంతో.. పాక్ సందర్శనకు గల కారణాలపై విచారణ జరిపేందుకు ఎన్ఐఏ అధికారులు అతణ్ని చెన్నై విమానాశ్రయంలో అరెస్టు చేశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిన నేపథ్యంలో ఉద్రిక్తతలు ఉన్నా.. సన్నీ పాకిస్థాన్‌కు వెళ్లడం వివాదాస్పదమైంది. భారత రహస్యాలను పాక్‌కు చేరవేస్తున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా, మరో 11 మంది అరెస్టు తర్వాత.. ఈ తరహా వ్లాగర్లపై ఎన్ఐఏ నిఘా పెంచింది. ఈ క్రమంలో సన్నీతోపాటు.. మరో ముగ్గురు వ్లాగర్ల కదలికలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. సన్నీ యాదవ్ అసలు పాకిస్థాన్‌కు ఎందుకు వెళ్లాడు? ఉద్రిక్తతల తరుణంలో శత్రుదేశాన్ని సందర్శించడానికి కారణమేంటి? అనే కోణంలో అతణ్ని విచారించనున్నట్లు సమాచారం. కాగా.. బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం కల్పించిన కేసులోనూ సన్నీ నిందితుడిగా ఉన్నారు. పంజాగుట్ట కేసులో అతనికి నోటీసులు అందగా.. సూర్యాపేట పోలీసులు కూడా కేసు నమోదు చేశారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో అక్కడే?

సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల కేంద్రానికి చెందిన సన్నీ.. తనపై బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసు నమోదయ్యాక హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించారు. అది కుదరకపోవడంతో దుబాయ్ వెళ్లారు. దాంతో లుకౌట్ నోటీసు జారీ అయ్యింది. సన్నీ దుబాయ్ నుంచి పాకిస్థాన్ వెళ్లి



నట్లు సమాచారం. భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించిన సమయంలోనూ అతను పాక్‌లోనే ఉన్నట్లు ఎన్ఐఏ వర్గాలు అనుమానిస్తున్నాయి. గతంలో కూడా అతను ఐదుసార్లు పాకిస్థాన్‌కు బైక్‌పై వెళ్లినట్లు తెలిసింది. సన్నీ తన పాకిస్థాన్ ట్రిప్‌పైనా పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. అతని కుటుంబ సభ్యులు మాత్రం అరెస్టు వార్త తమకు తెలియదని, సన్నీ నిత్యం బైక్ యాత్రలు చేస్తుంటాడని తెలిపారు. టీవీల్లో చూశాకే తమకు సమాచారం తెలిసిందని చెప్పారు. కుటుంబ సభ్యులు హైకోర్టులో హెబియస్ కార్పస్ రిట్ వేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

సూర్యాపేట నుంచి ప్రస్థానం

సన్నీ పుట్టి పెరిగిందంతా సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలం శిల్పకుంట్ల గ్రామంలో. తండ్రి ఓ ఫార్మసీ స్టోర్‌ను నడుపుతున్నారు. తల్లి గృహిణి. సన్నీ సోదరుడు కల్యాణ్ కబడ్డీ ఆటగాడు. మధ్యతరగతి నుంచి వచ్చిన సన్నీ.. చదువుల్లో ఫర్వాలేదనిపించి, మోటార్ సైక్లింగ్‌లో దూసుకువెళ్లేవారు. 13 ఏళ్ల వయసు నుంచే వాహనాన్ని నడపడం నేర్చుకున్న సన్నీ.. 18వ ఏట డ్రైవింగ్ లైసెన్సు తీసుకుని, యమహాపై రయ్‌మంటూ ట్రిప్పులు వేసేవారు. 2016లో వ్లాగింగ్ మీద ఆసక్తి పెంచుకుని, ప్రయత్నాలను మొదలుపెట్టారు. మొదట్లో 100-150 కిలోమీటర్ల దూరాలతో ప్రయత్నించారు. యూట్యూబ్ వీక్షణలు పెద్దగా లేకపోవడంతో.. 2018 నుంచి పెద్ద ట్రిప్‌లను ప్లాన్ చేసేవారు. 2019లో 21 రోజుల్లో లద్దాఖ్‌కు వెళ్లిన యాత్ర, అతని జీవితాన్ని మార్చేసింది. ఆ యాత్రతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య ఒక్కసారిగా మూడు లక్షలకు చేరుకుంది. దాంతో.. పూర్తిస్థాయి వ్లాగర్‌గా మారిపోయారు. 2019లోనే నేపాల్‌కు వెళ్లి.. తొలి విదేశీ యాత్రను పూర్తిచేశారు.

ట్రంప్ సుంకాలకు బ్రేక్!

వాషింగ్టన్, మే 29: ట్రంప్‌కు అమెరికా వాణిజ్య కోర్టులో భారీ ఎదురు దెబ్బ తగిలింది. 'లిబరేషన్ డే' పేరుతో ప్రపంచ దేశాలపై విధిస్తున్న సుంకాలను నిలుపుదల చేస్తూ మాన్‌హట్టన్‌లోని అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాల కోర్టు తీర్పు వెలువరించింది. ఎడాపెడా దిగుమతి సుంకాలను విధించడం ద్వారా అధ్యక్షుడు తన అధికారాలను అతిక్రమించారని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. అమెరికా నుంచి ఇతర దేశాలు కొనుగోలు చేసే వాటికన్నా.. మనకు విక్రయించే వాటిపైనే సుంకాల మోత మోగించారని ధర్మాసనంవ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడి తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం(ఐఈఈపీఏ) కింద సుంకాలను విధించే అధికారం అధ్యక్షుడికి ఉందన్నారు. ఇది జాతీయ అత్యవసర సమయాల్లో అసాధారణ ముప్పును, హెచ్చరికలను నిలువరించేందుకు ఉద్దేశించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రంప్ సుంకాల విధానాన్ని సమర్థించాలని కోర్టును కోరారు. లేనిపక్షంలో చైనాతో వాణిజ్య సంధి దెబ్బతినడంతోపాటు, భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉన్న వివా దం తిరిగి రాజుకుంటుందని పేర్కొన్నారు. "ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పాక్‌కు చెందిన ఉగ్రవాదులు దాడి చేశారు. అనంతరం అణ్వాయుధాలున్న రెండు దేశాలు ఘర్షణలకు దిగాయి. మే తొలివారంలో ట్రంప్ తన సుంకాల అధికారాన్ని వినియోగించి ఆ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణకు ఒప్పించారు. ఇది అధ్యక్షుడికి ఉన్న సుంకాల అధికారంతోనే సాధ్యమైంది" అని అధికారులు సైతం వివరించారు. వాణిజ్య సుంకాలకు సంబంధించి పలు దేశాలతో చర్చలు కొనసాగుతున్నాయని, వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసేందుకు జూలై 7 వరకు గడువు ఉందన్నారు. ఈ నేపథ్యంలో దీన్ని సున్నితమైనదిగా పరిగణించాలని కోర్టును అభ్యర్థించారు.

> "విదేశాలతో వాణిజ్య విధివిధానాలను నియంత్రించే అధికారం అమెరికా రాజ్యాంగం కాంగ్రెస్‌కు కట్టబెట్టింది. కాంగ్రెస్‌కు దఖలుపడిన ఈ అధికారాన్ని దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడే పేరిట 'అధ్యక్షుడి అత్యవసర అధికారం' తోసిపుచ్చజాలదు. అలా చేస్తే అది రాజ్యాంగ విరుద్ధమే."
>
> - అంతర్జాతీయ వాణిజ్య కోర్టు



అపరిమిత అధికారాల్లేవ్!

ఐఈఈపీఏ కింద అధ్యక్షుడికి కాంగ్రెస్ అపరిమిత అధికారాలను కట్టబెట్టలేదని వాణిజ్య కోర్టు స్పష్టం చేసింది. అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో అసాధారణ ముప్పును ఎదుర్కొనేందుకు 'అవసరమైన' ఆర్థిక ఆంక్షలు విధించే అధికారం మాత్రమే అధ్యక్షుడికి ఉంటుందని ధర్మాసనం తేల్చి చెప్పింది. "విదేశాలతో వాణిజ్య విధివిధానాలను నియంత్రించే అధికారం అమెరికా రాజ్యాంగం కాంగ్రెస్‌కు కట్టబెట్టింది. కాంగ్రెస్‌కు దఖలుపడిన ఈ అధికారాన్ని దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడే పేరిట 'అధ్యక్షుడి అత్యవసర అధికారం' తోసిపుచ్చజాలదు. అలా చేస్తే అది రాజ్యాంగ విరుద్ధమే" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. తీర్పు వచ్చిన వెంటనే ట్రంప్ ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. కాగా, కోర్టు తీర్పుపై ట్రంప్ కార్యాలయం మౌనం వహించగా ఆయన సలహాదారు స్టీఫెన్ మిల్లర్ మాత్రం తీవ్రంగా స్పందించారు. "న్యాయ వ్యవస్థ గాడి తప్పింది" అని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మరోవైపు.. వీసాల నిషేధానికి సంబంధించి అమెరికా ప్రభుత్వం నూతన నిబంధన తీసుకొచ్చింది. అమెరికాకు చెందిన సామాజిక మాధ్యమాల్లో ఆ దేశ పౌరులు చేసే వ్యాఖ్యలపై ఏ ఇతర దేశ అధికారులైనా చర్యలు తీసుకుంటే.. అలాంటి వారికి వీసాలు ఇవ్వబోమని తెలిపింది. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రుబియో ప్రకటించారు.

చర్చల్లో సుంకాల ప్రస్తావన లేదు

» ట్రంప్ వాదనను వ్యతిరేకిస్తున్నాం: భారత్

సుంకాలు విధిస్తామని హెచ్చరించినందునే భారత్-పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు ఒప్పుకొన్నాయన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాదనలను భారత్ తోసిపుచ్చింది. అసలు ఆనాటి చర్చల్లో సుంకాల ప్రస్తావన రాలేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. "మే నెల ప్రారంభంలో కాల్పుల విరమణకు సంబంధించిన చర్చల్లో సుంకాల అంశం అసలు లేనేలేదు." అని తేల్చి చెప్పింది. "ఈ ప్రత్యేక అంశాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మే 7న ఆపరేషన్ సిందూర్ ప్రారంభించి.. 10వ తేదీన కాల్పుల విరమణకు ఒప్పుకొనే వరకు భారత్-అమెరికాల మధ్య పలు మార్లు చర్చలు జరిగాయి. అయితే ఏ సందర్భంలోనూ ఈ సుంకాల వ్యవహారం మా మధ్యరాలేదు." అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ చెప్పారు.

ట్రంప్‌కు కోర్టులో ఎదురుదెబ్బ

» హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థులు చేరకుండా చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట

» తాత్కాలికంగా నిలిపివేసిన ఫెడరల్ కోర్టు

వాషింగ్టన్, మే 29: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రఖ్యాత హార్వర్డ్ వర్సిటీలో విదేశీ విద్యార్థులు చేరకుండా ఆయన ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఫెడరల్ కోర్టు అడ్డుకొంది. ప్రభుత్వ ప్రయత్నాలను నిలిపివేస్తూ ఫెడరల్ కోర్టు జడ్జి ఎల్లిసన్ బరోస్ బుధవారం తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయమై గత వారం ఇచ్చిన ఆదేశాలు కొనసాగుతాయని తెలిపారు. తుది తీర్పు వెలువడే వరకు యథాతథ స్థితి కొనసాగుతుందని పేర్కొన్నారు. హార్వర్డ్ లాయర్ల వాదనలు విన్న అనంతరం ఆమె 'ప్రజలు భయపడుతున్నారు' అంటూ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిర్ణయం కారణంగా వేలాది మంది విదేశీ విద్యార్థులు అనిశ్చిత స్థితిలో చిక్కుకున్నారని వర్సిటీ న్యాయవాదులు తెలిపారు. వీరిలో 800 మంది భారతీయ విద్యార్థులు కూడా ఉన్నారు. కొంతమంది ఇతర విద్యా సంస్థల్లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తుండగా, మరి కొందరు ప్రవేశాలను వాయిదా వేసుకుంటున్నారని చెప్పారు. విదేశీ విద్యార్థుల సంఖ్య 15 శాతానికి మించకూడదని షరతు విధించిన నేపథ్యంలో చైనా వంటి దేశాల వారికి అధికారులు వీసాలు కూడా నిరాకరిస్తున్నారు. మరోవైపు హార్వర్డ్ యార్డ్‌లో జరిగిన సమావేశంలో 9,000 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ డిగ్రీలను అందుకున్నారు. ఈ సందర్భంగా హార్వర్డ్ ప్రెసిడెంట్ అలన్ గార్బర్ మాట్లాడుతూ విదేశీయులకు ద్వారాలు తెరిచే ఉంటాయని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కాగా, హార్వర్డ్‌పై అధ్యక్షుడు ట్రంప్ మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వర్సిటీని ఓ డిజాస్టర్‌గా అభివర్ణించారు. అక్కడి విద్యార్థులు సమస్యలను సృష్టించే(ట్రబుల్ మేకర్లు) అని వ్యాఖ్యానించారు. ఏటా 5 బిలియన్ డాలర్లకు పైగా నిధులు తీసుకుంటున్న హార్వర్డ్‌లో జాతి వ్యతిరేక ధోరణి పెరుగుతోందని విమర్శించారు.

ముగిసిన ట్రంప్-మస్క్ బంధం

» డోజ్ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించిన ఎలాన్ మస్క్

» ట్రంప్ బిల్లుపై వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే మస్క్ వైదొలగిన వైనం

వాషింగ్టన్, మే 29: ఫెడరల్ ప్రభుత్వ వ్యయాలను భారీగా తగ్గించడానికి ఏర్పాటైన 'డోజ్' చీఫ్‌గా వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్.. ఆ పదవి నుంచి తప్పుకొంటున్నట్టు సంచలన ప్రకటన చేశారు. ప్రత్యేక ప్రభుత్వ ఉద్యోగిగా తన షెడ్యూల్ ముగింపునకు వచ్చినందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు 'ఎక్స్'లో ఆయన తెలిపారు. అయితే, ట్రంప్ బడ్జెట్ ప్రణాళిక పట్ల మస్క్ తాజా గా తన నిరాశను ప్రకటించారు. ఈ ప్రణాళిక వల్ల పన్నుల్లో కోతల పరిమాణం పెరుగుతుందని, మిలిట రీ ఖర్చు భారీస్థాయికి చేరుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే ఆయన తాను డోజ్ చీఫ్ పదవి నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించడం గమనార్హం. దీంతో ట్రంప్-మస్క్ మధ్య బంధం ముగిసిపోయినట్టేనని భావిస్తున్నారు.

మేం దాడి చేసేలోపే.. బ్రహ్మోస్‌తో కొట్టారు

న్యూఢిల్లీ, మే 29: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ చేసిన దాడులతో తమ వైమానిక స్థావరాలకు జరిగిన నష్టంపై పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ నోరువిప్పారు. పాక్ సైన్యం మేల్కొనేలోపే బ్రహ్మోస్ క్షిపణులతో భారత్ విధ్వంసం సృష్టించిందని వెల్లడించారు. తాము దాడి చేసే లోపే భారత్ బ్రహ్మోస్ ప్రయోగించి తమ వైమానిక స్థావరాలను ధ్వంసం చేసిందని పేర్కొన్నారు. పాకిస్థాన్-తుర్కియే-అజర్‌బైజన్ మధ్య అజర్‌బైజన్ వేదికగా బుధవారం జరిగిన త్రైపాక్షిక సదస్సులో షరీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. మే 10న తెల్లవారుజామున భారత్‌పై తాము దాడి చేద్దామని అనుకున్నామని, ఆ లోపే భారత్ దాడి చేసిందని తెలిపారు. "భారత్ చేస్తున్న దాడులకు బదులు చెప్పాలని మే 9వ తేదీ రాత్రి మేము నిర్ణయించుకున్నాం. 10వ తేదీ ఉదయం ప్రార్థనల అనంతరం, నాలుగున్నర గంటలకు దాడి చేసి శత్రువు(భారత్)కు పాఠం చెప్పాలని అనుకున్నాం. కానీ, దాని కంటే ముందే మా సైన్యం ఊహించని విధంగా భారత్ మరోసారి దాడి చేసింది. రావల్పిండి విమానాశ్రయం సహా అనేక కీలక ప్రాంతాలపై బ్రహ్మోస్ క్షిపణులు ప్రయోగించింది" అని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. దాడుల ప్రణాళికను తమ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ తనకు ముందుగానే చెప్పారని షరీఫ్ వివరించారు. ఇక, ఇరుదేశాల మధ్య దీర్ఘకాలిక సమస్యలైన కశ్మీర్, నీటివాటాలు, ఉగ్రవాదం అంశాలపై కూర్చొని మాట్లాడుకుందామంటూ పాక్ ప్రధాని ఈ సందర్భంగా మరోమారు భారత్‌ను కోరారు. శాంతి కోసం ఇరుదేశాలు మాట్లాడుకోవాలని, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ప్రతిపాదించారు. ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి తీర్మానాలు, కశ్మీర్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కశ్మీర్ సమస్య పరిష్కారానికి సిద్ధమని అన్నారు. అలాగే, సీమాంతర ఉగ్రవాదంపైనా చర్చలకు సిద్ధమన్న షరీఫ్.. ఇరుదేశాల మధ్య వాణిజ్యం తిరిగి ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. అదే సమయంలో పాక్ తాగు, సాగు నీటి అవసరాలకు ఎంతో కీలకమైన సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో భారత్ తీరును తీవ్రంగా విమర్శించారు.

అప్పటిదాకా మాటల్లేవ్ : భారత్

పాకిస్థాన్‌తో శాంతి చర్చల విషయంలో తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ స్పష్టమైన, కఠినమైన చర్యలు తీసుకునేంత వరకు ఆ దేశంతో ఎలాంటి చర్చలు జరపబోమని పునరుద్ఘాటించింది. అలాగే, సీమాంతర ఉగ్రవాదానికి పాక్ మద్దతు ఇచ్చేంత వరకు సింధు నదీ జలా ల ఒప్పందం అమలు కాదని స్పష్టం చేసింది. ఉగ్రవాదులను అప్పగించడంతోపాటు పీవోకేను ఖాళీ చేసిన తర్వాతే జమ్మూకశ్మీర్ అంశంపై చర్చిస్తామని తేల్చిచెప్పింది. పాక్ ప్రధాని పిలుపునకు భారత్ ఇలా స్పందించింది. విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఈ మేరకు గురువారం మాట్లాడారు.

సాహితీ దిగ్గజం గూగీ వా థియాంగో కన్నుమూత

» కథ, నవల, నాటకం, విమర్శ తదితర ప్రక్రియల్లో అద్భుత సాహిత్యం

» తెలుగు సాహిత్యానికీ సుపరిచితుడే

» నోబెల్ స్థాయి రచయితగా గుర్తింపు

» ఆయన రాసిన నవలా పాత్ర మీద కూడా కేసు నమోదవడం నాడు సంచలనం

» గూగీ మృతికి సాహిత్యలోకం నివాళి




హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత కెన్యా రచయిత, ప్రపంచ ప్రసిద్ధ మార్క్సిస్టు సాహితీ దిగ్గజం గూగీ వా థియాంగో (87) ఇకలేరు. కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన మే 28 ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) అమెరికాలోని బ్యూఫోర్డ్ నగరంలో తుదిశ్వాస విడిచారు. గూగీ 1938లో కెన్యాలోని కియాంబు జిల్లా కమిరితాలో ఓ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల ప్రభావంతో.. విద్యార్థి దశలోనే రచనా వ్యాసంగం ప్రారంభించారు. కథ, నవల, నాటకం, విమర్శ తదితర సాహిత్య ప్రక్రియల్లో అద్భుత సృజన ఆయన సొంతం. నాడు ఆంగ్ల భాష ఆధిపత్యంపై ధిక్కార పతాకాన్ని ఎగరేశారు. తన మాతృభాష గికుయులో సాహిత్య సృజన చేసిన మొదటి వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. తమ దేశంలో ప్రజాస్వామ్యం కోసం నినదించారు. కెన్యాకు స్వాతంత్ర్యం వచ్చాక నాటి పాలకుల వివక్షాపూరిత పోకడలను నిరసిస్తూ 'ఐ విల్ మ్యారీ వెన్ ఐ వాంట్' నాటకం రాసి ప్రదర్శించారు. దీనితో 1977లో ఏడాది పాటు జైలు నిర్బంధంలో ఉన్నారు. ఆ సమయంలోనే టిష్యూ పేపర్‌పై 'డెవిల్ ఆన్ ది క్రాస్' నవల రాశారు. దాన్నే ప్రముఖ విప్లవ కవి వరవరరావు 'మట్టికాళ్ల మహారాక్షసి' పేరుతో తెలుగులోకి అనువదించారు. ఆయన రచనలతో పలుమార్లు నోబెల్ పోటీలో నిలిచారు. ఆ అవార్డు రాకున్నా.. నోబెల్ స్థాయి రచయితగా ప్రపంచమంతా గుర్తింపు పొందారు. గూగీ రాసిన 'ది అప్‌రైట్ రెవల్యూషన్' కథానిక 100 భాషల్లోకి అనువాదమవడం విశేషం. కెన్యాలో తీవ్ర నిర్బంధాన్ని, అణచివేతను ఎదుర్కొన్న గూగీ.. అమెరికాకు వలస వెళ్లారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో కంపారిటివ్ లిటరేచర్ ప్రొఫెసర్‌గా, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రైటింగ్ అండ్ ట్రాన్స్‌లేషన్ విభాగం మొదటి డైరెక్టర్‌గా పనిచేశారు.

భారతీయులు మెచ్చిన మహా రచయిత

గూగీ వా థియాంగో నవలలు 'బందీ', 'మాటిగరి', 'ఏడవకు బిడ్డ' పేరిట తెలుగులోకి అనువాదమయ్యాయి. ఆయన ఆత్మకథ మొదటి భాగాన్ని 'యుద్ధకాలంలో స్వప్నాలు-బాల్య జ్ఞాపకాలు' పేరుతో ఆచార్య జీఎన్ సాయిబాబా నాగపూర్ జైలులో ఉన్న సమయంలో అనువదించారు. నాంపల్లి తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో 2018 ఫిబ్రవరి 18న జరిగిన ఈ పుస్తకావిష్కరణ సభకు గూగీ అతిథిగా హాజరయ్యారు కూడా. ఉగాండాలోని మకెరెరె యూనివర్సిటీలో గూగీకి హైదరాబాదీ ప్రొఫెసర్ సుసీ తారు సహాధ్యాయి. అలా ఆయనకు భారతదేశంలోని దళిత, బహుజన, వామపక్ష ఉద్యమాలు, ముఖ్యంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రతో పరిచయం ఉంది. గూగీ రాసిన మాటిగరి నవల విడుదల అనంతరం.. అందులోని మాటిగరి పాత్ర మీద కూడా కెన్యా పోలీసులు కేసు నమోదు చేయడం ఆనాడు ఒక పెద్ద సంచలనంగా నిలిచింది. గూగీ రాసిన 'పెన్స్ అండ్ గన్స్', 'డీకాలనైజేషన్ మైండ్స్' తదితర రచనలు కన్నడ, మలయాళ తదితర భాషల్లోకి కూడా అనువాదం అయ్యాయి. గూగీతో తమకున్న అనుబంధంతోపాటు ఆయన సాహిత్య కృషిని కె.శ్రీనివాస్, వీక్షణం వేణుగోపాల్, మలుపు బాల్‌రెడ్డి, గుర్రం సీతారాములు తదితర తెలుగు సాహిత్య, సామాజిక రంగాలకు చెందిన వారంతా సామాజిక మాధ్యమాల వేదికగా గుర్తు చేసుకున్నారు. గూగీ 1996లో భారత్‌కు వచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన ఒక సదస్సులో ప్రసంగించారు. ఆ సమయంలోనే హుస్నాబాద్‌లోని అతిపెద్ద మావోయిస్టుల స్తూపాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

పాక్‌కు గూఢచర్యం అనుమానంపై రాజస్థాన్ ప్రభుత్వోద్యోగి అరెస్ట్

జైసల్మేర్, మే 29: పాక్ గుడాచార సంస్థ ఐఎస్ఐకి దేశ రహస్యాలు చేరవేస్తున్నాడన్న అనుమానంపై రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వోద్యోగి సకూర్‌ఖాన్ మంగళియార్‌ను సీఐడీ పోలీసుల బృందం బుధవారం అరెస్ట్ చేసింది. జైసల్మేర్‌లోని ఆయన ఆఫీసులోనే సకూర్‌ఖాన్ మంగళియార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు.. తదుపరి విచారణకు జైపూర్‌కు తరలించనున్నారు. అతడికి కాంగ్రెస్ నేతలతో సంబంధం ఉందని, గత ప్రభుత్వంలో ఆ పార్టీ నేతకు సహాయకుడిగా పని చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఓ సరిహద్దు గ్రామ వాసి సకూర్‌ఖాన్ ఫోన్‌లో పలువురు పాక్ పౌరుల ఫోన్ నంబర్లున్నాయి. తమ ప్రశ్నలకు సరైన జవాబులివ్వడం లేదని పోలీసు వర్గాలు తెలిపాయి.






తిరుమలకు పోటెత్తిన

భక్తులు

సర్వ దర్శనానికి 16 గంటల సమయం

సర్వ దర్శనం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, భక్తులతో కిటకిటలాడుతున్న తిరుమల ఆలయ పరిసరాలు

తిరుమల, మే 29(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగియనున్న నేపథ్యంలో తిరుమలకు భక్తులు పోటెత్తారు. వారాంతం కావడంతో గురువారం నుంచే కొండపై రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఒకటిన్నర కిలోమీటరు దూరం కృష్ణతేజ విశ్రాంతి గృహం మీదుగా శిలాతోరణం వరకు వ్యాపించింది. ఈ క్యూలో ఉన్న భక్తులకు స్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ఇక, టైంస్లాట్ టోకెన్, ఇతర దర్శన టికెట్లు ఉన్న భక్తులకు మూడు నుంచి నాలుగు గంటల సమయం తర్వాత దర్శనం లభిస్తోంది. ఆలయ పరిసరాలు, మాడవీధులు, అఖిలాండం, లడ్డూ కేంద్రం, అన్నప్రసాద భవనం, బస్టాండ్, గదులు కేటాయించే సీఆర్వో, ఎంబీసీ వంటి ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

ఎల్లుండి నుంచే రేషన్ షాపులు

- ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు సరకుల పంపిణీ
- ఉదయం 8 నుంచి 12.. సాయంత్రం 4 నుంచి 8 వరకు..
- దివ్యాంగులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటికే సరఫరా
- బెజవాడలో ట్రయల్ రన్ నిర్వహించిన మంత్రి నాదెండ్ల



అనంతపురం జిల్లా పాలాపురంలో రేషన్ బియ్యం నిల్వలను తనిఖీ చేస్తున్న తహసీల్దారు శేషా రెడ్డి

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ రేషన్ సరుకులను పంపిణీ చేసే ఎండీయూ వాహనాలను ప్రభుత్వం రద్దు చేయడంతో జూన్ ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా చౌక ధరల దుకాణాల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటి వరకు మొబైల్ డిస్పెన్స్ యూనిట్లలోని ఈ-పోస్ మిషన్లలో ఉన్న సాఫ్ట్‌వేర్‌ను తొలగించి.. రేషన్ డీలర్ల వద్ద నున్న ఈ-పోస్ మిషన్లలోకి కొత్త వెర్షన్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌లోడ్ చేశారు. రేషన్ షాపులోని ఈ-పోస్ మిషన్‌లో కార్డు నెంబరు ఎంటర్ చేసి.. కార్డుదారుల వేలిముద్రలు వేసి సరుకులు తీసుకునేలా సర్వం సిద్ధం చేశారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాల్లో సరుకులు పంపిణీ చేసేలా నిర్దేశించారు. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులకు మాత్రం ప్రతినెలా 5వ తేదీలోపే డీలర్లు సరుకులను ఇళ్లకే తీసుకువెళ్లి అందజేస్తారు. ఈ మేరకు వృద్ధులు, దివ్యాంగుల జాబితాలను సిద్ధం చేశారు. ఇళ్లు మారినవారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు గతంలో మాదిరిగానే పోర్టబులిటీ విధానంలో స్థానిక రేషన్ షాపుల్లో సరుకులు తీసుకునేందుకు అవకాశం కల్పించారు. డీలరు పేరు, ఫొటో, షాపు నెంబరు, గ్రామం, మండలం పేర్లు రాసిన బోర్డుతోపాటు సరుకుల నిల్వలు తెలియజేసే స్టాక్ బోర్డులను ప్రతి రేషన్ షాపు వద్ద తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. డీలర్ల ఆథరైజేషన్ సర్టిఫికెట్లతోపాటు తూనికలు-కొలతలశాఖ స్టాంపింగ్ రసీదులను తప్పనిసరిగా రేషన్ షాపులో ఉంచాలని అధికారులు నిర్దేశించారు. రేషన్ డీలర్లు దుకాణాలను పూలతో అందంగా అలంకరించుకుని.. కూటమి నాయకులతో తొలి రోజు లాంఛనంగా సరుకుల పంపిణీ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీ ఏర్పాట్లను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం పరిశీలించారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్‌తో కలిసి విజయవాడ మధురానగర్‌లోని 218వ నంబరు రేషన్ షాపును మంత్రి సందర్శించారు. ఈ-పోస్ మిషన్‌లో కొత్త సాఫ్ట్‌వేర్ పనితీరును పరిశీలించారు. సరుకుల పంపిణీ ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎండీయూ వాహనాలెప్పుడు వస్తాయో తెలియక కార్డుదారులు సరుకుల కోసం రోడ్ల మీద తిరగాల్సిన పరిస్థితి ఉండేదని చెప్పారు. రేషన్ షాపుల్లోనే సరుకులు పంపిణీ చేయనున్నందున కార్డుదారులకు ఇప్పుడా కష్టాలు ఉండవన్నారు. బియ్యం అక్రమ రవాణా, అవినీతి జరగకుండా పౌరసరఫరాలశాఖ సరికొత్త యాప్‌ను రూపొందించిందన్నారు. డీలర్ల ఫొటోలతోసహా పూర్తి వివరాలు యాప్‌లో ఉంటాయని తెలిపారు. రేషన్ షాపు వద్ద క్యూలో ఎక్కువ మంది నిలుచున్నా యాప్ ద్వారా తెలుస్తుందన్నారు.

ఆంధ్ర అభివృద్ధిలో దూసుకుపోతోంది

- తెలంగాణ ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో పొరుగు రాష్ట్రం ఏపీ దూసుకుపోతోంది అని తెలంగాణ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. గురువారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలో ఉంటే బాగుండేదని రాష్ట్ర ప్రజలు అనుకుంటున్నారు. బాధ్యతాయుత ఎంపీగా, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ ఎదుట హాజరవుతా. 'పదేళ్లపాటు కేసీఆర్‌ను నమ్మి ఓటేసిన పాపానికి నట్టేట ముంచగా... పది నెలలకే రేవంత్ సర్కార్ మమ్మల్ని నిండా ముంచింది' అని రాష్ట్ర ప్రజలు అంటున్నారు. ఇదీ ఈ రాష్ట్ర రాజకీయాల్లో వచ్చిన పెనుమార్పు" అని ఈటల అన్నారు.

రాజారెడ్డి అంటే ధైర్యం, సాహసం, పట్టుదల: షర్మిల

- ఆయన శతజయంతి సందర్భంగా తల్లితో కలిసి నివాళులు

పులివెందుల రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): 'రాజారెడ్డి అంటేనే ధైర్యం, సాహసం, పట్టుదల' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. వైఎస్ రాజారెడ్డి శతజయంతి సందర్భంగా గురువారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో పులివెందులలో వైఎస్ షర్మిల, వైఎస్ సతీమణి విజయలక్ష్మి... రాజారెడ్డి సమాధి వద్ద పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రార్థనలు చేశారు. అనంతరం పులివెందులలోని సీఎస్‌ఐ చర్చి వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కుటుంబం పట్ల రాజారెడ్డి చూపిన బాధ్యతను, అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

తీరం దాటిన తీవ్ర వాయుగుండం

- నేడు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గురువారం తీవ్ర వాయుగుండంగా బలపడి బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్ మధ్య తీరం దాటింది. ఇది రానున్న 12 గంటల్లో మరింత బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములతో వర్షాలు కురిశాయి. సముద్రం అల్లకల్లోలంగా మారినందున కోస్తాలోని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కాగా, వాయుగుండం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం 20 జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కోస్తాంధ్రలో శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకు, రాయలసీమలో నంద్యాల, వైఎస్సార్ కడప, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది.

పేలుళ్ల కుట్ర.. అదుపులో మరో ఇద్దరు

విజయనగరం/క్రైం, మే 29(ఆంధ్రజ్యోతి): సిరాజ్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌లు కస్టడీలో వెల్లడించిన అంశాలపై దర్యాప్తు అధికారులు స్పీడ్ పెంచారు. ఇందులో భాగంగా వరంగల్‌కు చెందిన పర్హాన్ మొహిద్దీన్, ఖాజీపేటకు చెందిన మరో యువకుడిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విజయనగరంలో సిరాజ్, సమీర్‌లను విచారిస్తున్న సమయంలోనే అధికారులు పలు రాష్ట్రాల్లో అనుమానితులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు విజయనగరం టూటౌన్ పోలీసులు గురువారం సిరాజ్‌తో పాటు అతని కుటుంబ సభ్యుల ఆర్థిక లావాదేవీలపై ఆరాతీశారు. బ్యాంకు అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఒకటినే జీతాలివ్వడం ఆనందంగా ఉంది

- ఉద్యోగుల మిగతా సమస్యలపైనా ప్రభుత్వం దృష్టి సారించాలి: బొప్పరాజు

మహారాణిపేట(విశాఖ సిటీ), మే 29(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు అందుతుండడం చాలా ఆనందంగా ఉందని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం ఆయన విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ జీతాల విషయంలో న్యాయం చేస్తున్న ప్రభుత్వం.. ఉద్యోగుల మిగతా సమస్యలపై కూడా దృష్టిసారించాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిల్లో ఇప్పటివరకు రూ.5 వేల కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, బకాయిల్లో ఇవి పది శాతం మాత్రమేనని చెప్పారు. నాలుగైదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు పూర్తిగా ఆగిపోయాయని చెప్పారు. ఉద్యోగుల హెల్త్ కార్డులపైనా దృష్టి సారించాలని, వాటి ద్వారా అన్ని ఆస్పత్రుల్లో సేవలందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 12వ పీఆర్సీ వేయాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్కసారి కూడా ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించలేదని, ఈ నెల 28న ప్రిన్సిపల్ సెక్రటరీతో జరిగిన సమావేశంలో సీఎంను కలిసే అవకాశం కల్పించాలని కోరినట్టు చెప్పారు.

జర్నలిస్టుల అక్రిడేషన్ మరో మూడు నెలలు పొడిగింపు

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో వాటి కాల పరిమితిని మరో మూడు నెలల పాటు జూన్ 1, 2025 నుంచి ఆగస్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డుల జారీ ప్రక్రియ చేపట్టడం... ఏది ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు.

చీరాల మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్-1 తొలగింపు

చీరాల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ జె.శ్రీనివాసరావు, వైస్‌చైర్‌పర్సన్-1 జైసన్ బాబును తొలగిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 14న చీరాల మున్సిపాలిటీలో నిర్వహించిన అవిశ్వాస తీర్మానంలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్-1ను తొలగిస్తూ 27 మంది కౌన్సిలర్లు తీర్మానించారు. ఆ మేరకు కలెక్టర్, మున్సిపల్ శాఖకు లేఖ రాయడంతో ప్రభుత్వం వారిద్దరిని తొలగిస్తూ ఆదేశాలిచ్చింది.

పలు స్థానిక సంస్థల స్థాయి పెంపు

రాష్ట్రంలో పలు మున్సిపల్ స్థానిక సంస్థలను అప్‌గ్రేడ్ చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గిద్దలూరు నగర పంచాయతీని గ్రేడ్-2 మున్సిపాలిటీగాను, నరసరావుపేట మున్సిపాలిటీని గ్రేడ్-1 స్థాయి నుంచి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగాను, యర్రగుంట్ల నగర పంచాయతీని గ్రేడ్-2 మున్సిపాలిటీగాను, ఎమ్మిగనూరు మున్సిపాలిటీని గ్రేడ్-1 నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగాను అప్‌గ్రేడ్ చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

విశాఖలో తొలి కొవిడ్ మృతి?

- 64 ఏళ్ల వృద్ధుడి మరణం
- ఇప్పటి వరకూ మూడు కేసులు

విశాఖపట్నం, మే 29(ఆంధ్రజ్యోతి): కరోనా మళ్లీ కోరలు చాస్తోంది. విశాఖపట్నంలో గురువారం తొలి కొవిడ్ మరణం నమోదైంది. హెచ్‌బీ కాలనీకి చెందిన 64 ఏళ్ల వ్యక్తి న్యుమోనియా, బీపీ, షుగర్ తదితర రుగ్మతలతో బాధపడుతూ చికిత్స కోసం మూడు రోజుల క్రితం ప్రభుత్వ అతిథి గృహానికి సమీపంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేరారు. ప్రైవేటు ల్యాబ్‌లో కరోనా పరీక్ష చేయించగా పాజిటివ్ అని తేలింది. ఆయనకు పార్కిన్‌సన్స్ వ్యాధి కూడా ఉందని వైద్య వర్గాలు తెలిపాయి. పరిస్థితి విషమించి గురువారం ఉదయం 7.41 గంటలకు మృతి చెందాడు. మృతదేహానికి జ్ఞానాపురం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, 'విశాఖపట్నంలో కరోనాతో ఎవరూ మరణించలేదు. అరవై ఏళ్లు దాటిన ఓ వ్యక్తి కరోనాతో మరణించినట్టు ప్రచారం జరుగుతోంది. కానీ ఆ వ్యక్తి ఇతర కారణాలతో మరణించారు. కొవిడ్ మరణంగా ధ్రువీకరించాలంటే విశాఖ కేజీహెచ్‌లోని వీడీఆర్‌ఎల్ లేబొరేటరీలో ఆర్‌టీపీసీఆర్ పరీక్షలో పాజిటివ్ రావల్సి ఉంటుంది. కానీ ఇక్కడ పాజిటివ్ రిపోర్ట్ వచ్చిన వారు ఎవరూ చనిపోలేదు' అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు నగరంలో మూడు కేసులు నమోద య్యాయి. గతంలో పిఠాపురం కాలనీలో రెండు కేసులు నమోదవగా బాధితులు ఇప్పుడు ఆరోగ్యంగానే ఉన్నారు.

కర్ణాటకలో పెరుగుతున్న కొవిడ్ కేసులు

- ఇప్పటి వరకూ 148
- 24 గంటల్లో 42 పాజిటివ్‌లు
- బెళగావిలో తొలి మరణం నమోదు

బెంగళూరు, మే 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. జ్వరం, దగ్గు, శ్వాసకోశ సమస్యలతో ఆసుపత్రులకు వచ్చేవారికి కొవిడ్ పరీక్ష తప్పనిసరి చేస్తున్నారు. ఇప్పటి దాకా రాష్ట్ర వ్యాప్తంగా 148 కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. గడిచిన 24 గంటల వ్యవధిలో 42 మందికి పాజిటివ్ రాగా, 19 మంది డిశ్చార్జి అయ్యారు. తొలి కొవిడ్ మరణం బెళగావిలో నమోదైంది. బెళగావి మెడికల్ కళాశాల ఆసుపత్రికి బుధవారం 70 ఏళ్ల వృద్ధుడిని తీసుకువచ్చారు. బెనకనహళ్లికి చెందిన ఆయనకు వృద్ధాప్య సమస్యలు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు అనుమానంతో పరీక్షలు నిర్వహించగా, కొవిడ్ పాజిటివ్ వచ్చింది. చికిత్స పొందుతున్న వృద్ధుడు బుధవారం రాత్రి మృతి చెందారు. కొవిడ్ నిబంధనల ప్రకారం ఆయనకు రాత్రికి రాత్రే అంత్యక్రియలు నిర్వహించారు.

ఏవోబీలో ఎదురు కాల్పులు

- మావోయిస్టు కీలక నేత జూనియర్ హిడ్మా అరెస్టు



ఒడిశా పోలీసులు అరెస్టు చేసిన మావోయిస్టు నేత జూనియర్ హిడ్మా (నల్ల చొక్కా వ్యక్తి)

సీలేరు (అల్లూరి జిల్లా), మే 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు, మావోయిస్టులకు మధ్య గురువారం ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మావోయిస్టు కీలక నేత జూనియర్ హిడ్మాను అరెస్టు చేశారు. పెద్దఎత్తున పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలోని కోరాపుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోరాపుట్ జిల్లా బోయిపర్‌గూడా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేటగూడ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై పక్కా సమాచారం అందుకున్న పోలీసులు.. ఏఎస్పీ పార్థకశ్యప్ నేతృత్వంలో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం తెల్లవారుజామున కొండపై క్యాంప్ నిర్వహిస్తున్న మావోయిస్టులు కనిపించగా, ఆ కొండను చుట్టుముట్టారు. మావోయిస్టులు కొండ పైనుంచి కాల్పులు జరుపుతూ తప్పించుకున్నారు. ఘటనా స్థలంలో పోలీసులు గాలిస్తుండగా.. తప్పించుకోవడానికి ప్రయత్నించిన ఇద్దరు మావోయిస్టుల్లో ఒకరిని పట్టుకున్నారు. అతడిని మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు కుంజమ్ హిడ్మా అలియాస్ జూనియర్ హిడ్మా అలియాస్ మోహన్‌గా గుర్తించారు. హిడ్మా నుంచి ఏకే47 తుపాకీ, 35 రౌండ్ల తూటాలు, 117 ఎలక్ట్రిక్, నాన్ ఎలక్ట్రిక్ డిటొనేటరు స్వాధీనం చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లాలో అనిశ్చితి


ఎన్నికలు డిసెంబరులోనే జరగాలంటూ ఖలీదాజియాకు చెందిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) బుధవారం నిర్వహించిన భారీ ప్రదర్శన అక్కడి రాజకీయ పరిస్థితులకు అద్దంపడుతోంది. బిఎన్‌పి కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఖలీదా కుమారుడు అయిన తారిఖ్ రహ్మాన్ లండన్ నుంచి ఒక వీడియోలింక్ ద్వారా వేలాది మంది కార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. గత పదినెలల కాలంలో మహ్మద్ యూనిస్ ప్రభుత్వాన్ని బిఎన్‌పి ఎన్నడూ ఇంతగా తప్పుబట్టలేదు. తాత్కాలిక ప్రభుత్వాలంటే ఓ మూడునెలల్లో ఎన్నికలు జరిపి, ప్రజలు ఎన్నుకున్నవారికి అధికారం అప్పగించాలే తప్ప, ఏళ్ళకు ఏళ్ళు దేశాన్ని పాలించవని ఆయన విమర్శించారు. ఎన్నికలతో సంబంధం లేకుండా అధికారాన్ని అనుభవిస్తున్నవారు విదేశాంగ విధానాన్ని ఎలా నిర్ణయిస్తారు, దేశభవిష్యత్తుతో ముడివడిన కీలక నిర్ణయాలు ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. నోబెల్ విజేత మహ్మద్ యూనిస్‌కు పదవీకాంక్ష పట్టుకుందని, ఎన్నికల నిర్వహణను కుట్రపూరితంగా వాయిదావేస్తూ, అధికారాన్ని అనుభవిస్తున్నారన్న అర్థం వచ్చేలా తారీఖ్ వ్యాఖ్యలు చేశారు. డిసెంబరులో ఎన్నికలు జరపాలన్న ఈ డిమాండ్‌కు జవాబుగా, వచ్చే ఏడాది జూన్ లోపు గ్యారంటీ అంటూ టోక్యోలో ఉన్న యూనిస్ సమాధానం చెప్పారు. ఎవ్వరు ఏమనుకున్నా ఎన్నికలకు ఇంకొంత సమయం పడుతుందన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం.

డిల్లీకాదు, పిండి కాదు, బంగ్లాదేశ్‌కే ప్రాధాన్యం అంటూ ఈ ప్రసంగంలో తారిఖ్ రహ్మాన్ ఉద్ఘాటించడమే కాక, కార్యకర్తలతో పలుమార్లు నినాదాలు చేయించారు. న్యూఢిల్లీతో, రావల్పిండితో రాసుకుపూసుకోవడం కాక, బంగ్లాదేశ్ ప్రయోజనాలే తనకు ముఖ్యమని అర్థం. రేపు ఈ పార్టీ అధికారంలోకి వస్తే, ఆచరణ అలాగే ఉంటుందన్న నమ్మకం ఏ మాత్రం లేదు. పాకిస్థాన్‌తో ఖలీదాజియా కుటుంబానికి ఉన్న అనుబంధం తెలియనిదేమీ కాదు. కానీ, తాత్కాలికంగా కుర్చీలో కూర్చున్న యూనిస్ కఠినమైన భారత వ్యతిరేకవైఖరి తీసుకొని, పాకిస్థాన్‌తో రాసుకుపూసుకు తిరుగుతున్న నేపథ్యంలో, ఆ విధానాన్ని ప్రశ్నిస్తూ, దేశానికి నష్టం జరుగుతోందని తారిఖ్ హెచ్చరించడం విశేషమైనదే.

హసీనాను దేశం నుంచి వెళ్ళగొట్టి పదినెలలు అవుతున్నా ఇంకా ఎన్నికల దిశగా అడుగులుపడకపోవడం బిఎన్‌పికి ఆగ్రహం కలిగిస్తోంది. సమస్త వ్యవస్థలు కట్టకట్టుకొని అవామీలీగ్ మీద నిషేధం విధించి, ఎన్నికల్లో పాల్గొనకుండా చేసిన నేపథ్యంలో, తనకు ఇక ఎదురుండదన్న ధైర్యం బిఎన్‌పికి వచ్చింది. ఎన్నికలు వెంటనే జరిగితే తనకు ఘన విజయం ఖాయమన్న నమ్మకంతోపాటు, ఆలస్యమవుతున్న కొద్దీ కొత్తశక్తులు బలపడతాయన్న భయం దానిది. వెంటనే ఎన్నికల రోడ్‌మ్యాప్ ప్రకటిస్తేనే ప్రభుత్వానికి సహకరిస్తానని అది బెదిరిస్తోంది. హసీనా విధించిన నిషేధంనుంచి ఈ మధ్యనే బయటపడిన జమాతే ఇస్లామీ కూడా బిఎన్‌పి వాదనలనే బలపరుస్తోంది. హసీనామీద తిరుగుబాటుచేసిన విద్యార్థులంతా ఏర్పాటు చేసుకున్న జాతీయ నాగరిక్ పార్టీ (ఎన్సీపీ) మాత్రం ముందుగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం పట్టుబడుతోంది. బిఎన్‌పిని ఈ యువకులంతా అణచివేతకు, నియంతృత్వానికీ మారుపేరుగా, మరో అవామీలీగ్‌గా అభివర్ణిస్తున్నారు. ఎన్నికలు జరిగేలోగానే సమస్తవ్యవస్థల ప్రక్షాళన పూర్తికావాలని, ఎన్నికల, రాజకీయ సంస్కరణలు సమూలంగా జరగాలని వీరు పట్టుబడుతున్నారు. మరోపక్క, దేశభద్రతకు సంబంధించిన కీలక నిర్ణయాలు మీరెలా తీసుకుంటారంటూ ఆర్మీచీఫ్ వకార్ కూడా యూనిస్‌ను ప్రశ్నిస్తున్నారు. ఆర్మీకీ, యూనిస్‌కు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొని, ఒక దశలో సైన్యం తిరుగుబాటు అవకాశాలమీద విశ్లేషణలు కూడా వెలువడ్డాయి. రోహింగ్యాలకు మానవతా సాయం, చట్టోగ్రామ్ పోర్టు విదేశీ నిర్వహణ, ఎలాన్‌మస్క్ స్టార్ లింక్‌కు అనుమతి ఇత్యాది విషయాల్లో ఈ ఘర్షణ ఇంకా పెరిగింది. హసీనాకు వ్యతిరేకంగా ఉద్యమించి, ఆమెను దేశం విడిచిపోయేట్టుగా చేసి, అమెరికా ఆదేశాలమేరకు యూనిస్‌ను తాత్కాలిక అధినేతగా ప్రకటించడం వరకూ మనకు కనిపించిన ఏకాభిప్రాయం ఇప్పుడు లేకుండా పోవడం విచిత్రం. హసీనాపార్టీని నిషేధించి, ఆ నాయకులను జైళ్ళలో కుక్కుతున్న నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు ఎప్పుడు జరిగినా, అవి విస్తృత ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించబోవన్నది వాస్తవం.

బలూచీ నుంచీ పాఠం నేర్చుకోవాలా?

రాజకీయాలను రెండు రకాలుగా చూడొచ్చు. స్థూల దృష్టితో చూసి రేఖామాత్రంగా ఒక అవగాహన ఏర్పరచుకోవటాన్ని మొదటిదిగా చెప్పుకోవచ్చు. సాధారణ పౌరులు చాలావరకూ ఈ దృష్టితో సరిపెట్టుకుంటారు. దీనికి భిన్నంగా సూక్ష్మదృష్టితో రాజకీయాలను చూసి అందులోని మంచిచెడులను లోతుగా అవగాహన చేసుకుని వ్యూహాత్మక ప్రయోజనాల కోసం వాడుకోవటం రెండోదిగా భావించొచ్చు. ముఖ్యంగా విదేశీ వ్యవహారాల విషయంలో రెండోదానికి చాలా ప్రాధాన్యం ఉంటుంది. దీన్ని ప్రస్తుత పరిస్థితుల్లో అర్థంచేసుకోటానికి బలూచీస్థాన్ వ్యవహారాలను నిదర్శనంగా తీసుకోవచ్చు. కశ్మీరు సమస్యను పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికల మీద లేవనెత్తినప్పుడల్లా బలూచీస్థాన్‌లో మీరేం చేస్తున్నారంటూ భారత్ తరఫు నుంచి ప్రశ్నించటం ఇటీవల ఎక్కువైంది. సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ కొన్నాళ్ల క్రితం పాకిస్థాన్‌ను ఇలాగే హెచ్చరించారు. పహల్గాం దారుణం అనంతరం బలూచీస్థాన్ వేర్పాటువాదులు పాక్ భద్రతాదళాలపై దాడులను ముమ్మరం చేశారు. కొంత ప్రాంతం పాక్ నుంచి విముక్తం అయినట్లు ప్రకటించారు. అంతకుముందు జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును నిర్బంధించి పాక్ సైన్యంతో ముఖాముఖీ తలపడ్డారు. అటూఇటూ చాలా ప్రాణనష్టం అనంతరం మాత్రమే పాక్ భద్రతాదళాలు పరిస్థితిపై పట్టుసాధించినట్లు ప్రకటించుకున్నాయి. ఈ తరహా హింసాత్మక చర్యలు బలూచీ చరిత్రలో కొత్తవి కావు. 1948 నుంచి ఇప్పటి వరకూ ఏదోరూపంలో కొనసాగుతూనే ఉన్నాయి.



బలూచీ చరిత్ర చెప్పే సత్యం ఒక్కటే. రాజకీయ, ఆర్థిక అధికారాల్లో సముచిత ప్రాతినిధ్యం ఇవ్వకుండా, రాష్ట్రాల అధికారాలకు కత్తెరవేస్తూ, జాతీయ సమగ్రత పేరుతో ప్రాంతీయ ఆకాంక్షలను నేలరాస్తూ, వేర్పాటువాదులుగా ముద్రలువేస్తూ, సైనికబలంతో సమస్యలను పరిష్కరిద్దామనే వ్యూహం లెక్కలేనన్ని విపరిణామాలకు దారితీస్తుంది. హింసనే నమ్ముకునే విపరీత భావజాలాలను సృష్టిస్తుంది. బలూచీస్థాన్ అనుభవం నుంచి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠం అదే!

బలూచీస్థాన్ సమస్యను వ్యూహాత్మక దౌత్య ప్రేమతో కాకుండా అక్కడి ప్రజల దృష్టి నుంచి చూస్తే... దారుణ అణచివేతలు, చిందిన రక్తపాతాలు, విచ్చలవిడి వనరుల దోపిడీలు, స్థానికులను అధమస్థానంలోకి నెట్టటం, రాజకీయ అధికారంలో భాగస్వామ్యాన్ని నిరాకరించటం, స్వపరిపాలనా కాంక్షను జాతి విద్రోహంగా పరిగణించటం, సైనిక బలంతో పెత్తనం సాగించటం, స్థానిక తెగలను అభివృద్ధి నిరోధకులుగా ముద్రవేయటం, రాజకీయ ప్రత్యర్థులను మాయం చేయటం, బూటకపు ఎన్‌కౌంటర్లతో ప్రజలను మట్టుబెట్టటం, స్థానిక భాషను తృణీకరించటం.. లాంటి ఎన్నో దురాగతాలతో ఆ నేలకు నిలువెల్లా గాయాలయినట్లు స్పష్టంగా కనపడుతుంది. పాక్‌కు బలూచీస్థాన్ పక్కలో బల్లెంలా మారటం మనలో కొందరికి సంతోషం వేయవచ్చు. అక్కడి ప్రభుత్వ వ్యతిరేక ప్రతిఘటనా రాజకీయాలకు వివిధ రూపాల్లో సహాయాన్ని అందించటం మన దౌత్యవ్యూహ చాతుర్యంగా భావించొచ్చు. కానీ దానికి మించి అక్కడి పరిస్థితిని సమగ్ర దృష్టితో, మానవతాకోణం నుంచి చూస్తే ఎన్నో గుణపాఠాలనూ నేర్చుకోవచ్చు. స్వపాలనా ఆకాంక్షలను, జాతి గుర్తింపు కోసం చేసే ప్రయత్నాలను బలప్రయోగంతో అణచివేస్తే తీవ్రవాదాలు పుట్టుకొచ్చి పరిస్థితిని ఎంత భయంకరంగా మార్చుతాయో తెలుసుకోవచ్చు. బ్రిటిషు పాలకులు, ఆ తర్వాత అమెరికా, సోవియట్ రష్యా, చైనా సాగించిన నిర్వాకాలతో అక్కడి పరిస్థితి విషమంగా మారి జన జీవితాల్ని ఎంత ఛిద్రంచేసిందో అర్థం చేసుకోవచ్చు.

బలూచీస్థాన్ చరిత్రే చాలా విచిత్రమైంది. అదెన్నో మలుపులు తిరిగింది. ఏ మలుపులోనూ స్థానికుల స్వరాన్ని లెక్కచేయకపోవటమే అక్కడ కనిపిస్తుంది. బ్రిటిషు వలసపాలకులు బలూచీస్థాన్‌లో అడుగుపెట్టే నాటికి అక్కడ బలమైన రాజ్యవ్యవస్థ లేదు. తెగల సమాహారంగా సమాజం ఉండేది. తెగల నాయకులు, పెద్దలు చెప్పేదే చెల్లుబాటు అయ్యేది. పన్నులను, శిస్తులను కూడా వాళ్లే నిర్ణయించేవాళ్లు. సున్నీ ముస్లిం మతం ప్రబలంగా ఉన్నా అది తెగల హద్దులను దాటి అందరినీ ఏకంచేసే స్థాయికి చేరలేదు. మతం జాతీయతా భావాన్ని కలగచేయలేదు. పర్షియన్, ఆఫ్ఘాన్, సింధీ, సిక్కు సైన్యాలు బలూచీస్థాన్‌పై దండెత్తినా తెగలను పూర్తిగా లొంగదీసుకోలేకపోయాయి. తెగల నుంచి కప్పం వసూలు చేసుకుని వాటి అంతర్గత విషయాల్లో పెద్దగా జోక్యం చేసుకోని పరిస్థితే ఉండేది. 18వ శతాబ్దంలో మాత్రమే తెగలను ఒక రాజ్యవ్యవస్థ కిందకు సమీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయి. కలాత్ ప్రాంతానికి చెందిన నజీర్‌ఖాన్ సారథ్యం కింద 25000 మందిని సైనికులుగా సమీకరించటంతో అక్కడ ప్రాథమిక రాజ్యవ్యవస్థ ఏర్పాటైంది. నజీర్‌ఖాన్ మరణం (1794) తర్వాత ఆ వ్యవస్థ కూడా బలహీనపడి పోయి, మళ్లీ విడివిడి తెగల ప్రాబల్యం పెరిగింది. కలాత్ ఖాన్‌ల కింద ఉన్న ప్రాంతంలోనే రాజ్యవ్యవస్థ కాస్త బలంగా ఉండేది. ఈ పరిస్థితి 1884 వరకూ కొనసాగింది. ఆ ఏడాది బ్రిటిషు వలసపాలకులు బలూచీస్థాన్‌ను మొత్తంగా స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. బ్రిటిషు సైన్యం రాకపోకలకూ రవాణా అవసరాలకూ వారికి బలూచీస్థాన్ కావాల్సి వచ్చింది. అందుకోసం కలాత్ పాలకుడితో ఒప్పందం కుదుర్చుకున్నారు. దాన్ని కొన్ని తెగలు గుర్తించకుండా బ్రిటిషు వారికి అడ్డంకులు సృష్టించాయి. దీన్ని సాకుగా తీసుకుని కలాత్ మీద దాడి చేసి అక్కడి ఖాన్‌ను చంపేశారు. బలూచీస్థాన్‌ను ఏడు ముక్కలు చేశారు. రెండు ముక్కలను ఇరాన్, ఆఫ్ఘానిస్థాన్‌ల్లో కలిపారు. మూడో భాగాన్ని బ్రిటిష్ బలూచీస్థాన్ పేరుతో తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. మిగతా నాలుగు ముక్కల్లో కలాత్ కింద కొంత భాగాన్ని మిగిలిన మూడు ముక్కలను మూడు చిన్న సంస్థానాల కింద విభజించారు. దేశ విభజన నాటికి బలూచీస్థాన్‌ను ఏంచేయాలన్న ప్రశ్న వచ్చినప్పుడు బ్రిటిషు పాలకులు గతంలో ఇరాన్, ఆఫ్ఘానిస్థాన్‌ల్లో తాము కలిపేసిన ప్రాంతాల గురించి ఆలోచించలేదు. భారత్, పాక్‌ల్లో దేంట్లోనైనా చేరేందుకూ అందుకు ఇష్టం లేకపోతే స్వతంత్రంగా ఉండేందుకూ అప్పటి సంస్థానాలకు స్వేచ్ఛను ఇచ్చారు. మూడు చిన్న సంస్థానాలు పాకిస్థాన్‌లో చేరటానికి అంగీకరించినా కలాత్ పాలకుడు స్వతంత్రంగా ఉండటానికే నిర్ణయించుకున్నాడు. 1947 ఆగస్టు 15న స్వతంత్ర పాలకుడిగా తనను ప్రకటించుకున్నాడు. ఎంతో ఒత్తిడి వచ్చినా రక్షణ, విదేశీ వ్యవహారాలు మినహా మిగతా వ్యవహారాల్లో స్వయం నిర్ణయాధికారాన్నే కోరుకోవటంతో 1948 ఏప్రిల్‌లో పాక్ సైనిక చర్యను చేపట్టి విలీనం చేసుకుంది. 1947కు ముందు నుంచీ కూడా ప్రత్యేక దేశంగా ఉండటానికి బలూచీలు గట్టిగానే ప్రయత్నించారు. పాక్‌లో బలవంతంగా కలిపేసుకున్నా ఒక రాష్ట్రంగా సొంతంగా వ్యవహారాలు నడిపే హక్కుని కూడా ఇవ్వకపోవటంతో బలూచీల విషాదం మొదలైంది.


▪ రాహుల్ కుమార్

బలూచీల హక్కులను నిరాకరించటం పాక్ వ్యవస్థాపకుడైన జిన్నాతోనే మొదలైంది. బలూచీస్థాన్‌ని నియంత్రించటానికి తన నేతృత్వంలో ఒక సలహా మండలిని ఏర్పాటు చేసుకున్నారు. సర్వాధికారాలు కేంద్రం గుప్పిట్లో పెట్టుకునే వ్యవహారాలు అట్లా ఆనాడు మొదలయ్యాయి. అయూబ్ ఖాన్ సైనిక పాలనలో (1958) దేశం మొత్తాన్ని రెండు విభాగాలు చేశారు. దాన్నే 'వన్ యూనిట్ స్కీం'గా పిలిచేవారు. తూర్పు బెంగాల్‌ను ఒక యూనిట్‌గా, పశ్చిమ ప్రాంతాలను మరో యూనిట్‌గా పరిగణించటంతో రాష్ట్రాల హక్కులన్నీ హరించుకుపోయాయి. ఆ పరిస్థితిని వ్యతిరేకిస్తూ బలూచీస్థాన్‌లో మొదలైన ప్రతిఘటనను సైన్యంతో అణచివేశారు. 1962లో వామపక్ష అనుకూల జాతీయవాదులకూ ఆ పరిస్థితి తప్పలేదు. 1973 నుంచి 1977 వరకూ సాగిన అణచివేత బలూచీస్థాన్ చరిత్రలోనే అత్యంత ఘోరమైంది. 5300 మంది గెరిల్లాలూ, 3300 మంది సైనికులూ మరణించారు. పౌరుల మరణాలకు లెక్కేలేదు. 55000 బలూచీలు ఆయుధాలు పట్టారు. ఎన్నుకున్న ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయటంతో ఆనాటి ప్రతిఘటన రాజుకుంది. పాక్‌లో వయోజన ఓటు హక్కు కింద మొదటి ఎన్నికలు 1970లోనే జరిగాయి. ఇక ఆ ఏడాదే బలూచీస్థాన్‌కు రాష్ట్ర ప్రతిపత్తినీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన నేషనల్ అవామీ పార్టీ స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వటం మొదలుపెట్టింది. బలూచీ ఆకాంక్షలను ఒక్కొక్కటిగా తీర్చటానికి అడుగులు వేయటం ప్రారంభించింది. పాక్ పాలకులకు అవి జాతి వ్యతిరేక చర్యలుగా కనపడ్డాయి. ప్రధానిగా జుల్ఫికర్ అలీ భుట్టోను పదవీచ్యుతుడ్ని చేసిన సైనిక పాలకులు కాల్పుల విరమణను ప్రకటించారు. ఆఫ్ఘనిస్థాన్‌లో రష్యా సేనల ప్రవేశంతో (1979) పరిస్థితి మారిపోయింది. బలూచీల పోరాటం వెనుకపట్టు పట్టింది. 1999లో ముషారఫ్ సైనిక పాలన రావటంతో మళ్లీ చిచ్చురగిలింది. చైనా-పాక్ ఎకనమిక్ కారిడార్‌లో భాగమైన గ్వాదర్ పోర్టు నిర్మాణంతో మొత్తం కారిడార్‌పైనే వ్యతిరేకత తలెత్తింది. స్వదేశీ-విదేశీ పెత్తనాలపై బలూచీల పోరాటం మళ్లీ ఉధృతమైంది. 2005 నుంచి పరిస్థితి రగులుతున్న రాక్షసి బొగ్గులాగానే తయారైంది. ఒకప్పుడు తెగల నాయకుల నుంచి నాయకులూ, గెరిల్లాలూ వస్తే రెండు దశాబ్దాల నుంచి మధ్య తరగతి, నగర జీవుల నుంచి ఆందోళనకారులు పుట్టుకొస్తున్నారు. రకరకాల పేర్లతో బలూచీ విముక్తి దళాలు రంగంలోకి వచ్చాయి. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, కిడ్నాపులు, ఆత్మాహుతి దాడులు, భద్రతా దళాలపై బాంబులు వేయటం నిత్యకృత్యంగా మారిపోయాయి.

1947కు ముందు నుంచీ కూడా ప్రత్యేక దేశంగా ఉండటానికి బలూచీలు గట్టిగానే ప్రయత్నించారు. పాక్‌లో బలవంతంగా కలిపేసుకున్నా ఒక రాష్ట్రంగా సొంతంగా వ్యవహారాలు నడిపే హక్కుని కూడా ఇవ్వకపోవటంతో బలూచీల విషాదం మొదలైంది.

ఆఫ్ఘాన్ సరిహద్దులోని పష్తూన్ ప్రజల్లో ప్రాబల్యాన్ని పెంచుకున్న తాలిబాన్ తీవ్రవాదం, బలూచీల తిరుగుబాటు పాక్ పాలిట ప్రస్తుతం పెను సమస్యలుగా మారాయి. అధికారంలో ఏళ్లపాటు ప్రాతినిధ్యం లేకుండా చేసి, ఆర్థికంగా అట్టడుగుకు నెట్టేస్తే ఉత్పన్నమయ్యే పరిణామాలకు సూచికగా, బలూచీస్థాన్‌ను నిదర్శనంగా పేర్కొంటూ ఎన్నో విశ్లేషణలు వచ్చాయి. పాక్‌లో విస్తీర్ణం పరంగా బలూచీస్థానే పెద్ద రాష్ట్రం. కానీ జనాభాపరంగా దిగువన ఉంది. నిరుద్యోగం, నిరక్షరాస్యత ఎక్కువ. తలసరి ఆదాయం తక్కువ. నీటి సౌకర్యాలు అంతంత మాత్రమే. వ్యవసాయంపై ఆధారపడటం కష్టం. పశుపోషణే ఒకప్పుడు ప్రధానంగా ఉండేది. సహజవాయువు, ఖనిజ వనరులు, ముడి చమురు నిల్వలు మాత్రం పుష్కలంగా ఉన్నాయి. వీటిపై వచ్చే రాయల్టీల్లో సింహభాగం ఇప్పటికీ పంజాబీ, సింధీలే తన్నుకుపోతున్నారు. ఉన్నత, సాధారణ ఉద్యోగాల్లోనూ పంజాబీ, సింధీలదే ఆధిపత్యం. వ్యాపార, పరిశ్రమలూ వీరి చేతుల్లోనూ ఉన్నాయి. ఇక మిలటరీలో పంజాబీల గుత్తాధిపత్యానికి తిరుగులేదు.

బలూచీ చరిత్ర చెప్పే సత్యం ఒక్కటే. రాజకీయ, ఆర్థిక అధికారాల్లో సముచిత ప్రాతినిధ్యం ఇవ్వకుండా, రాష్ట్రాల అధికారాలకు కత్తెరవేస్తూ, జాతీయ సమగ్రత పేరుతో ప్రాంతీయ ఆకాంక్షలను నేలరాస్తూ, వేర్పాటువాదులుగా ముద్రలువేస్తూ, సైనికబలంతో సమస్యలను పరిష్కరిద్దామనే వ్యూహం లెక్కలేనన్ని విపరిణామాలకు దారితీస్తుంది. హింసనే నమ్ముకునే విపరీత భావజాలాలను సృష్టిస్తుంది. బలూచీస్థాన్ అనుభవం నుంచి మనం నేర్చుకోవాల్సిన గుణపాఠం అదే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

విద్యుత్ వాహనాలకు కొత్త విధానం

అన్ని దేశాలు తమ సమస్త వాహనాలను విద్యుద్దీకరించవలసిన అవసరమున్నది. ఇందుకు మూడు కీలక కారణాలు ఉన్నాయి. అవి: మొదటిది– వాతావరణ మార్పు. రవాణా రంగం చమురు– పెట్రోల్, డీజిల్ – ను భారీ పరిమాణంలో వినియోగించుకుంటున్నది. ప్రపంచ వ్యాప్తంగా వార్షిక కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలలో రవాణా రంగం వాటా ఇంచుమించు 15 శాతంగా ఉన్నది. చమురుకు ప్రత్యామ్నాయంగా విద్యుత్‌ను వినియోగించుకునే జీరో-ఎమిషన్ వెహికల్స్ లేదా విద్యుత్ వాహనా(ఈవీ)లను కాలుష్యకారక ఉద్గారాల సమస్యకు పరిష్కారంగా పరిగణిస్తున్నారు; రెండు– స్థానిక కాలుష్యాన్ని తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో జీరో-ఎమిషన్ వాహనాలను వినియోగించుకోవాలి. ఇది మన నగరాలను కాలుష్యరహితంగా ఉంచేందుకు చాలా ముఖ్యం; మూడు– వాహనాల విద్యుద్దీకరణ వల్ల చమురు వినియోగం తగ్గిపోయి విలువైన విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుంది. ఈ మూడు కారణాలు సుసంగతమైనవే. అయితే ఇవి మాత్రమే ఆవశ్యక మార్పుకు దోహదం చేయలేవు. విద్యుత్ వాహనాల విషయంలో మనం ఏం చేస్తున్నాం, ఎందుకు చేస్తున్నాం అనే దాన్ని సమీక్షించుకోవాలి. తద్వారా వాహన విద్యుద్దీకరణ ఎజెండాను పటిష్ఠంగా అమలుపరచుకోవడమే కాకుండా తక్షణమే అవసరమైన ప్రయోజనాలను పొందగలుగుతాం.


▪ సునీతా నారాయణ్

మట్టివాసన

నగరాలలో వాహనాల విద్యుద్దీకరణ వల్ల పలు ప్రయోజనాలు సంయుక్తంగా సమకూరుతాయి. వాయు కాలుష్యం తగ్గుతుంది, విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది; హరిత గృహ వాయు ఉద్గారాల నివారణతో విశేష లబ్ధి చేకూరుతుంది. 2030 సంవత్సరం నాటికి దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం ఏ స్థాయిలో ఉంటుందో 2019లో నీతి ఆయోగ్ అంచనా వేసింది: ఈవీల విక్రయాలు కొత్త వాణిజ్యకారుల అమ్మకాలలో 70 శాతం; ప్రైవేట్ కారులలో 30 శాతం, బస్సుల అమ్మకాలలో 40 శాతం, ద్విచక్ర, త్రిచక్ర వాహనాల అమ్మకాలలో 80 శాతం మేరకు ఉండాలి. 2025 సంవత్సర నడిమికాలానికి మనం ఆ లక్ష్య పరిపూర్తికి చాలా దూరంలోనే ఉండిపోయాం. ఒక్క త్రిచక్ర వాహనాల విషయంలో మాత్రమే పురోగతి కనిపిస్తోంది.

మనం శ్వాసిస్తున్న విషవాయువులకు కారణం పెద్ద వాహనాలు అన్న వాస్తవాన్ని విస్మరించలేం. ఏ ఏ రకం వాహనాలు– బస్సులు, లారీలు, కార్లు మొదలైనవి ఏ స్థాయిలో వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయనే విషయాన్ని అటుంచి, రోడ్లపై ఆయా వాహనాల సంఖ్య లెక్కకు మిక్కుటంగా ఉండడంతో రద్దీ విపరీతంగా పెరిగిపోయి వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోంది. ఈ దృష్ట్యా వాయు కాలుష్య నియంత్రణ విధిగా కాలుష్యకారకం కాని వాహనాల వినియోగం పెరుగుదలకు, రోడ్లపై మొత్తంగా వాహనాల సంఖ్య తగ్గుదలకు దోహదం చేయాలి. ఈ శతాబ్ది తొలినాళ్లలో ఢిల్లీలో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ)తో నడిచే వాహనాలను వినియోగించడం ప్రారంభమయింది. ఏ నగరంలో అయినా బస్సులు, టాక్సీలు, ఆటో రిక్షాలు ప్రయాణం చేసిన దూరం అధికంగా ఉండడం కద్దు. ఇది ఢిల్లీలో మరీ ఎక్కువగా ఉంటుంది. వాహనాలు ప్రయాణం చేసిన దూరం ఎంత ఎక్కువగా ఉంటుందో వాటి నుంచి ఉద్గారాలు కూడా అంత అధికంగా ఉంటాయని నిపుణులు నిర్ధారించారు.



నీతి ఆయోగ్ 2019లో అంచనా వేసిన విధంగా విద్యుత్ వాహనాల విక్రయాలు పెరగడం లేదు. దేశ వ్యాప్తంగా రోజూ పదివేల కొత్త ప్రైవేట్ కార్లు రోడ్ల మీదకు వస్తున్నాయి. నగరాలలో ట్రాఫిక్ రద్దీ మూలంగా వాహనాల సగటు వేగం తగ్గిపోయి కాలుష్యం పెరిగిపోతోంది. విద్యుత్ వాహనాలను ఇతోధికంగా పెంచడంతో పాటు రోడ్లపై మొత్తం వాహనాలు తక్కువగా ఉండేలా చేసినప్పుడే వాయు నాణ్యత మెరుగుపడుతుంది.


ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణ కథ సవ్యంగా సాగలేదు. సీఎన్‌జీ వాహనాలను ప్రవేశపెట్టిన రెండు దశాబ్దాల తరువాత కూడా రోడ్లపై వాహనాల సంఖ్యను తగ్గించేందుకు వీలుగా ప్రజా రవాణా వ్యవస్థను తగిన విధంగా మెరుగుపరచలేదు. దేశ రాజధాని నగరంలో ప్రతిరోజూ దాదాపు 1800 కొత్త వ్యక్తిగత వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. వీటిలో ప్రైవేట్ వాహనాలు 500కు పైగా ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా ప్రతిరోజూ 10,000కు పైగా కొత్త ప్రైవేట్ కార్లు రోడ్ల మీదకు వస్తున్నాయి. ఆసేతు హిమాచలం రహదారులపై నానా రకాల వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. కొత్త ఫ్లైఓవర్లు, సరికొత్త రోడ్లు ఎన్ని నిర్మించినా వాహనాల రాకపోకలకు తరచు అంతరాయమేర్పడుతూనే ఉంది. ప్రజలు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుంటున్నారు. వాహనాల గమన వేగం తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల పర్యవసానాలను సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్‌లోని నా సహచరులు సమగ్రంగా అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా రెండు ప్రదేశాల మధ్య ప్రయాణించడానికి ఎంత సమయం పడుతుందో వివరణాత్మక రికార్డు నందించే 'గంటవారీ ప్రయాణ సమయ డేటా' (Hourly travel time data)ను విశ్లేషించారు. ఢిల్లీలో, వాహనాల సగటు వేగం రోడ్లపై వాహనాల రద్దీ ఉదయం పూట అత్యంత రద్దీగా ఉన్న వేళల్లో వాహనాల సగటు వేగం 41 శాతం తగ్గిపోతుందని, సాయంత్రం పూట రద్దీ తీవ్రంగా ఉన్న సమయంలో 56 శాతం తగ్గుతుందని వెల్లడయింది.

నగరాలలో వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రవేశపెట్టిన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ) కాలుష్యకారక వాయువులను ఉద్గారించని వాహనాల సంఖ్య పెరుగుదలకు, రోడ్లపై రాకపోకలు సాగించే మొత్తం వాహనాల సంఖ్య తగ్గుదలకు తోడ్పడాలి. కొత్త విద్యుత్ వాహనాల సంఖ్యను పెంచడమే కాదు, ట్రాఫిక్‌లో వాటి మోడల్ వాటా (ఇతర రకాల వాహనాలతో పోలిస్తే ఈవీలు అయిన వాహనాల నిష్పత్తిని సూచిస్తుంది) ఇతోధికంగా పెరగవలసి ఉన్నది. ఇందుకు అనుగుణంగా నగరాలలో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచాలి. ఇది జరిగినప్పుడు మాత్రమే మనం నిర్మలమైన గాలిని శ్వాసించగలుగుతాం. దైనందిన రాకపోకలపై సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోగలుగుతాం. ఆఖరుగా అసలు ప్రశ్న : భారత్‌లో గానీ, మిగతా ప్రపంచ దేశాలలో గానీ ప్రైవేట్ విద్యుత్ వాహనాల అవసరం నిజంగా ఉన్నదా?

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

ఆఫ్రికా సాహితీ ఆత్మ గూగీ

గూగీ వా థియాంగో కెన్యా రచయిత. ఆయన ప్రసిద్ధ నవల 'వీప్ నాట్ చైల్డ్' (1964) తూర్పు ఆఫ్రికన్ రచయిత రాసిన ప్రప్రథమ ప్రధాన ఆంగ్ల నవల. ఆఫ్రికాలో వలసవాద ప్రభావాలను నిశితంగా నిరసించి తన ప్రజల భాషలో రాయడం ప్రారంభించారు. ఒక రచయితగా గూగీలో వచ్చిన ఈ మార్పే ఆయనకు అంతర్జాతీయంగా ప్రఖ్యాతిని సమకూర్చింది. గూగీ సాహిత్యంపై పరిశోధన చేసి నేను పిహెచ్.డి పట్టా పొందాను. తనకు నోబెల్ సాహిత్య పురస్కారం లభించగలదని ఆయన ఆశించారు. అయితే పురస్కార నిర్ణేతలు తమ సొంత పరిగణనలనే ప్రమాణంగా తీసుకున్నారు. మహాత్మాగాంధీ కూడా ఇదేవిధంగా భారత్, దక్షిణాఫ్రికా ప్రజలకు, విశాల ప్రపంచానికి చేసిన సేవలకు నోబెల్ శాంతి పురస్కార నిర్ణేతల గుర్తింపును పొందలేకపోయారు. గూగీ తన ప్రవాస జీవితాన్ని అట్లాంటాలోనే గడిపారు. ఆయన కుమార్తె తండ్రి మరణాన్ని 'ది గార్డియన్'లో రాసిన వ్యాసం ద్వారా ప్రపంచానికి వెల్లడించారు.



'I Will Marry When I Want' అనే నాటకాన్ని గూగీ రాశారు. ఈ నాటక రచనా సమయంలో ఆయన నైరోబి విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగంలో ప్రధానాచార్యుడుగా ఉన్నారు. ఆయన తన ప్రజలు మాట్లాడే గికుయు భాషలో రచనలు చేశారు. ఈ కారణంగానే అసంఖ్యాక ప్రజలు ఆయన నవలలు, నాటకాలు, ఇతర రచనలను అమితంగా అభిమానించారు. ప్రజల ప్రతిస్పందనలకు ముగ్ధుడైన గూగీ సొంత భాషలోనే రాయాలని దృఢంగా నిర్ణయించుకున్నారు, తుదిదాకా కట్టుబడి ఉన్నారు. గికుయు భాషలో రాసిన 'Citani Marthabani'ని ఆంగ్లంలోకి 'Devil on the Cross'గా అనువదించారు. ప్రవాసం నుంచి నైరోబికి రెండో పర్యాయం వెళ్లినప్పుడు, మొదటిసారి వెళ్లినప్పుడు గురైన నిర్బంధం కంటే చాలా ఘోరమైన పరిస్థితిని ఆయన చవిచూడవలసి వచ్చింది.

నేను కాకతీయ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ప్రధానాచార్యుడుగా ఉన్నప్పుడు గూగీ సాహిత్యాన్ని ఎంఏ సిలబస్‌లో చేర్చాను. నేను గూగీ సాహిత్యంపై డాక్టొరేట్ తీసుకున్నానని, తాము ఒక గొప్ప ఆఫ్రికన్ సాహిత్యవేత్త రచనలను చదువుతున్నామని తెలిసి గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన నా విద్యార్థులు సంతోషించేవారు. ప్రతి జనవరి 1న ఆయనకు నేను నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేవాణ్ణి. ఆయన ఎంతో ప్రేమాదరాలతో ప్రతిస్పందించేవారు. నేను నాలుగున్నర సంవత్సరాల పాటు ఆఫ్రికాలో బోధించాను. అక్కడ ఉన్నప్పుడు ఆయన్ని చాలా పర్యాయాలు కలిశాను. ఆయననూ, ఆయన భార్యను ఒకసారి నా గృహానికి ఆహ్వానించాను. భారతీయ దైవ పురుషులలో ఒకరైన కృష్ణుడు తన మాదిరిగానే నలుపు రంగులో ఉంటాడని చెప్పినప్పుడు గూగీ చాలా సంతోషించారు.

▪ కంచర్ల ఇంద్రసేనారెడ్డి
విశ్రాంత ఆచార్యులు, కాకతీయ విశ్వవిద్యాలయం

దిగజారిపోతున్న నైతిక విలువలు


బంధాలు, అనుబంధాలు కనుమరుగవుతున్నాయి. ఆస్తి సమానంగా పంచినా ఇంకా ఎక్కువ ఆశించటం; కూతుళ్లకు ఇచ్చారని చనిపోయిన తల్లిదండ్రులకు తలకొరివి పెట్టకుండా మొఖం చాటేయడం జరుగుతున్నాయి. అలాంటి వారికి గ్రామ పెద్దలు దహన సంస్కారాలు జరిపించిన ఘటనలు ఉన్నాయి. ఆస్తి కోసం సొంత అన్నదమ్ముల్ని హత్య చేయడం, ఆస్తి రాయించుకుని తల్లిదండ్రులను వీధిపాలు చేస్తున్న ఘటనలు కూడా చాలా ఉన్నాయి. వృద్ధాప్యంలో అండదండలుగా ఉంటారనుకున్న కొడుకులు, కూతుళ్లు పట్టించుకోకపోవడంతో భిక్షాటన చేస్తున్న వారి వార్తలు పేపర్లలో చూస్తూనే ఉన్నాం. వృద్ధాప్యంలో దిక్కులేని పక్షులుగా జీవించే కంటే, చావే నయమని కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పోయి, చిన్న కుటుంబ వ్యవస్థ వచ్చింది. నైతిక విలువలు, మానవతా విలువలు మృగ్యమైపోతున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. ఇప్పుడు యువకులుగా ఉన్నవారు మున్ముందు వృద్ధులవుతారు. అప్పుడు తమ పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలి.

– అయినం రఘురామారావు

అణుశక్తి పరిశోధనల పథనిర్దేశకుడు

ఇటీవలే భారతదేశం ఇద్దరు అణు విజ్ఞానవేత్తలను కోల్పోయింది. వారిలో ఒకరు ఆర్. చిదంబరం కాగా, మరొకరు ఎమ్.ఆర్ శ్రీనివాసన్. మే 20న శ్రీనివాసన్ ఊటీలో కన్నుమూశారు. అటామిక్ ఎనర్జీ కమిషన్ అయిదవ ఛైర్మన్‌గా శ్రీనివాసన్ సేవలు అనుపమానమైనవి. హోమీ జహంగీర్ బాబా, విక్రమ్ సారాభాయ్, హెచ్.ఎన్. సేత్నా, రాజా రామన్న తర్వాత భారతదేశపు అణుశక్తి పరిశోధనలకు శ్రీనివాసన్ బాధ్యత వహించారు. వియన్నాలోని అంతర్జాతీయ సంస్థలోనూ సేవలందించారు. మనదేశంలో అణుశక్తి వాడకం సురక్షితమైనదని పబ్లిక్ డిబేట్ ప్రారంభించిన తొలి శాస్త్రవేత్త.


ఎమ్.ఆర్.ఎస్.గా ప్రఖ్యాతులైన మాలూరు రామస్వామి శ్రీనివాసన్ 1952లో కెనడాలోని మ్యాగ్గిల్ యూనివర్సిటీలో చేరి 'కంబషన్ ప్రాబ్లమ్స్ ఇన్ గ్యాస్ టర్బైన్స్'పై పరిశోధన చేశారు. 1954లో పీహెచ్‌డీ పట్టా పొందారు. 1955లో భారతదేశానికి తిరిగి వచ్చి పాతికేళ్ల వయసులో డాక్టర్ హోమీ జహంగీర్ బాబా నేతృత్వంలోని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ'లో శాస్త్రవేత్తగా చేరారు.



అప్పటికే నిర్మాణంలో ఉన్న భారతదేశపు తొలి అణు రియాక్టర్ 'అప్సర'లో చురుకుగా పని చేశారు. 1959లో తొలి అటామిక్ పవర్ స్టేషన్ నిర్మాణానికి ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆసియాలో రష్యా తర్వాత మనదేశంలోనే అటామిక్ పవర్ స్టేషన్ విజయవంతంగా ప్రారంభమైంది. దీనికి శ్రీనివాసన్ చేసిన కృషి చాలా ఉంది. అనంతర కాలంలో మద్రాసులో అటామిక్ పవర్ స్టేషన్ చీఫ్ ప్రాజెక్ట్ ఇంజినీర్‌గానూ శ్రీనివాసన్ బాధ్యతలు నిర్వర్తించారు. 1974లో పవర్ ప్రాజెక్ట్స్ ఇంజనీరింగ్ డివిజన్ డైరెక్టర్‌గానూ, 1984లో న్యూక్లియర్ పవర్ బోర్డ్ ఛైర్మన్‌గాను బాధ్యతలు స్వీకరించారు. 1987లో భారతదేశపు అటామిక్ ఎనర్జీ కమిషన్ అయిదవ ఛైర్మన్‌గా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెక్రటరీగా, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వ్యవస్థాపక ఛైర్మన్‌గానూ సేవలందించారు.

శ్రీనివాసన్ హయాంలో తలపెట్టిన 18 న్యూక్లియర్ పవర్ యూనిట్స్‌లో ఏడు ప్రారంభం కాగా, మరో ఏడు నిర్మాణంలో, మిగిలిన నాలుగు ప్రణాళికల స్థాయిలోనూ ఉన్నాయి. 1990లో అటామిక్ ఎనర్జీ కమిషన్ ఛైర్మన్‌గా పదవీ విరమణ చేసిన తర్వాత రెండేళ్ల పాటు వియన్నాలోని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీకి సీనియర్ అడ్వైజర్‌గా కొనసాగారు. మనదేశంలో ఎనర్జీ, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాలకు సంబంధించి 1996–98 మధ్యకాలంలో ప్రణాళిక సంఘం సభ్యుడిగా సేవలందించారు. 2002–2004తో పాటు 2006–2008 కాలంలోనూ 'నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డ్' సభ్యులుగా ఉన్నారు. అలాగే కర్ణాటకలో 'హయ్యర్ ఎడ్యుకేషన్ టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్'గా రెండేళ్ల పాటు సేవలందించారు. వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ న్యూక్లియర్ ఆపరేటర్స్ వ్యవస్థాపక సభ్యుడైన శ్రీనివాసన్‌ను 1984లో పద్మశ్రీ, 2015లో పద్మవిభూషణ్ వరించాయి. పదవీ విరమణ అనంతరం ఆయన ఊటీలో స్థిరపడ్డారు. శ్రీనివాసన్ మొత్తం మూడు పుస్తకాలు రచించారు. వాటిలో 'ఫిషన్ టు ఫ్యూషన్: ది స్టోరీ ఆఫ్ ఇండియన్ అటామిక్ ఎనర్జీ ప్రోగ్రామ్' ప్రముఖమైనది. శ్రీనివాసన్ భార్య గీత. ఆమె ఇంటాక్ సంస్థ నీలగిరి చాప్టర్ కార్యకలాపాల్లో చాలా చురుకుగా పాల్గొనేవారు. వీరికి శారద, రఘువీర్ సంతానం. భారత్, అమెరికాల మధ్య అణు ఒప్పందం జరిగినప్పుడు అనేక విమర్శలు వచ్చాయి. వాటికి మద్రాసులో ఆయన జవాబులు చెప్పిన తీరు నేటికీ ఎంతోమందికి గుర్తుండిపోయే అంశం. భారతదేశపు సంస్కృతీ సంప్రదాయాల మూలాలు తెలిసిన కర్మయోగి వంటి శాస్త్రవేత్త ఎమ్.ఆర్.శ్రీనివాసన్.

• ఎన్. హంసవర్ధిని



● పోలీస్ థీమ్ యోగా

ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో గురువారం పోలీసు థీమ్ యోగాంధ్ర జరిగింది. సత్యనారాయణపురం బీఆర్టీఎస్ రోడ్డులో పోలీసు అధికారులు యోగాసనాలు వేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీపీ రాజశేఖరబాబు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

8లో





వెస్ట్ బైపాస్‌లో కీలక మలుపు



విజయవాడ వెస్ట్ బైపాస్ ప్రాజెక్టులో గొల్లపూడి జంక్షన్ వద్ద 'రింగ్'కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కన్సల్టెన్సీ సంస్థ ఇచ్చిన నివేదికను ఎన్‌హెచ్ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించడంతో అనుమతి లభించింది. వారంలో గొల్లపూడి జంక్షన్ వద్ద పనులు ప్రారంభించి, రెండు వారాల్లో పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

గొల్లపూడి వద్ద రింగ్ ఏర్పాటుకు కేంద్రం ఓకే

- భూసేకరణ లేకుండానే నిర్మాణానికి ప్రతిపాదన
- వెంటనే పనులు చేపట్టడానికి కేంద్రం అనుమతి

గొల్లపూడి జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ వెస్ట్ బైపాస్ ప్రాజెక్టులో గొల్లపూడి వద్ద రింగ్ నిర్మాణం కీలకం. గొల్లపూడి దగ్గర ఎన్‌హెచ్-65ను అనుసంధానించే చోట ప్రస్తుతమున్న జంక్షన్ ఇబ్బందిగా మారింది. గొల్లపూడి ఆర్‌వోబీ దిగువన, సర్వీసు రోడ్ల మీదుగా ఇటు విజయవాడకు, అటు హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వాహనాలు మలుపు తిరగటానికి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ వాహనాలు మళ్లీ ఎన్‌హెచ్-65పైకి ఎక్కి, గొల్లపూడి సిగ్నల్ జంక్షన్ వరకు వెళ్లి, అక్కడ ఫ్రీలెఫ్ట్ తీసుకుని తిరిగి హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కానీ, గుంటూరు నుంచి విజయవాడ నగరంలోకి వచ్చే వాహనాలు కానీ ఇదే ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తోంది. గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఎన్‌హెచ్-65 మీదుగా సూరాయిపాలెం ట్రాఫిక్ జంక్షన్ వరకు వెళ్లి ఫ్రీలెఫ్ట్ తిరిగి విజయవాడలోకి వెళ్లాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గొల్లపూడి జంక్షన్ వద్ద రింగ్‌ను అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనను తీసుకొచ్చారు. ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఎంపీ కేశినేని చిన్ని కూడా సూచించారు. దీనిపై ఎన్‌హెచ్ అధికారులు సమగ్ర అధ్యయనం చేశాక రింగ్ నిర్మాణాన్ని ప్రతిపాదించారు. రింగ్ ఏ విధంగా ఏర్పాటు చేయాలన్న దానిపై కన్సల్టెన్సీని నియమించారు. ఈ కన్సల్టెన్సీ సంస్థ ఇటీవలే నివేదిక ఇచ్చింది. భూ సేకరణ అవసరం లేకుండానే, రింగ్‌ను అభివృద్ధి చేయవచ్చని ఆ సంస్థ పేర్కొంది. దీంతో ఆగమేఘాలపై ఈ ప్రతిపాదనను కేంద్రానికి పంపారు. కేంద్రం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో ఇక పనులు ప్రారంభించడమే తరువాయి. వారంలో పనులు ప్రారంభించి, పక్షం రోజుల్లోపే దీనిని పూర్తి చేయటానికి ఎన్‌హెచ్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

క్లోవర్ లీఫ్ జంక్షన్ సంగతేంటి?

గొల్లపూడి వద్ద రింగ్ కనుక అందుబాటులోకి వస్తే.. ఏలూరు, గుంటూరు నుంచి విజయవాడ, హైదరాబాద్ వెళ్లే వాహనాలకు కానీ, హైదరాబాద్, విజయవాడ నుంచి వచ్చే వాహనాలకు కానీ మార్గం సుగమమవుతుంది. వాస్తవానికి గొల్లపూడి జంక్షన్ వద్ద క్లోవర్ లీఫ్ జంక్షన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనలు కూడా నడుస్తున్నాయి. హైదరాబాద్-విజయవాడ మార్గాన్ని ఆరు వరసలుగా విస్తరించటానికి వీలుగా డీపీఆర్ రూపకల్పన జరుగుతోంది. ఈ క్రమంలో గొల్లపూడి జంక్షన్ దగ్గర విజయవాడ మిగతా 6లో..

ఇదేం మద్దతు?



కేంద్ర మద్దతు ధరలపై రైతుల్లో అసంతృప్తి

- కంటితుడుపు చర్యేనంటున్న జిల్లా రైతులు
- ఆ ధరలు గిట్టుబాటు కావని ఆవేదన
- వాస్తవ ఖర్చులు పట్టించుకోరా.. అంటూ ప్రశ్న

కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు ప్రకటించిన మద్దతు ధరలు ఆశాజనకంగా లేకపోవటంపై రైతులు పెదవి విరుస్తున్నారు. ఏటా నామమాత్రంగా పెంచుతున్నారు తప్ప, వాస్తవ పంట ఖర్చులను పరిగణనలోకి తీసుకోవట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో రైతులు ఎక్కువగా సాగుచేసే వరికి రూ.69, పెసలుకు రూ.86, మొక్కజొన్నకు రూ.175 పెంచటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల) : 2025-26 ఖరీఫ్‌కు సంబంధించి వివిధ పంటలకు కేంద్ర ప్రభుత్వం బుధవారం మద్దతు ధరలను ప్రకటించింది. అయితే, ఇవి గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా పెరగట్లేదంటున్నారు. పంటల ఉత్పత్తిలో సాగుకు అవుతున్న వాస్తవ ఖర్చులకు, ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరకు ఏమాత్రం పొంతన ఉండట్లేదనేది రైతుల మాట. ఏటా ఎరువులు, పురుగు మందుల ధరలు పెరుగుతున్నాయి తప్ప తగ్గట్లేదు. కూలీరేట్లు కూడా బాగా పెరిగాయి. వీటికితోడు అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు, తెగుళ్ల పంటలను నిలువునా దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా ఆశించిన దిగుబడులు రావట్లేదు. పంటల సాగు వ్యయం రూ.వేలల్లో పెరుగుతుండగా విదిల్చినట్టుగా కేంద్ర మిగతా 6లో..

కౌలు రైతులకు ఒరిగిందేం లేదు

6

ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య

● జోరువాన



జోరువాన నగరాన్ని ముంచేసింది. గురువారం ఉదయం నుంచి మోస్తరు ఎండ ఉండగా, మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అప్పటివరకు ఉక్కపోతతో అల్లాడిన నగరవాసులు ఒక్కసారిగా వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. కాగా, ఈ వర్షానికి కూడా నగరంలోని కీలక రహదారులు జలమయం అయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



విదేశీ పర్యటనలో శ్రీనివాసరావు దంపతులు (ఫైల్)

చీటీంగ్

ఆర్థిక వ్యవహారాలే టార్గెట్‌గా నగరంలో మోసాలు

- చీటీలు, బంగారం పథకాలతో ప్రజలకు ఎర
- ముందు నమ్మకం కలిగించి.. తర్వాత నట్టేట ముంచేసి..
- రూ.కోట్లతో ఉడాయిస్తున్న నయవంచకులు
- నిన్న రూ.కోట్లతో జంప్ అయిన యూపిక్స్ అధినేత
- తాజాగా ముచ్చెర్ల శ్రీనివాసరావు అనే వ్యక్తి మోసం
- చీటీలు, బంగారం పథకాల్లోని రూ.కోట్ల డబ్బుతో జంప్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇటీవల.. నగరానికి చెందిన యూపిక్స్ అధినేత నిడుమోలు కిరణ్ ప్రజలను నమ్మించాడు. పెట్టుబడికి రెట్టింపు చెల్లింపులు చేస్తానంటూ ఆశచూపి రూ.100 కోట్ల వరకు జనానికి సున్నం రాశాడు. డబ్బుతో జంప్ అయిన కిరణ్ పోలీసులకు చిక్కకుండా ఇంకా ఖాతాదారులను నమ్మించడానికి సెల్ఫీ వీడియోలు విడుదల చేస్తున్నాడు. ఇప్పుడు అయోధ్యనగర్‌లోని లోటస్ ల్యాండ్‌మార్క్‌కు చెందిన ముచ్చెర్ల శ్రీనివాసరావుది ఇదే పరిస్థితి. ఏకంగా బంగారం బిస్కట్లతోనే చీటీలు నిర్వహించి ఖాతాదారులకు ఝలక్ ఇచ్చాడు.

ఎవరీ శ్రీనివాసరావు?

ముచ్చెర్ల శ్రీనివాసరావుకు జనాన్ని మోసం చేయడం కొత్తేమీ కాదు. జనాన్ని నమ్మించి వారి డబ్బుతో విలాసవంతంగా గడపడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. శ్రీనివాసరావు పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో ఎరువుల వ్యాపారం చేశాడు. అక్కడ వ్యాపారంలో పెట్టుబడికి తెలిసిన వారి నుంచి అప్పులు తీసుకుని ఐపీ పెట్టాడు. తర్వాత అక్కడి నుంచి మిగతా 6లో..

- కూలీల ఆర్థిక అవసరాలకు ఉపయోగపడేలా చీటీలు నడిపాడు ఓ వ్యక్తి. మన ప్రాంతానికి చెందిన వ్యక్తే కదా.. అని ఆ కూలీలంతా చీటీలు వేశారు. తీరా.. కొన్నాళ్లకు రూ.50 లక్షలకు కుచ్చుటోపీ పెట్టాడు. కొద్దినెలల క్రితం మధురానగర్‌లో జరిగిన ఘటన ఇది.
- యాడ్ ఏజెన్సీ కాంట్రాక్ట్ వచ్చిందని నమ్మించాడు మరో వ్యక్తి. పెట్టిన పెట్టుబడికి ఏడాదిలో రెట్టింపు అవుతుందని నమ్మించాడు. ఏ జాతీయ బ్యాంకు ఇవ్వని విధంగా ఇస్తుండటంతో ఒక్కొక్కరూ రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టారు. తర్వాత చెల్లింపులు ఆపేసి నగరం విడిచిపోయాడు. అతడే యూపిక్స్ సంస్థ అధినేత నిడుమోలు కిరణ్.
- తాజాగా ఓపక్క బంగారం, మరోపక్క నగదు చీటీలు నిర్వహించి జనాన్ని నిలువునా ముంచేశాడు ముచ్చెర్ల శ్రీనివాసరావు. ప్రజల ఆశలను ఒక ఆయుధంగా చేసుకుని జరుగుతున్న ఇలాంటి మోసాలు నానాటికీ పెరుగుతూనే ఉన్నాయి.

ఎస్‌వోపీని రూపొందిస్తున్నాం..

ఎస్పీ రాజశేఖరబాబు, పోలీసు కమిషనర్

6

ప్రభుత్వం న్యాయం చేయాలి

విలేకరుల సమావేశంలో ముచ్చర్ల శ్రీనివాసరావు బాధితులు

అదే కథ..!

తిరువూరు మున్సిపాలిటీలో 22 ఏళ్ల తరువాత సేమ్ సీన్

- నాటి అంతర్గత పోరుతో అధికారం కోల్పోయిన కాంగ్రెస్
- ప్రస్తుతం వైసీపీ పాలకవర్గంలోనూ ఇదే పరిస్థితి
- సంఖ్యాబలం ఉన్నా అధికారం కోల్పోయిన వైనం



అంతర్గత ఆధిపత్య పోరుతో అభివృద్ధిని విస్మరించడం.. కావాలనే అధికారాన్ని చేజార్చుకోవడం.. నాడు కాంగ్రెస్ పాలనలో, నేడు వైసీపీ హయాంలోనే జరిగాయి. తిరువూరు మున్సిపాలిటీలో సంఖ్యాబలం ఉన్నప్పటికీ సొంత పార్టీలో సిగపట్లతో చివరికి ఏమీ మిగలకుండా పోయిన తీరు 22 ఏళ్ల తరువాత మళ్లీ రిపీట్ కావడం చర్చకు దారితీస్తోంది. - తిరువూరు

నాడు అలా..

2001లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో మొత్తం 20 ఎంపీటీసీ స్థానాలకు కాంగ్రెస్ 16, టీడీపీ 4 గెలుపొందాయి. ఎంపీపీగా కొలికపోగు లక్ష్మణరావు ఎంపికయ్యారు. కొంతకాలం బోర్డు పాలన సజావుగానే సాగినప్పటికీ కాంగ్రెస్ మిగతా 6లో..

దర్జాగా బుసక దందా!

కృష్ణానదీ పాయలో వైసీపీ నాయకుడి నిర్వాకం

- సీఎంవోలోని ప్రముఖ వ్యక్తి నుంచి అండదండలు
- మద్దతుగా నిలుస్తున్న స్థానిక టీడీపీ నాయకులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- బుసక లారీలను పోలీసులు పట్టుకోవడంతో విషయం వెలుగులోకి..





అతను ఓ బీసీ నాయకుడు. వైసీపీ తరఫున తోట్లవల్లూరు పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేయాలని తలంచాడు. ఆ పార్టీలో క్రియాశీలకంగా పని చేశాడు. తీరా సర్పంచ్ పదవి ఎస్సీలకు రిజర్వు కావటంతో పోటీ చేయలేకపోయాడు. వైసీపీ మూలాలు ఉన్న సదరు వ్యక్తి తోట్లవల్లూరు మండలం రొయ్యూరులో అక్రమంగా బుసక క్వారీ నడపటం, స్థానిక టీడీపీ నాయకులు అతనికి మద్దతుగా నిలవటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే వైసీపీ నాయకుడి అక్రమంగా బుసక క్వారీ ఏర్పాటుకు సీఎంవోలోని ఓ ప్రముఖ వ్యక్తి అండదండగా నిలిచినట్టు ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వంలో వైసీపీ నాయకుడు ఇంత ధైర్యంగా బుసక క్వారీ నిర్వహించటంపై అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు.

6లో

జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గురువారం నాటికి దాదాపు పూర్తయింది. వచ్చిన దరఖాస్తుల్లో ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేసి, మిగిలిన వారిని ఖాళీలను బట్టి బదిలీ చేసేందుకు ఆయా విభాగాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూన్ 1, 2 తేదీల్లో బదిలీల ప్రక్రియను పూర్తి చేసి, జూన్ 3వ తేదీన ఉద్యోగులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో చేరేలా ప్రణాళికను రూపొందిస్తున్నారు.

బదిలీలకు వేళాయె

- ప్రభుత్వ శాఖల్లో ముగిసిన బదిలీల దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 2 నాటికి బదిలీల ప్రక్రియ పూర్తిచేసేలా కసరత్తు
- విద్యాశాఖలో ప్రధానోపాధ్యాయులకు పదోన్నతి కౌన్సెలింగ్
- విధుల్లో చేరిన జెడ్పీ సీఈవో.. కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలని హామీ
- మిగిలిన విభాగాల్లో ఒకటి, రెండు రోజుల్లో పూర్తి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలోని వివిధ విభాగాల ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు సమయం ఆసన్నమైంది. మిగతా 6లో..

మరిన్ని అంతర్జాతీయ సర్వీసులు రావాలి

ఇండిగోను కోరిన ఏపీ చాంబర్

6లో

రాజధాని నిర్మాణంలో భద్రత కట్టుదిట్టం

- బాలకార్మికులు, లింగవివక్ష ఉండకూడదు
- సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

8లో



బాబాయ్ బాగున్నావా!

- కలెక్టర్ ఆప్యాయ పలకరింపు
- ఆనందం వ్యక్తం చేసిన హమాలీలు

8లో



1 నుంచి రేషన్ పంపిణీకి సిద్ధం

- మంత్రి నాదెండ్ల మనోహర్





సభలో అమ్మాయిల ఉత్సాహం



మహానాడు వేదిక



సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



మహా జాతర







కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం









చీటీంగ్

(5వ పేజీ తరువాయి)

కుటుంబం సహా విజయవాడకు మకాం మార్చాడు. అయోధ్యనగర్ లోటస్‌లో ఒక ఫ్లాట్‌ను కొన్నాడు. 16 సంవత్సరాలుగా లోటస్‌లోనే ఉంటున్నాడు. విజయవాడలో ఒక మాజీమంత్రికి ఉన్న ముఖ్య అనుచరుల్లో శ్రీనివాసరావు ఒకడు. ఆయన ప్రారంభించే బంగారం, నగదు చీటీలపై ప్రజలకు నమ్మకం కలిగించేందుకు ప్రముఖ జ్యువెలరీ షాపు ప్రారంభోత్సవానికి వచ్చిన అగ్ర నటుడితో ఫొటో దిగాడు. దాన్ని ఆయుధంగా ఉపయోగించుకుని, ఆ సంస్థ పేరును వాడుకుని ఖాతాదారులను ఆకర్షించాడు. శ్రీనివాసరావు కుమారుడు జపాన్‌లో ఉంటున్నాడు. కొన్నాళ్ల క్రితం కుమార్తెకు విజయవాడలో అంగరంగ వైభవంగా వివాహం చేశాడు. హైదరాబాద్‌లో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసినట్టు తెలిసింది. అనధికారికంగా నిర్వహించిన స్కీమ్‌ల ద్వారా ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బుతో ఆస్తులను సంపాదించించాడు. కాగా, శ్రీనివాసరావు భార్యను అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు తెలిసింది. అతడి కోసం రెండు బృందాలు గాలిస్తున్నాయి. ప్రజల సొమ్ముతో పారిపోయిన శ్రీనివాసరావు న్యాయవాదులతో సంప్రదింపులు చేస్తున్నట్టు తెలిసింది.

ఎస్‌వోపీని రూపొందిస్తున్నాం

- ఎస్వీ రాజశేఖరబాబు, పోలీసు కమిషనర్

అనధికారికంగా నిర్వహిస్తున్న చీటీలు, బంగారం స్కీమ్‌ల్లోకి దిగి ప్రజలు మోసపోతున్నారు. ఇటీవల కోట్లాది రూపాయలు వసూలు చేసిన ఇద్దరు.. ప్రజలను మోసం చేశారు. నగరంలో అనధికారికంగా చీటీలు, ఆర్థిక వ్యవహారాలను నిర్వహిస్తున్న 40 మందిని గుర్తించాం. వారందరినీ త్వరలో పిలిపిస్తాం. స్కీమ్‌లు, చిట్టీలకు సంబంధించి ఒక ఎస్‌వోపీని రూపొందిస్తున్నాం.

ప్రభుత్వం న్యాయం చేయాలి : బాధితులు

అజిత్‌సింగ్‌నగర్ : గోల్డ్ చీటీల పేరుతో ముచ్చర్ల శ్రీనివాసరావు నమ్మించి నట్టేట ముంచాడని, ప్రభుత్వం కల్పించుకుని తమకు న్యాయం చేయాలని గోల్డ్ చీటీల బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు, పెళ్లిళ్ల నిమిత్తం చీటీలు వేసి మోసపోయామని, కోట్లాది రూపాయలు సొమ్మును దోచిన శ్రీనివాసరావుపై కఠినచర్యలు తీసుకోవాలని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కల్పించుకుని శ్రీనివాసరావు నుంచి సొమ్ము రికవరీ చేసి న్యాయం చేయాలని కోరారు.

కీలక మలుపు

(5వ పేజీ తరువాయి)

బైపాస్‌తో హైదరాబాద్-విజయవాడ మార్గం అనుసంధానమవుతుంది. రెండు ప్రధాన జాతీయ రహదారులు అనుసంధానమయ్యే చోట క్లోవర్ లీఫ్ జంక్షన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనను కన్సల్టెన్సీ సంస్థ చేస్తోంది. తుది డీపీఆర్‌లో కనుక క్లోవర్ లీఫ్ జంక్షన్‌ను ప్రతిపాదిస్తే, రింగ్‌ను తొలగిస్తారు. హైదరాబాద్-విజయవాడ ఆరు వరసల రహదారి విస్తరణ పనుల పూర్తికి మూడేళ్లు పట్టే అవకాశం ఉంది. క్లోవర్ లీఫ్ జంక్షన్ కూడా ఆ తర్వాతే వస్తుంది.

సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం

» వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు

జగ్గయ్యపేట రూరల్ : నేల సారాన్ని కాపాడుకునేందుకు రైతులు జీవ, సేంద్రియ ఎరువులను వినియోగించి పరిరక్షించుకోవటం ప్రథమ కర్తవ్యంగా భావించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు సూచించారు. గురువారం గరికపాడు కేవీకేలో భారతీయ వ్యవసాయ మంత్రిత్వశాఖ, వ్యవసాయ పరిశోధనామండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ ఖరీఫ్, ప్రీపెయిడ్‌నెస్ 15 రోజుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ, మారుతున్న కాలంతో పాటు వ్యవసాయరంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను రైతులు అందిపుచ్చుకోవాలన్నారు.

మరిన్ని అంతర్జాతీయ సర్వీసులు రావాలి

» ఇండిగోను కోరిన ఏపీ చాంబర్

విజయవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ, కర్నూలు మధ్య నేరుగా విమాన సర్వీసు ప్రారంభించిన ఇండిగో సంస్థ విజయవాడ నుంచి మరిన్ని అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభించాలని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు కోరారు. గురువారం నగరంలోని ఏపీ చాంబర్స్ కార్యాలయంలో ఆఫ్కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ వాణిజ్య సామర్థ్యాన్ని, పరిసర ప్రాంతాల నుంచి ఇండిగో సంస్థకు అందుబాటులో ఉన్న అవకాశాల గురించి సంస్థ బృందానికి ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో దాదాపు ప్రతి కుటుంబంలో ఒక ఎన్నారై ఉన్నారన్నారు. కొన్ని సర్వేల ప్రకారం విజయవాడ పరిసర ప్రాంతాల్లో సుమారు 5 లక్షల మంది ఎన్నారైలు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద సంఖ్యలో వివిధ దేశాలకు వలస వెళ్తున్నారని, రాష్ట్రంలో మధ్యతరగతి ప్రజల్లో అధికశాతం విజయవాడ పరిస ప్రాంతాల్లోనే నివశిస్తున్నారని వివరించారు. దుబాయ్, సింగపూర్ ఇతర దేశాలతో అపారమైన వాణిజ్య అవకాశాలు ఉన్నందున అంతర్జాతీయ విమాన సర్వీసులు పెంచాలని ఇండిగో సంస్థను కోరారు. కొంతకాలంగా విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రయాణించే వారి సంఖ్య 30 వేలనుంచి 40 వేలకు పెరిగిందన్నారు. విజయవాడ నుంచి విమానాలు ప్రస్తుతం 80శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయన్నారు. ప్రస్తుత విమానాలు చాలా చిన్నవని, రెండు నుంచి మూడు టన్నుల వరకు రవాణా చేసే బెల్లీకార్గోను విజయవాడ నుంచి నడిపే విధంగా ఆలోచించాలని ఆయన సంస్థను కోరారు. గతంలో స్పైస్‌జెట్ రవాణా విమానాన్ని నడిపిందని, అదే విధంగా విజయవాడ-అహ్మదాబాద్, సూరత్ మధ్య నేరుగా సర్వీసు ప్రారంభించాలని భాస్కరరావు కోరారు.

ఇదేం మద్దతు?

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం మద్దతు ధరలు పెంచుతుందని రైతులు ఆరోపిస్తున్నారు.

వాస్తవ ఖర్చులను పరిగణనలోకి తీసుకోరా?

పత్తి సాగుకు ఎకరాకు కౌలుతో కలుపుకొని సగటున రూ.60 వేలకు పైగా ఖర్చవుతోంది. మొదటి నుంచి చివరితీత వరకు కిలో పత్తికి సగటున రూ.12కు పైగా ఖర్చవుతుందంటే సాగు వ్యయం ఏ మేరకు పెరిగిందే చెప్పొచ్చు. వరికి ఇంతకుముందు ఎకరాకు సగటున రూ.30 వేలు పెట్టుబడి కాగా, నేడు రూ.40 వేలకు పైగా పెరిగింది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నెలకొన్నా, చీడపీడలు, వైరస్ తెగుళ్లు సోకినా పెట్టుబడి వ్యయం ఇంకా పెరుగుతుంది తప్ప తగ్గదు. పెట్టుబడిపై వడ్డీ, నిర్వహణ ఖర్చులు కూడా లెక్కిస్తే సాగు వ్యయం తడిసి మోపడవుతుంది. ఈ పరిస్థితుల్లో మద్దతు ధరలు నిర్ణయించేటపుడు క్షేత్రస్థాయిలో వాస్తవ ఖర్చులను పరిగణనలోకి తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు, రైతులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వినట్లేదు. గత సీజన్ మద్దతు ధరలతో పోలిస్తే ఈ సీజన్‌లో నామమాత్రంగానే పెరిగాయి. గత ఏడాది వరి కామన్, ఏ గ్రేడ్ రకాలకు రూ.117 పెరగ్గా, ఈ ఏడాది రూ.69 పెరిగింది. పెసలుకు గత ఏడాది రూ.124 పెంచగా, ఈ ఏడాది రూ.86 మాత్రమే పెంచారు. మినుములు గత ఏడాది రూ.450 పెంచగా, ఈ ఏడాది రూ.400 పెంచారు. కందులకు గత ఏడాది రూ.550 పెరగ్గా, ఈ ఏడాది రూ.450లే పెరిగింది. పత్తికి గత ఏడాది రూ.501 పెరగ్గా, ఈ ఏడాది రూ.589 పెంచారు. మొక్కజొన్నకు గత ఏడాది రూ.135 పెంచగా, ఈ ఏడాది రూ.175లు పెరిగింది.

కౌలు రైతులకు ఒరిగిందేం లేదు

- ఏపీ కౌలురైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య

విద్యాధరపురం : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల వల్ల వ్యాపారులకు తప్ప కౌలు రైతులకు ఒరిగిందేమీ లేదని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు ఎ.కాటమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఏటా 10 నుంచి 15 శాతం ఉత్పత్తి ఖర్చులు పెరుగుతుంటే, నామమాత్రంగా మద్దతు ధరలు పెంచటం రైతాంగాన్ని మోసగించటమేనని పేర్కొన్నారు. వరికి కేవలం మూడుశాతం మద్దతు ధర ప్రకటించడం సిగ్గుచేటని తెలిపారు. అత్యధిక విస్తరణలో సాగుచేసే పంటలకు స్వల్పంగా, చాలా తక్కువగా సాగుచేసే పంటలకు అరకొరగా మద్దతు ప్రకటించటం దారుణమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరలు ప్రకటించి, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

దర్జాగా ఇసుక దందా!

తోట్లవల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలం రొయ్యూరు రెవెన్యూ పరిధిలోని కృష్ణానదీపాయలో వైసీపీ నేత ఒకరు అనధికార ఇసుక క్వారీ నిర్వహిస్తున్నారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వల్లూరుపాలెం పాతర్యాంపు నుంచి కృష్ణానదీపాయలో రొయ్యూరు వైపుకు కిలోమీటరు పొడవున బాట నిర్మించి, అక్రమ ఇసుక క్వారీ ఏర్పాటు చేశారు. ఈ బాటనిర్మాణ సమయంలో తోట్లవల్లూరుకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు ఆ వైసీపీ నాయకుడికి మద్దతుగా నిలబడ్డారని విమర్శలు వస్తున్నాయి. రైతుల నుంచి 3.30 ఎకరాల పట్టాభూమి తీసుకుని ఇసుక తవ్వకాలు చేపట్టారు. బుధవారం రాత్రి అక్రమంగా తరలి వెళ్తున్న ఇసుక లారీలను పోలీసులు నిలువరించటంతో వ్యవహారం బయటకువచ్చింది. ఈ విషయమై వల్లూరుపాలెం గ్రామస్తులు విలేకరులకు సమాచారం అందించారు. గురువారం ఈ అక్రమ ఇసుక క్వారీ వద్దకు మీడియా వెళ్లగా ఎక్స్‌కవేటర్ ఖాళీగా నిలిపి ఉంది. రాత్రి సమయాల్లో ఎక్కువగా ఇసుక తవ్వకాలు చేస్తున్నట్టు స్థానికులు తెలిపారు. రొయ్యూరులో వైసీపీ నాయకుడు అక్రమంగా ఇసుక క్వారీ నడపటం వెనుక సీఎంవోలో పనిచేస్తున్న ఓ వ్యక్తి అండగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. సీఎంవోలోని వ్యక్తి జోక్యం ఉండటం వల్లే వైసీపీ నాయకుడు ధైర్యంగా బాట నిర్మించి అక్రమంగా క్వారీ ఏర్పాటు చేయగలిగాడని విమర్శలొస్తున్నాయి. వైసీపీ నాయకుడితో స్నేహం ఉన్న టీడీపీ నాయకులు ఇద్దరు నేరుగా క్వారీలోకి వెళ్లి అండగా నిలబడినట్టు తెలిసింది. అందువల్లే రెవెన్యూ యంత్రాంగం అక్రమ క్వారీ వైపు కన్నెత్తి చూడటంలేదని సమాచారం.

క్వారీకి అనుమతి లేదు : తహసీల్దార్

రొయ్యూరు ఇసుక క్వారీపై తహసీల్దార్ ఎం.కుసుమ కుమారిని వివరణ కోరగా, ఇసుక క్వారీకి అనుమతి లేదని చెప్పారు. తాము ఎవ్వరికి అనుమతి ఇవ్వలేదన్నారు. చర్యలు తీసుకుంటామన్నారు.

అదే కథ

(5వ పేజీ తరువాయి)

ఎంపీటీసీల్లో నెలకొన్న సంక్షోభంతో నాటి నిబంధనల ప్రకారం రెండున్నరేళ్లకు ఎంపీపీపై అవిశ్వాసం పెట్టారు. మనస్తాపం చెందిన ఎంపీపీ లక్ష్మణరావు కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరారు. కొందరు కాంగ్రెస్ నాయకుల వ్యవహారశైలిని నిరసిస్తూ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీటీసీలు టీడీపీకి మద్దతుగా నిలిచారు. నాడు అక్రమంగా అవిశ్వాసం పెట్టి దింపేసిన కొలికపోగు లక్ష్మణరావునే టీడీపీ అభ్యర్థిగా బలపరిచి గెలిపించుకున్నారు.

సరిగ్గా 22 ఏళ్ల తరువాత వైసీపీలో కూడా అదే కథ నడిచింది. ప్రస్తుతం మున్సిపాలిటీగా ఉన్న తిరువూరులో వైసీపీకి 17 మంది సభ్యుల బలం ఉంది. టీడీపీ 3 స్థానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వైసీపీకి చెందిన కొందరు కౌన్సిలర్లు టీడీపీకి మద్దతుగా నిలబడటంతో కౌన్సిల్‌లో టీడీపీకి 11 స్థానాల బలం పెరిగి గెలుపు లాంఛనం కానుంది.

తొమ్మిదేళ్లలో మూడో చైర్‌పర్సన్

తిరువూరు మున్సిపాలిటీగా ఏర్పడిన తొమ్మిదేళ్లలో మూడో చైర్‌పర్సన్ ఎన్నిక జూన్ 2న జరగనుంది. 2014 మార్చిలో జరిగిన మున్సిపల్ తొలి ఎన్నికల్లో మొత్తం 20 స్థానాలకు గాను టీడీపీ 12, వైసీపీ 7, సీపీఎం ఒక్కస్థానంలో గెలిచాయి. ఐదేళ్ల బోర్డు పరిపాలన సాఫీగానే సాగింది. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తిచేశారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ 17, టీడీపీ 3 స్థానాలు గెలుచుకున్నాయి. వైసీపీ బోర్డు ఏర్పాటు నుంచి ఆ పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లతో పాటు అప్పటి ఎమ్మెల్యే సహాయ నిరాకరణ చేశారు. దీంతో అభివృద్ధి పథకాలు అంతగా జరగలేదు. ఏదేమైనా వైసీపీ కౌన్సిలర్ల మధ్య ఆధిపత్యపోరే బోర్డు చేజారిపోవడానికి కారణమన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

నోటీసులు అందజేత

తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప ఎన్నిక అజెండా నోటీసులు గురువారం కౌన్సిలర్లకు అందాయి. మొత్తం 20 మంది సభ్యులతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యుడు, ఎమ్మెల్యే ఇళ్లకు వెళ్లి గురువారం రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఈ నోటీసులు అందించారు.

కౌన్సిలర్లకు గన్‌మెన్లు

మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప ఎన్నిక నేపథ్యంలో టీడీపీ, ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న కౌన్సిలర్లకు గన్‌మ్యాన్లను కేటాయించారు. గురువారం 8 మంది సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.

ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షుడిగా భార్గవ్



భార్గవ్



జి.అనిత

విజయవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ సంస్థ ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యక్షుడిగా బి.ఎస్.భార్గవ్ కుమార్, గౌరవ చైర్మన్‌గా జి.అనిత నియమితులయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ సీహెచ్ భద్ర మాట్లాడుతూ, గాలి కాలుష్యం రానురాను పెరిగిపోతూ ఏటా 16 లక్షల మందికి పైగా మరణిస్తున్నారని, భూమ్మీద సుమారు 70 శాతం మంది కలుషిత నీరు తాగుతున్నారని తెలిపారు. గౌరవ చైర్మన్ ప్రొఫెసర్ అనిత మాట్లాడుతూ, ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమం, సేవ్ నేచర్, ప్రొటెక్ట్ వాటర్ సోర్స్ లాంటి ప్రోగ్రామ్స్‌తో ప్రపంచ పర్యావరణ సంస్థ పనిచేస్తుందన్నారు. ఈ పదవి తనపై మరింత బాధ్యత పెంచిందని నూతన అధ్యక్షుడు భార్గవ్ అన్నారు. సమాజంలో ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించే విధంగా భవిష్యత్ కార్యక్రమాలు చేస్తామని చెప్పారు.

బదిలీలకు వేళాయె

(5వ పేజీ తరువాయి)

ఇప్పటికే ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని పరిశీలించి ఒకటి, రెండ్రోజుల్లో ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లాఅధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆలస్యంగా కౌన్సెలింగ్

మచిలీపట్నంలోని లేడియాంప్తిల్ జూనియర్ కళాశాలలో గురువారం ఉమ్మడి జిల్లాలోని 393 ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులను కౌన్సెలింగ్‌కు పిలిచారు. కౌన్సెలింగ్ కీ వివరాలు విద్యాశాఖ నుంచి రాకపోవడంతో ప్రక్రియ మధ్యాహ్నం నుంచి జరుగుతుందని డీఈవో పీవీజే రామారావు ప్రకటించారు. సాయంత్రం 6.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది.

జెడ్పీ పద్ధతిలోనే..

జిల్లా పరిషత్‌లోని పలువిభాగాల్లో ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఇటీవల గందరగోళం నెలకొంది. ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకుంటే కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగులు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే జెడ్పీ ఉద్యోగులకు కౌన్సెలింగ్ పద్ధతిలో కాకుండా, నేరుగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని పాలకవర్గ సభ్యులు చెప్పడంతో కొంత గందరగోళం ఏర్పడింది. దీంతో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయ ఉన్నతాధికారులు స్పందించి జెడ్పీ సీఈవోను వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. దీంతో జెడ్పీ సీఈవో గురువారం విధుల్లో చేరారు. వచ్చిన వెంటనే ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)


బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

చంద్రబాబు జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక ఒక చరిత్ర

విజయవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా వరుసగా చంద్రబాబు ఎన్నికకావడం ఒక చరిత్ర అని అఖిల భారత పంచాయతీ జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు జాస్తి వీరాంజనేయులు అన్నారు. ఎన్టీ రామారావు తరువాత తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేదిశగా చంద్రబాబు తన ముద్రను వేశారన్నారు. అనేక సంస్కరణలకు నాంది పలికారన్నారు. యువనాయకులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటించాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.





ఆక్రమణలతో ఇక్కట్లు

తొలగించాలని స్థానికుల వినతి

(పటమట, ఆంధ్రజ్యోతి): పటమట దర్శిపేట వాసులు యలమదలకుదురు వెళ్లే ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. అంతటి ప్రాధాన్యత గల రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో నిత్యం ఎస్ఎస్ఎం స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పానీపూరి బండ్లు, కూరగాయల బండ్లు, ఇస్త్రీ బండ్లు, సైకిల్ రిపేర్ షాపులు ఇలా ఇష్టాను సారంగా ఆక్రమించేశారు. షాపుల వద్ద పెద్ద ఎత్తున వాహనాలు ఆపడంతో నిరంతరం ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఆటోలు, కార్లు ఎక్కడి పడితే అక్కడ ఆపేయడంతో పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎస్ఎస్ఎం రోడ్డులో ఆక్రమణలు

ఆంధ్రా లయోలాకు అటానమస్ గుర్తింపు

భారతీనగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాలకు అటానమస్ పునరుద్ధరించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల వచ్చిన ఆరోపణలు, విమర్శలపై కృష్ణ యూనివర్సిటీ స్పందించింది. కళాశాలకు నోటీసులు జారీ అయ్యాయి. దీంతో కళాశాల యాజమాన్యం తిరిగి అటానమస్ హోదా కోసం యూజీసీకి పూర్తి సమాచారంతో దరఖాస్తు చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇటీవల సమావేశమైన యూజీసీ కమిటీ విచారణ చేసి తిరిగి కళాశాలకు అటానమస్ హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ఆదేశాలను కృష్ణయూనివర్సిటీకి జారీ చేసిందన్నారు. కళాశాలకు తిరిగి అటానమస్ హోదా లభించడంపై యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

ఐఎస్ఐ ఉత్పత్తులనే వినియోగించాలి

లబ్బీపేట, మే29(ఆంధ్రజ్యోతి): ఐఎస్ఐ మార్క్ కలిగిన ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలని బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్(బీఐఎస్) విజయవాడ బ్రాంచ్ డైరెక్టర్ ప్రేమ్ సజాని అన్నారు. బీఐఎస్ నూతనంగా ప్రవేశపెట్టిన నాణ్యత ప్రమాణాలకు సంబంధించిన ఐఎస్ 18166పై (మనక్ మంథన్) కార్యక్రమాన్ని బందర్ రోడ్డులోని ఒక హోటల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. అనంతరం సీపెట్ విజయవాడ హెడ్ డాక్టర్ చింతా శేఖర్ మాటాడుతూ నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించడం శుభపరిణామన్నారు. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ కె.సాయికౌశిక్, ఐఎస్ఐ మార్క్, హల్‌మార్క్, రిజిస్ట్రేషన్ మార్క్ నాణ్యాతా ప్రమాణాల గురించి వివరించారు.



దేశ రక్షణలో భాగస్వాములవుదాం

'ఓ.. త్యాగమూర్తులారా..' సీడీ ఆవిష్కరణలో వక్తలు

విజయవాడ కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలన్న ఉద్దేశంతో గురువారం తపస్వి కల్చరల్ ఆర్ట్స్ సంస్థ, ఆంధ్ర నాటక కళా సమితి ఆధ్వర్యంలో సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో గురువారం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా 'ఓ.. త్యాగమూర్తులారా' అనే దేశభక్తి గీతం సీడీని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర సజనాత్మక, సాంస్కృతిక సమితి డైరెక్టర్ తపస్వి మాట్లాడుతూ 'దేశాన్ని రక్షించేందుకు ప్రాణత్యాగం చేస్తున్న వీరులు దేశ పౌరులందరికీ ఆదర్శంగా నిలుస్తారు. వారు సదా స్మరణీయులన్నారు. ఇదే సమయంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగ్గ మహానటుడునందమూరి తారక రామారావు అన్నారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్ కార్యదర్శి సూర్యదేవర జగన్నాథరావు సంస్థ లక్ష్యాలను వివరించారు. వేమూరి నాగేశ్వరశర్మ గీతిక రచన చేయగా, సూర్యనారాయణ, సుధా శ్రీనివాస్ ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నాట్యాచార్య హేమంత్‌కుమార్ శిష్య బృందం దేశభక్తి నృత్యాల ప్రదర్శన చేశాయి.



సీడీని ఆవిష్కరిస్తున్న కల్చరల్ డైరెక్టర్ మల్లికార్జునరావు, హజరత్తయ్య గుప్తా తదితరులు



కృష్ణలంకలో నిర్మల శిశుభవన్ చిన్నారులతో మాజీ సీఎం జగన్మోహనరెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతి తదితరులు

వైఎస్ రాజారెడ్డి జయంతి వేడుక

విజయవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్, కుటుంబ సభ్యులు నగరంలోని కృష్ణలంకలో నిర్మల శిశుభవన్‌లో చిన్నారులతో సరదాగా గడిపారు. వైఎస్ రాజారెడ్డి జయంతి సందర్భంగా శిశుభవన్‌లోఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో దేవినేని అవినాస్, పోతిన మహేష్, ఎమ్మెల్సీ తలశీల రఘురాం, వెలంపల్లి శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పదో రోజుకు గ్రంథాలయ వర్క్‌షాపు

విజయవాడ కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ బుక్ ఫెస్టివల్ గ్రంథాలయ ప్రాంగణంలో వర్క్‌షాపు పదో రోజు గురువారం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు స్టోరీ వీవర్ డిజిటల్ వేదికపై ఉన్న కథలను చదివి, తామే స్వయంగా కథలు రూపొందించి ఈ బుక్స్‌గా తయారీకి యత్నించారు. విద్యార్థులు తమ కథలను సమర్పించగా వాటిని డిజిటల్ పుస్తకాలుగా రూపొందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సమావేశంలో సాహితి ప్రచురణలు సంస్థకు చెందిన జి.లక్ష్మి, సహస్ర బుక్స్ నిర్వాహకులు ఎ.బి.ఎస్.సాయిరాం, నవరత్న బుక్ హౌస్ నుంచి బి.రవికుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పుస్తకపఠనంలో తమకు ఈ వర్క్‌షాప్ ఎంతో సహాయపడిందని విద్యార్థులు అన్నారు. ప్రజాశక్తి బుక్ హౌస్ తరఫున కె.లక్ష్మయ్య, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక తరఫున గోళ్ల నారాయణరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో నిహారిక, పర్వానీ పాల్గొన్నారు. శుక్రవారంతో వర్క్‌షాప్ ముగుస్తుందని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక, విజయ వాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమా

గుణదల ఆర్‌వోబీకి అనుమతులు

ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

పాయకాపురం, మే 29(ఆంధ్రజ్యోతి): గుణదల ఆర్‌వోబీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం పలు డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మట్లాడుతూ దీని నిమిత్తం వచ్చే నెల 3న ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్, రైల్వే డీఆర్ఎం తదితరులతో రివ్యూ మీటింగ్ ఉందన్నారు. రైల్వే ఎస్ఎస్ఈ సీనియర్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ డీఈ సత్యనారాయణ, మున్సిపల్ ఈఈశ్రీనివాస్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు.



వాహనానికి జెండా ఊపి పంపుతున్న మండవ కటుంబ సభ్యులు

టీటీడీకి కూరగాయలు

మొగల్రాజపురం , మే 29 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ చేస్తున్న అన్నదానంలో పాలు పంచుకునేలా కూరగాయలు పంపే ఒక మంచి కార్యక్రమాన్ని ప్రారంభించిన మండవ కుటుంబరావు ఆశయాన్ని కొనసాగిస్తున్నామని మండవ కుటుంబరావు మిత్రమండలి ఎం.నాగేంద్ర అన్నారు. మండవ కుటుంబరావు వర్ధంతి సందర్భంగా టీటీడీకి పదిటన్నుల కూరగాయలతో పంపుతున్న లారీని మిత్రమండలి సభ్యులు జెండా ఊపి ప్రార ంభించారు. ఏ వన్ కన్వేన్షన్ సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో తొలుత కుటుంబరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మేదరమెట్ల శ్రీనివాస్, గుమ్మడి సురేష్, అరవపల్లి అదిత్య, శేషసాయి వర్మ, మాజీ కార్పొరేటర్ గోగినేని సుజాత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

భారతీనగర్, మే29(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా లయోలా కళాశాలలోని కళాదర్శిని వేసవి శిక్షణ తరగతులు ముగింపు గురువారం దేవయ్య ఆడిటోరియంలో జరిగింది. కార్యక్రమంలో జోసెఫ్ రాజారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాదర్శిని టీచర్స్ బాలస్వామి, డాక్టర్ రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కనకదుర్గా నగర్‌లో షాపులు

మహామండపం 5వ అంతస్థుకు

ఇంద్రకీలాద్రి, మే 29(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి దిగువన కనకదుర్గానగర్‌లోని షాపులను మహామండపం 5వ అంతస్థులోకి తరలించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఈవో వి.కె.శీనానాయక్ అధికారులను ఆదేశించారు. దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనుల భాగంగా అధికారులు కనకదుర్గానగర్‌లో శాశ్వత క్యూలైన్‌ల నిర్మాణం చేపడుతున్నారు. కనకదుర్గానగర్‌లో 11 షాపుల నిర్వాహకులు రహదారిని ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో కాలినడకన వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. భక్తులు ఇబ్బందులు తొలగించేందుకు కనకదుర్గానగర్‌లోని షాపులన్నింటినీ మహామండపం ఐదో అంతస్థులోకి తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు షాపులు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కనకదుర్గా నగర్‌లోని షాపుల కాలపరిమితి జూన్‌తో ముగియనుంది. ఆ షాపులకు రెన్యు వల్ చేయాలంటే షాపు నిర్వాహకులందరూ 5వ అంతస్థులోకి వెళ్లాల్సిందేనని అధికారులు తేల్చిచెప్పారు. అలా జరగని పక్షంలో రద్దుచేసి షాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తామని ఈవో శీనానాయక్ తెలిపారు. భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కనకదుర్గానగర్‌లో ఎటువంటి షాపులకు అనుమతి ఇవ్వటం లేదని ఆయన తెలిపారు.



అన్నవితరణకు విరాళాలు..

విజయవాడ చిట్టినగర్‌కు చెందిన బి.పూర్ణ చంద్రరావు గురువారం తమ కుటుంబ సభ్యులతో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వెళ్లారు. ఈ సందర్భంగా అన్నవితరణకు అధికారులను కలిసి రూ.1,00,116 చెక్కు అందజేశారు. హైదరాబాద్ కమలానగర్‌కి చెందిన తాతినేని శేషగిరిరావు అన్నవితరణ నిమిత్తం అధికారులను కలిసి రూ.1,01,116 చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యులకు అమ్మ వారి దర్శనం కల్పించి, వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం అధికారులు ప్రసాదం, శేషవస్త్రం,అమ్మవారి చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మకు నృత్య కళార్చన

కళావేదికపై ఢిల్లీకి చెందిన శ్రీధ్యుయా నృత్య కళానిలయం కళాకారులు అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. నృత్యాచార్య అయ్యానా ముఖర్జీ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహిం చిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫి కెట్లను అందజేశారు.

సూపర్ అవార్డ్స్-2025

భారతీనగర్: ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీపీసీ) ఆధ్వర్యంలో భారతీనగర్ కాలనీలోని కార్యాలయంలో గురువారం బీజేపీ మీడియా ఇంచార్జీ పాతూరు నాగభూషణం పాల్గొని సూపర్ స్టార్ కృష్ణ సూపర్ అవార్డ్స్ 2025 పోస్టర్‌ను విడుదల చేశారు. ఎఫ్‌టీపీసీ ఇండియా అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవ లందించిన వారిని గుర్తించి అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. ముఖ్యంగా సినిమా, సాంకేతిక, సామాజిక సేవ తదితర రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని గుర్తిస్తామన్నారు.





ఆనందం, ఆరోగ్యం యోగాతో సాధ్యం: సీఎస్

సత్యనారాయణపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆనందం, ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కే విజయానంద్, అన్నారు. సత్యనారాయణపురం బీఆర్‌టీఎస్ రోడ్డులో ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో గురువారం పోలీసు థీమ్ యోగాంధ్ర జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కే విజయానంద్ పాల్గొని,సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గానికి యోగాను చేరవేసేందుకు థీమ్ యోగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో భాగస్వాములైన యోగా ఔనత్యానికి వన్నె తెస్తున్నారన్నారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి. జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 15లక్షల మందికి యోగాను చేర వేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన ఆర్టిస్టిక్ యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కమిషనర్ వీరపాండియన్, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్‌కుమార్, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ ఆఫ్ పోలీసు బి. రాజకుమారి, ఐజీ రవికృష్ణ, ఏపీఎస్‌పీ ఐ.జి రత్నకుమార్, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, అధికారులు పాల్గొన్నారు.



1 నుంచి నుంచి రేషన్ పంపణీకి సిద్ధం

● పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

మధురానగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కార్డుదారుల సౌలభ్యం కోసం జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల్లో సరుకులు పంపిణీకి సిద్ధమని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు.



కొత్త సాఫ్ట్‌వేర్‌ను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల, కమిషనర్ సౌరభ్‌గౌర్

ఎండీ యూ ఈ-పోస్‌లోని సాఫ్ట్‌వేర్‌ను తొలగించి రేషన్ డీలర్ ద్వారా పంపిణీకి రూపొందించిన సాఫ్ట్‌వేర్ పరిశీలనకు మధురానగర్‌కు చెందిన రేషన్ డిపో -218ని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్‌తో కలిసి సందర్శించారు. కొత్త అప్లికేషన్ ద్వారా కార్డు నెం బరుతో ఎంటరయ్యే విధానం, కార్డుదారుడి వేలిముద్ర, కంటిపాప ద్వారా సరుకులు నమోదయ్యే విధానంతో పాటు ఎంత సమయం పడుతుందో పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇకపై రేషన్ కోసం రోడ్లపై తిరగాల్సిన పరిస్థితి ఉండదన్నారు. త్వరలో మరిన్ని సరుకులు అందించే ఆలోచన చేస్తున్నామన్నారు. ఇల్లు మారినా పోర్టబిలిటీ విధానంలో సమీప దుకాణంలో రేషన్ పొందవచ్చన్నారు. ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌వో ఏ పాపారావు, ఏఎస్‌వో శ్రీ నివాసుల నాయుడు, ఉత్తర మండల తహసీల్దార్ సూర్యారావు, ఎన్టీఆర్ జిల్లా రేషన్ డీలర్స్ సంఘ ప్రధాన కార్యదర్శి పీ శివప్రసాద్, విజయవాడ కార్యనిర్వాహక అధ్యక్షులు జే శ్రీనివాస్, విజన్ టెక్ అధికారులు చంద్రశేఖర్, హేమంత్ పాల్గొన్నారు. మధురానగర్ కార్పొరేటర్ లక్ష్మీపతి, డివిజన్ జనసేన ఇన్‌చార్జి కెంబూరి భవానీకృష్ణ, టీడీపీ డివిజన్ కార్యదర్శి రాంబాబు, లాలాజీ తదితరులు మంత్రి మనోహర్‌కు స్వాగతం పలికారు.

మా సంస్థపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు

● వేగా జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్

గుణదల, మే 29 (ఆంధ్రజ్యోతి): ముచ్చెర్ల శ్రీనివాసరావుకు త మకు ఎలాంటి సంబంధం లేదని వేగా జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్ అన్నారు. రామవరప్పాడు రింగ్‌రోడ్డు వద్దనున్న ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నమ్మకంతో ఎదిగిన సంస్థ తమదన్నారు. తమ సంస్థతో కానీ, వ్యక్తిగతంగా కానీ శ్రీనివాసరావుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తమ సంస్థ పేరును వినియోగిస్తున్న వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీనివాసరావు ఎక్కడా తమ సంస్థపేరు వాడలేదన్నారు. బాధితులు మాత్రమే తమ పేరు వాడారన్నారు. తమకు మోసాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. తమ వద్ద చిట్టీలనేవి ఉండవన్నారు. కేవలం 11 నెలల స్కీమ్ మాత్రమే ఉందన్నారు. కుట్రపూరితంగా తమ పేరు వాడినవారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ బ్రాంచ్‌లో శ్రీనివాసరావు మేనల్లుడు మణిదీప్‌కు 29 శాతం వాటా ఉందన్నారు.

బాబాయ్.. బాగున్నావా!

● కలెక్టర్ ఆప్యాయ పలకరింపు ● ఆనందం వ్యక్తం చేసిన హమాలీలు

కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ గురువారం గొల్లపూడిలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను సందర్శించారు. అనతరం లారీల నుంచి దిగుమతి అవుతున్న బియ్యం బస్తాలను పరిశీలించారు. ఈ క్రమంలో హమాలీలతో కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడారు. భారీ బరువులను ఎత్తుతూ దించుతూ ఆరుగాలం కష్టపడే కార్మికులపై ఆయన ఎంతో ప్రేమను చూపారు. హమాలీల భుజంపై చేయివేసి వేసి ఆప్యాయంగా ఆలింగనం చేసుకొన్నారు. 'బాబాయ్...బాగున్నావా?' అంటూ పలకరించారు. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకొన్నారు. ఒక జిల్లా కలెక్టర్ అత్యంత సామాన్యంగా తమ వద్దకు వచ్చి పేర్లు అడిగి మరీ తెలుసుకొని మాట్లాడటంపై హమాలీలు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ ఏ కలెక్టర్ తమతో ఇలా ముచ్చటించలేదన్నారు.కలెక్టర్ ఇలా తమతో గడపడం చాలా ఆనందాన్నిచ్చిందని ఆ తర్వాత హమాలీలు తెలిపారు.



హమాలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

సరుకుల పంపిణీకి సిద్ధంగా ఉండాలి

మండల లెవల్ స్టాక్ పాయింట్ నుంచి (ఎంఎల్ఎస్) నుంచి రేపటిలోగా నిత్యావసర సరుకుల పంపిణీ పూర్తిచేసి రేషన్ దుకాణాల నుంచి సరుకులు పంపిణీకి సిద్ధం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ పునః ప్రారంభం నేపథ్యంలో గురువారం విజయవాడ రూరల్ గొల్లపూడి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సరుకుల లోడింగ్ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొల్లపూడి ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములోని నిత్యావసర సరుకులను పరిశీలించి, ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి చౌకధరల దుకాణాలకు సరుకుల పంపిణీ, రవాణా చార్జీలు, హమాలీలకు చెల్లింపులు తదితర వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 957 రేషన్ దుకాణాల ద్వారా సుమారు 8,929 టన్నుల బియ్యాన్ని, సుమారు 260 టన్నుల పంచదార పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. దివ్యాంగులు, 65ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ సరుకులు పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడినా తక్షణం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

రాజధాని నిర్మాణంలో భద్రత కట్టుదిట్టం

● బాలకార్మికులు, లింగవివక్ష ఉండకూడదు ● సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

విజయవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రతకు సంబంధించి నిర్దేశించిన నిబంధనలన్నీ రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు సంస్థలు పాటించాలని సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ సూచించారు. రాజధాని ప్రాంతంలో శాంతిభద్రతల పర్యవేక్షించే విషయం గురించి విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో గుత్తేదారు సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని నిర్మాణపనుల్లో బాలకార్మికులు, లింగవివక్షకు తావులేదన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణ, కార్మికుల భద్రతకు సంబంధించిన అంశాలలో పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులు, మేనేజ్మెంట్ కన్సల్టెన్సీ సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. నిర్మాణపనుల్లో గుత్తేదారు సంస్థలు పాటించాల్సిన ప్రమాణాలను ఇప్పటికే తెలిపామని, పీఎంసీ సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీశ్‌తో పాటు ఇతర అధికారులు సమావేశంలో చేసిన సూచనలు, అంశాలను ప్రణాళికాబద్ధంగా అమలుచేస్తామన్నారు. పోలీసుశాఖ కోరినట్టు రాజధానిలో భద్రతా కార్యకలాపాల నిర్వహణ, శాంతిభద్రతల పర్యవేక్షణలో సీఆర్డీఏ నుంచి సహకారం అందజేస్తామని ప్రవీణ్‌చంద్ వెల్లడించారు. సీఆర్డీఏ చీఫ్ ఇంజినీర్లు డి.శ్రీరామచంద్రమూర్తి, ధనుంజయ, ఎన్.శ్రీనివాసులు, సీఆర్డీఏ, ఏడీసీఎల్‌లోని వివిధ విభాగాల అధికారులు, మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, తుళ్లూరు పీఎస్ ఎస్‌డీపీవో మురళీకృష్ణ, సీఐ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌చంద్



సైకిల్‌ని ఎత్తి కింద పడేస్తున్న కార్యకర్తలు

వీళ్లు ఇంతే.. ఇక మారరు!

● జగన్ మెప్పు కోసం సైకిల్‌ను కిందేసి తొక్కిన వైసీపీ కార్యకర్తలు
● కొందరు మందేసి చిందేసి... ఇంకొందరు జేబులకు కన్నాలేశారు

ఇబ్రహీంపట్నం, మే 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బ్యాచ్ ఏమాత్రం మారడం లేదు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో గురువారం జరిగిన మాజీమంత్రి జోగి రమేష్ కుమారుడు రాజీవ్- మేఘన వివాహ రిసెప్షన్‌కు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి హాజరయ్యాడు. అధినేత మెప్పు కోసం వైసీపీ మూకలు నానా యాగీ చేశారు. టీడీపీ గుర్తు అయిన సైకిల్‌ను జగన్ కాన్వాయ్ ముందుకు తెచ్చి గిరాగిరా తిప్ప నేలకేసి కొట్టారు. కింద పడేసిన సైకిల్‌ను కాళ్లతో తన్నుతూ జై జగన్ అని, సీఎం అని నినాదాలు చేశారు. ఓ వీరాభిమాని ఏకంగా కారులోనే బీరు తాగి బాటిల్ పక్కనే పడేసి కారెక్కి చిందేశాడు. కొందరి అభిమానుల జేబులకు చిల్లర దొంగలు కన్నం వేశారు. మరోపక్క జగన్ రాకతో ఇబ్రహీంపట్నంలో రింగ్ వద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు, వాహన చోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చడంతో ఆ పొగకు నిలిచిపోయిన ట్రాఫిక్‌లో ఉన్న ప్రజలు, ద్విచక్ర వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు.

ప్రమాదవశాత్తు బావిలో పడిన కుక్క

● ప్రాణాలు కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

జగ్గయ్యపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినపుడు ఆస్తిపాస్తులు, మనుషులనే కాదు జంతువుల ప్రాణాలు కాపాడటంలోనూ తమ బాధ్యతలు నిర్వహిస్తూ పలువురు ప్రశంసలు అందుకుంటున్న జగ్గయ్యపేట అగ్నిమాపక అధికారులు, సిబ్బంది. ఉదయం 9గంటలకు అగ్నిమాపక కేంద్రానికి చిల్లకల్లు నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. పాడుబడ్డ బావిలో కుక్క పడిపోయిందని ఎలాగైనా కాపాడాలని సమాచారం. వెంటనే ఫైరాఫీసర్ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వెళ్లారు. 40 అడుగుల లోతులో పడిన కుక్కను బయటికి తీసేందుకు అగ్నిమాపక సిబ్బంది సిద్ధమయ్యారు. తాడు కట్టుకుని బావిలోకి దిగి వేరే తాడుతో కుక్క నడుముకు తాడు కట్టి తిన్నగా పైకి లాగారు. తాడు ఏ మాత్రం జారినా కుక్కకు ఉచ్చు బిగుస్తుంది. లాఘవంగా కుక్కను పైకి లాగారు. ప్రజల నుంచి వచ్చిన కాల్‌కు స్పందించి హుటాహుటిన వాహనాన్ని సిబ్బందిని పంపిన ఫైరాఫీసర్ ప్రజలు ప్రశంసలు అందుకున్నారు. ప్రాణమున్న ఏ జీవికి ఆపాయం కలిగిన స్పందిస్తామని ఫైరాఫీసర్ శ్రీనివాస్ చెప్పారు.

మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను రెండవ రోజు విచారించిన పోలీసులు

తుళ్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్త ఇసుకపల్లి రాజును చితక బాదిన కేసులో బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు రిమాండ్ విధించారు. కేసులో అదనపు సమాచారం కోసం గుంటూరు జిల్లా జైలులో ఉన్న నందిగం సురేశ్‌ను మూడు రోజులు కస్టడీ కోరుతూ తుళ్లూరు పోలీసులు మంగళగిరి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను కోర్టు అనుమతించడంతో బుధవారం జిల్లా జైలు నుంచి నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ మొదలు పెట్టారు. ఈ కేసులో నందిగం పాత్రం ఎంత మేరకు ఉందనేది విచారిస్తున్నారు. కేసులో నందిగం సురేష్‌తో పాటు ఎంత మంది పాల్గొన్నారు? బాధితుడు రాజును బైకుపై ఎక్కించుకెళ్లి కొట్టిన వారి వివరాలు, ఆ బైకు నెంబర్ వివరాలు, రెండవ రోజు గురువారం విచారణలో పోలీసులు నందిగం సురేశ్ నుంచి సేకరించినట్టు తెలిసింది. మూడో రోజు శుక్రవారం కూడా మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పోలీసులు విచారించనున్నారు.

వికసిత్ భారత్‌లో స్వర్ణాంధ్ర భాగస్వామ్యం కీలకం

» వికసిత్ భారత్ కార్యక్రమంగా 20 సూత్రాల అమలు: లంకా దినకర్

న్యూఢిల్లీ, మే 29(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్‌లో స్వర్ణాంధ్ర భాగస్వామ్యం కీలకమని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ అన్నారు. గురువారం ఢిల్లీలోని ఏపీభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని తీర్చిదిద్దాలని ప్రధాని మోదీ లక్ష్యంగా పెట్టుకోగా, ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. 20 సూత్రాల అమలు కార్యక్రమాన్ని పీఎం వికసిత్ భారత్ అమలు కార్యక్రమంగా మార్చనున్నట్టు తెలిపారు.

ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జిగా 'గన్ని'

» 13 డీసీసీబీలకు పీఐసీల నియామకం

అమరావతి, మే29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ (ఆప్కాబ్) నాన్ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా ఉంగుటూరు నియోజకవర్గ టీడీపీ మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆప్కాబ్‌కు ప్రస్తుత అధికారిక పర్సన్ ఇన్‌చార్జి గడువు 2025 జూలై 17వరకు ఉన్నందున, మిగిలిన కాలంలో బ్యాంక్ వ్యవహారాలను నిర్వహించడానికి నాన్ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా వీరాంజనేయులు పదవిలో ఉంటారని పేర్కొంది. అలాగే రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లోని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ)ల నాన్ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలను ఎంపిక చేసిన ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. డీసీసీబీల అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం ప్రకారం జూన్ 26వరకు నాన్ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలు కొనసాగుతారని ప్రభుత్వం తెలిపింది. తదుపరి, ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జితో పాటు, వీరందరి పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించే అవకాశం ఉంది.

మహిళా కమిషన్ విధివిధానాలపై చర్చ

» మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శితో చైర్‌పర్సన్ భేటీ

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ గురువారం మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారితో అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్‌కు సంబంధించిన విధి విధానాలపై చర్చించారు. కమిషన్ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక తదితరాలపైనా చర్చ జరిగింది.

మద్దతు ధరలను పునఃసమీక్షించాలి: సీపీఐ

అమరావతి, మే 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పంటలకు ప్రకటించిన కనీస మద్దతు ధరలపై పునఃసమీక్ష నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ధాన్యానికి కంటితుడుపు చర్యగా క్వింటాకు రూ.69 మాత్రమే పెంచడం దారుణమన్నారు. మొక్కజొన్నకు రూ.175, కందులకు రూ. 450, మినుములకు రూ. 400, పెసలకు రూ. 86, వేరుశనగకు రూ.480, పొద్దుతిరుగుడుకు రూ. 441, పత్తికి రూ. 589 పెంచిందని, ఆయా పంటలకయ్యే పెట్టుబడి ఖర్చులతో పోల్చుకుంటే ఈ పెంపుదల నామమాత్రమేనని తెలిపారు.

కారు నడుపుతూ.. అల్పాహారం!

అదుపుతప్పి డివైడర్‌పైకి.. ముగ్గురి మృతి.. మృతులు ముగ్గురూ తోడికోడళ్లు



తోడికోడళ్లు ఝాన్సీరాణి, సూర్యకుమారి, సరస్వతి (ఫైల్)

» అరుణాచలం బయలుదేరిన కొద్దిసేపటికే ఘోరం
» ఇద్దరికి గాయాలు.. అంతా తెనాలి వాసులు
» బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ప్రమాదం

మేదరమెట్ల, తెనాలి, మే 29(ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన ఆ ముగ్గురూ మూడు కుటుంబాల నుంచి అదే పట్టణంలోని మెట్టినింటికి వచ్చినా.. సొంత అక్క చెల్లెళ్లకంటే కలిసిమెలిసి ఉండేవారు. ఏ కార్యక్రమమైనా కలిసే చేసేవారు. ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్లేవారు. ఆఖరికి.. మరణంలోనూ ఒకరినొకరు వీడలేకపోయారు! బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో హైవేపై గురువారం జరిగిన కారు ప్రమాదంలో ఒకే కుటుంబంలోని ముగ్గురు తోడికోడళ్లు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. తెనాలికి చెందిన కన్నిగంటి నరసింహారావు, కన్నిగంటి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు అన్నదమ్ములు. వీరంతా వ్యాపార, విద్యా సంస్థల నిర్వహణలో స్థిరపడ్డారు. వివాహాలు కూడా తెనాలికి చెందిన సూర్యకుమారి, సరస్వతి, ఝాన్సీరాణిలను చేసుకున్నారు. ఒక్కో కుటుంబంలో ఇద్దరేసి సంతానం కాగా, వారందరికీ వివాహాలు జరిగాయి. ఆరుపదుల వయస్సులో భర్తలతో సంతోషంగా శేషజీవితం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో అరుణాచలేశ్వరుని దర్శించుకోవాలని భర్తల అనుమతి తీసుకుని.. వారి ఆడపడుచు కృష్ణంశెట్టి పార్వతితో కలసి ఝాన్సీరాణి(60) కుమారుడి కారులో గురువారం ఉదయం 11 గంటల సమయంలో తమిళనాడు బయలుదేరారు. ఝాన్సీరాణి కుమారుడు నాగార్జున కారు నడుపుతుండగా, పక్కన కూర్చొన్న తల్లి అతడికి అల్పాహారం తినిపిస్తోంది. సరిగ్గా ఆ సమయంలో కారు అతివేగంతో వెళుతుండగా.. మేదరమెట్ల-తిమ్మనపాలెం మధ్య రోడ్డుపై అదుపుతప్పి ఒక్కసారిగా డివైడర్‌పైకి దూసుకెళ్లింది. డివైడర్ దిమ్మెను బలంగా ఢీకొని రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో ముందు కూర్చున్న ఝాన్సీరాణి అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదం జరిగిన వెంటనే పెద్దఎత్తున స్థానికులు, వాహనదారులు చేరుకుని గాయపడిన వారిని కారులో నుంచి బయటకు తీశారు. మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు ఘటన స్థలికి చేరుకుని, తీవ్రంగా క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ సూర్యకుమారి(62), సరస్వతి(65) మృతిచెందారు. నాగార్జున, పార్వతి తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. కాగా, ప్రమాదంలో గాయపడిన నాగార్జున కొద్దిసేపటి తర్వాత కోలుకుని 'మా అమ్మేదీ.. అమ్మేదీ'.. అంటూ చుట్టుపక్కల వెతుకుతూ రోదించిన తీరు అక్కడ ఉన్న అందరినీ కంటతడి పెట్టించింది. కాగా, ఆరు పదుల వయస్సు దాటిన భర్తలకు చివరి వరకు తోడుండాల్సిన వారు దూరమైపోవటం ఆ మూడు కుటుంబాల వారు, బంధువులు తీరని శోకంలో మునిగిపోయారు. బంధువులంతా తెనాలి నుంచి సంఘటన జరిగిన మేదరమెట్ల ప్రాంతానికి తరలివెళ్లారు. ఈ వార్త క్షణాల్లో తెలియటంతో తెనాలి పట్టణంలోనూ విషాదం నెలకొంది.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఒట్టు.. 'మట్టి'తో సంబంధం లేదు

» పోలీసుల విచారణలో వంశీ ప్రధాన అనుచరుడు రంగా బుకాయింపు
» నేడూ ప్రశ్నించనున్న అధికారులు

విజయవాడ/గన్నవరం, మే 29(ఆంధ్రజ్యోతి): "గ్రావెల్, మట్టి తవ్వకాల గురించి ఏమీ తెలీదు. వాటిని ఎవరు తవ్వారో అంతకన్నా తెలీదు" అని గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగా పోలీసులకు చెప్పారు. గన్నవరం, బాపులపాడు మండలాల్లో జరిగిన అక్రమ తవ్వాలకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో రంగాను గురువారం కస్టడీకి తీసుకున్నారు. రంగాను కోర్టు రెండు రోజుల కస్టడీకి అనుమతించడంతో గన్నవరం పీఎస్‌కు తరలించి డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు విచారించారు. గన్నవరం, బాపులపాడు మండలాల్లో మట్టిని, గ్రావెల్‌ను ఎవరి ప్రోద్బలంతో తవ్వారని ప్రశ్నించగా, వాటి గురించి తనకేమీ తెలియదని రంగా జవాబు ఇచ్చారు. ఈ రెండు వ్యవహారాలను వంశీ వద్ద చక్కబెట్టింది మీరే కదా? అని ప్రశ్నించగా గుర్తులేదని సమాధానం ఇచ్చారు. తవ్విన మట్టిని ఎక్కడికి తరలించారని అడిగితే మౌనం వహించారు. మట్టి, గ్రావెల్ అమ్మకాల డబ్బులు ఎవరికి చేరాయని అడిగినా సమాధానం ఇవ్వలేదు. తాను వంశీ వద్ద ఉన్నప్పటికీ నగదు, తవ్వకాల వ్యవహారాల్లో వేలు పెట్టలేదని చెప్పినట్టు తెలిసింది. ఎక్కడైనా సమావేశాలు, కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వంశీ చెబితే ఆ పనులు మాత్రమే చేసేవాడినన్నట్టు తెలిసింది. తొలిరోజు 25 ప్రశ్నలు సంధించినట్టు సమాచారం. కాగా, శుక్రవారం కూడా రంగాను ప్రశ్నించనున్నారు.

మావోయిస్టుల అంత్యక్రియల కోర్టుధిక్కరణ పిటిషన్ కొట్టివేత

» ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అధికారులపై చర్యలు మా పరిధి కాదు: హైకోర్టు

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, మావోయిస్టు పత్రిక 'ఆవామ్ ఇ జంగ్' ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు సజ్జా వెంకట నాగేశ్వరరావుల మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించాలనే ఆదేశాలను ధిక్కరించిన ఛత్తీస్‌గఢ్ సీఎస్, డీజీపీ, బస్తర్ రేంజ్ ఐజీలపై కోర్టుధిక్కరణ చర్యలు ప్రారంభించాలంటూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఎన్‌కౌంటర్, అంత్యక్రియలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగాయని, ఆ రాష్ట్ర అధికారులపై కోర్టుధిక్కరణ చర్యలు ప్రారంభించే అధికార పరిధి తమకు లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. నంబాల కేశవరావు తల్లి భారతమ్మ, సోదరుడు ఢిల్లీశ్వరరావు, సజ్జా వెంకట నాగేశ్వరరావు సోదరుడు సజ్జా శ్రీనివాసరావు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించే విషయంలో ఛత్తీస్‌గఢ్ ఏజీ కోర్టుకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా పోలీసులే మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారని కోర్టు దృష్టికి తెచ్చారు. బాధ్యులైన ఛత్తీస్‌గఢ్ సీఎస్, డీజీపీ, బస్తర్ రేంజ్ ఐజీపై కోర్టుధిక్కరణ చర్యలు ప్రారంభించాలని కోరారు.

కడప మేయర్ విషయంలో స్టేటస్ కో పాటించండి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం


అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): కడప మేయర్ సురేష్‌బాబు విషయంలో యథాతథస్థితి (స్టేటస్ కో) పాటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. మేయర్ బాధ్యతల నుంచి తొలగిస్తూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. న్యాయవాదిని నియమించుకొని వివరణ ఇచ్చేందుకు రెండువారాల సమయం ఇవ్వాలన్న పిటిషనర్ వినతిని ప్రభుత్వ ఉత్తర్వుల్లో ప్రస్తావించలేదని పేర్కొంది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులకు అనుగుణంగా వాదన వినిపించేందుకు పిటిషనర్‌కు తగిన అవకాశం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. తనను మేయర్ పదవి నుంచి తొలగిస్తూ ఈనెల 14న పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేయాలంటూ సురేష్‌బాబు హైకోర్టులో అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. ఆ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరిస్తూ అనుబంధ పిటిషన్‌ను కొట్టివేశారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ సురేష్‌బాబు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. సురేష్‌బాబు తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. వర్ధిని కనస్ట్రక్షన్స్ కంపెనీకి పనుల కేటాయింపుపై పిటిషనర్‌కు అవగాహన లేదన్నారు. ఆరోపణలపై వివరణకు సమయం ఇవ్వకుండానే మేయర్ పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పురపాలకశాఖ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది యతీంద్ర దేవ్, కడప ఎమ్మెల్యే మాధవి తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. మేయర్ పదవిని పిటిషనర్ దుర్వినియోగం చేశారన్నారు. కుటుంబ సభ్యులకు కార్పొరేషన్ పనులు అప్పగించి మేయర్ పదవికి పిటిషనర్ అర్హత కోల్పోయారన్నారు. వివరణ ఇచ్చేందుకు పిటిషనర్‌కు తగినంత సమయం ఇచ్చామన్నారు. గతంలో డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగానే వివరణ తీసుకున్న తరువాతే పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి తొలగింపు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం మేయర్ విషయంలో స్టేటస్ కో పాటించాలని ఆదేశించింది.

యూఎస్ కాలిఫోర్నియాలో ఘనంగా మినీ మహానాడు

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): అమెరికా, కాలిఫోర్నియాలోని ఫ్రీమాంట్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు, మినీ మహానాడు 2025 కార్యక్రమం ఘనంగా జరిగాయి. బే ఏరియాలోని భీమవరం రుచులు బాంకెట్ హాలులో బుధవారం రాత్రి టీడీపీ ఎన్నారై నేత దొడ్డపనేని శ్రీకాంత్ నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా, వక్తలుగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కర్నూలు ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి నేత బుచ్చి రాంప్రసాద్, తెలుగు మహిళ మాజీ అధ్యక్షురాలు తిరునగరి జ్యోత్స్న, ఎన్టీఆర్ వీరాభిమాని ఎల్ రమణ, టీడీపీ ఎన్నారై అధ్యక్షుడు వేమూరు రవి, యూఎస్‌ఏ కోఆర్డినేటర్ జయరాం కోమటి తదితరులు వర్చువల్‌గా హాజరయ్యారు.

వ్యాసపీఠం

రాజీవ నేత్రాయ.. రాఘవాయ



15వ శతాబ్దానికి చెందిన శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు రాసిన సంకీర్తనలు ఈ నాటికి మన తెలుగునాట మారుమ్రోగుతూ ఉంటాయి. తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ ఆయన రాసిన సంకీర్తనలు విశిష్టమైనవి. తన 16వ ఏట సంకీర్తనా రచనను ప్రారంభించిన అన్నమయ్య రోజుకు ఒక సంకీర్తన చొప్పున 32 వేల సంకీర్తనలు రాశాడని ప్రతీతి. దీని వెనక కూడా ఒక కథ ఉంది. మొదట్లో స్మార్త బ్రాహ్మణుడైన అన్నమయ్య... ఆదివన్ శఠకోపయతి అనే గురువు వల్ల శ్రీవైష్ణవునిగా మారాడని, సుప్రసిద్ధ నారసింహ క్షేత్రమైన అహోబిలంలో వేదాంత విద్యను అభ్యసించాడని చెబుతారు. నృసింహమంత్రంలోని 32 బీజాక్షరాలకు సంకేతంగా 32 వేల సంకీర్తనలు రాశాడని ప్రతీతి. ఈ కీర్తనలలో కొన్నింటి తాత్పర్యాన్ని ప్రముఖ వ్యాఖ్యాత వెంకట్ గరికపాటి - 'రాజీవ నేత్రాయ.. రాఘవాయ' అనే పేరిట పుస్తక రూపంలోకి తీసుకువచ్చారు. అన్నమయ్య కీర్తనలపై ఆసక్తి ఉన్నవారందరూ తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకమిది.

రాజీవ నేత్రాయ.. రాఘవాయ
రచయిత: వెంకట్ గరికపాటి
ప్రతులకు: 9704179950

గీతాసారం

కళ్ళెం మన చేతుల్లో ఉండాలి...



"ఈ శరీరాన్ని విడిచిపెట్టకముందే... అంటే జీవించి ఉన్నప్పుడే కామం, క్రోధం లాంటి ఉద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. అలా చేసిన సాధకుడే యోగి. అతనే సుఖంగా ఉంటాడు" అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు. అలాంటి స్థితిని సాధించాలంటే సంతోషం, దుఃఖంతో సహా అన్ని భావోద్వేగాల మీద మనకు అదుపు ఉండాలి. కానీ చాలాసార్లు వాటిని వేరే వ్యక్తులు మన భావోద్వేగాలను అదుపు చేస్తూ ఉంటారు. వారి ప్రభావానికి మనం లోనవుతూ ఉంటాం. దీనివల్ల అంతిమంగా మనకు కలిగేది దుఃఖమే. కాబట్టి 'భావోద్వేగాల కళ్ళాలు మన చేతుల్లో ఉన్నాయా? ఇతరుల చేతుల్లో ఉన్నాయా?' అనేది ఆత్మవిశ్లేషణ చేసుకోవాలి. అంతా మన అదుపులోనే ఉందని భావిస్తూ ఉంటాం. కానీ తరచుగా అవి ఇతరుల చేతుల్లో ఉంటాయి. అది స్నేహితుడు కావచ్చు, కుటుంబ సభ్యులు కావచ్చు, సహోద్యోగి కావచ్చు... వారి మనస్థితి, భావాలు, మాటలు, పొగడ్తలు, విమర్శలు మనల్ని సంతోషానికి లేదా బాధకు గురి చేస్తాయి. ఆహారం, పానీయాలు, భౌతిక వస్తువులు, అనుకూల , ప్రతికూల పరిస్థితులు, చివరకు మన గతం, భవిష్యత్తు కూడా ఇలాంటి ప్రభావాలకు కారణం అవుతూ ఉంటాయి.


"అంతరాత్మలోనే సుఖించే, ఆత్మజ్ఞాని అయిన సాంఖ్య యోగి... పరబ్రహ్మమైన పరమాత్మతో ఏకీకృతమై, అత్యున్నతమైన నిర్మాణస్థితిని పొందుతాడు. అలాగే నిశ్చల స్థితిలో మనస్సును పరమాత్మమీద లగ్నం చేసే బ్రహ్మవేత్తలు కూడా నిర్వాణాన్ని పొందుతారు" అని శ్రీకృష్ణుడు వివరించాడు. "కామాన్ని, మోహాన్ని జయించి, క్రోధాన్ని అదుపులో పెట్టుకోవడమే మనకు మనం చేసుకొనే సాయం. ఇది సాధించిన తరువాతే సర్వప్రాణి హితం... అంటే ఇతరుల పట్ల దయగా వ్యవహరించడం, వారికి సహాయం చేయడం సాధ్యమవుతుంది" ఆయన స్పష్టం చేశాడు.



కె.శివప్రసాద్

హరేకృష్ణ

వేదాలు, శాస్త్రాలు గురువును భగవంతుడితో సమానంగా గౌరవిస్తాయి. శిష్యుణ్ణి గురువు అజ్ఞానాంధకారం నుంచి దివ్యమైన జ్ఞానం వైపు నడిపిస్తాడు. భగవద్భక్తికి గురువే ఏకైక మార్గం. అలాంటి గురువును ఎలా ఆశ్రయించాలో వివరిస్తూ "ఒక ఆధ్యాత్మిక గురువును చేరి పరమ సత్యాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించు. వినయంతో ప్రశ్నలు అడుగు. సేవ చెయ్యి. సత్యాన్ని దర్శించినవారైన అలాంటి గురువులు నీకు జ్ఞానోపదేశం చేయగలరు" అని వివరిస్తుంది భగవద్గీత.



ఆధ్యాత్మిక సాధన మార్గం నిస్సందేహంగా క్లిష్టమైనది. అందుకే, భగవంతుడు సాక్షాత్తూ తన పరంపరానుగతమైన సంప్రదాయానికి చెందిన ప్రామాణిక ఆచార్యుణ్ణే ఆశ్రయించాలని సూచిస్తున్నాడు. పరంపర సిద్ధాంతాన్ని అనుసరించనిదే ఎవరూ ప్రామాణికమైన ఆధ్యాత్మిక గురువు కారు. భగవంతుడే ఆది గురువు. ఆయన పరంపర నుంచి వచ్చిన గురువు మాత్రమే భగవంతుడి సందేశాన్ని శిష్యుడికి యథాతథంగా అందించగలడు.

విశ్వానికి ఆధ్యాత్మిక గురువు

గురువును ఎలా ఆశ్రయించాలి?

నిజమైన ఆధ్యాత్మిక గురువును సంపూర్ణ శరణాగతి భావంతో శిష్యుడు ఆశ్రయించాలి. మిథ్యాహంకారాలను విడిచిపెట్టి... శ్రద్ధతో, ఒక దాసునిగా సేవ చెయ్యాలి. వాస్తవానికి, ఆత్మసాక్షాత్కారం పొందిన గురువు సంతృప్తి చెందేలా చేయడమే ఆధ్యాత్మిక జీవన పురోగతి రహస్యం. జిజ్ఞాస, వినయం... ఈ రెండూ కలిసినప్పుడే అసలైన ఆధ్యాత్మిక అవగాహన కలుగుతుంది. సేవాభావం, వినయం లేకుండా అడిగే ప్రశ్నలు వ్యర్థం. గురువు పెట్టే పరీక్షలో నెగ్గాలి. శిష్యునిలో నిజమైన జిజ్ఞాసను గురువు గుర్తించినప్పుడే... ఆ శిష్యుడికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. గుడ్డిగా అనుసరించడం, అర్థంలేని ప్రశ్నలు వేయడం... ఈ రెండూ నిష్ప్రయోజనమే.

మూడు రకాల గురువులు

"ఏ కులస్థులైనా కావచ్చు, బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థాల్లో ఉన్నవారైనా, సన్యాసులైనా... ఇలా ఎవరైనా కావచ్చు. కృష్ణతత్త్వ విజ్ఞానం కలిగినవారైతే చాలు... వారు వర్త్మ-ప్రదర్శక గురువుగా లేదా దీక్షా గురువుగా లేదా శిక్షా గురువుగా ఉండడానికి అర్హులు" అంటూ 'శ్రీ చైతన్య చరితామృతం'లో గురుతత్త్వాన్ని శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతీ ఠాకూర్ వివరించారు. దీని ప్రకారం గురువులు మూడు రకాలు.

వర్త్మ-ప్రదర్శక గురువు: ఆధ్యాత్మిక జీవితం గురించి మొట్టమొదటిసారి పరిచయం చేసే గురువు.

దీక్షా గురువు: శాస్త్ర ప్రమాణానుసారం దీక్షను ప్రసాదించే గురువు.

శిక్షా గురువు: ఆధ్యాత్మికంగా పురోగతి సాధించడానికి మార్గనిర్దేశం చేసే గురువు.

వీరిలో ఏ గురువైనా ఆ స్థానం పొందడానికి అర్హత కేవలం కృష్ణతత్త్వాన్ని పూర్తిగా గ్రహించే సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది. వైదిక శాస్త్రాలలో పేర్కొన్న నాలుగు ప్రామాణిక సంప్రదాయాలకు చెందిన ఆచార్యులనే ఆశ్రయించాలనేది శాస్త్రాలు చెప్పిన మాట. ఈ సంప్రదాయాలన్నీ సాక్షాత్తూ భగవంతుడి నుంచి నేరుగా మొదలైనవే. వాటిలో ఒకటి... బ్రహ్మదేవుడికి శ్రీకృష్ణుడు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించినప్పుడు ప్రారంభమయింది. ఆ సంప్రదాయాన్నే నేడు 'బ్రహ్మ-మధ్వ-గౌడీయ సంప్రదాయం'గా వ్యవహరిస్తున్నారు. ఈ సంప్రదాయానికి చెందినదే హరే కృష్ణ ఉద్యమం. ఈ ఉద్యమానికి ఆచార్యులైన విశ్వగురు శ్రీల ప్రభుపాదులను ఆశ్రయించడం ద్వారా... విశుద్ధమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని యథాతథంగా పొందవచ్చు.

అంతర్జాతీయ ఉద్యమంగా...

బ్రహ్మ-మధ్వ-గౌడీయ సంప్రదాయంలో కృష్ణ చైతన్యాన్ని విశ్వవ్యాప్తంగా ప్రచారం చేసిన మొదటి ఆచార్యులు శ్రీల ప్రభుపాద. శ్రీమద్భగవద్గీత, శ్రీమద్భాగవత గ్రంథాల ఆధారంగా... ఈ భక్తి ఉద్యమాన్ని ఆయన దేశదేశాల్లో విస్తరించేలా చేశారు. డెబ్బై ఏళ్ళ వయసులో, నలభై రూపాయలు చేత పట్టుకొని, విదేశాలకు ప్రయాణించి, పదకొండేళ్ళ వ్యవధిలో ఒక మహత్తర ఉద్యమాన్ని ప్రపంచమంతటా స్థాపించారు. భగవద్గీతపై పరంపరానుగత వ్యాఖ్యానాన్ని అందించారు. 'భగవద్గీత యథాతథం' పేరుతో ఇప్పటివరకూ యాభై కోట్లకు పైగా ప్రతులు ప్రచురితమయ్యాయి. అంతర్జాతీయంగా సనాతన ధర్మాన్ని విస్తరించి, అతి తక్కువ సమయంలో భక్త సమాజాన్ని ప్రపంచవ్యాప్తంగా స్థాపించిన శ్రీల ప్రభుపాదుల నిర్విరామ కృషిని గుర్తించి... మన దేశంలోని 13 ప్రముఖ అఖాడాలు కలిసి... ఇటీవల జరిగిన కుంభమేళాలో ఆయనకు 'విశ్వగురు' అనే బిరుదును ప్రదానం చేశాయి. తాను ఈ ఉద్యమాన్ని ఒక పార్కులో కీర్తనతో ప్రారంభించానని, కేవలం శ్రీకృష్ణుడి పవిత్ర నామ స్మరణ వల్లే ఈ ఉద్యమం వేగంగా వ్యాప్తి చెందిందని, లక్షలాది భక్తులు తనతో చేరారని శ్రీల ప్రభుపాదులవారు తరచూ చెప్పేవారు. వైష్ణవాచార్యులైన ఆయన జాతి, వర్ణ, మత, లింగ, ప్రాంత భేదాలేవీ లేకుండా... ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని స్వీకరించి, శ్రీకృష్ణ, శ్రీ లక్ష్మీ నరసింహ భక్తులుగా మారే అవకాశం కల్పించారు. ఆయన 1977లో మహాసమాధి పొందినప్పటికీ, ఎవరైనా దీక్ష తీసుకొని తన శిష్యుడిగా మారే ఒక విధానాన్ని ఏర్పరిచారు. అటువంటి పరంపరాచార్యులను భగవంతుడితో సమానంగా గౌరవించాలి. వారు తమ ఉపదేశాల్లోని వాణి రూపంలో ఎప్పటికీ సజీవంగా ఉంటారు. నేటికీ ఎవరైనా సరే... వారి శిష్యులుగా మారి, వారి ఉపదేశాలను పాటిస్తూ... కృష్ణ చైతన్యంలో పురోగమించవచ్చు. 'హరేకృష్ణ' మంత్రాన్ని నిర్దిష్ట సంఖ్యలో జపించి, గురువు నిర్దేశించిన నియమాలను నిబద్ధతతో పాటిస్తే... ఏ వ్యక్తి అయినా శ్రీల ప్రభుపాదుల దీక్షా శిష్యుడిగా మారవచ్చు. తమ జీవితాలను శుద్ధి చేసుకొని, ఆధ్యాత్మిక పురోగతి సాధించవచ్చు. తద్వారా భయాలు, కలవరాలు లేకుండా ఆనందంగా జీవించవచ్చు.

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984



సద్బోధ

వర్థమాన మహావీరుడికి ఎందరో శిష్యులు ఉండేవారు. వారిలో గోశాలక్ ఒకడు. అతను పండితుడు. వాక్చాతుర్యం ఉండేది. అయినా ఎక్కువమంది మహావీరునివైపే ఆకర్షితులు కావడం చూసి... అతనికి లోలోపల కొంత అసూయగా ఉండేది. ఒకసారి మహావీరుడు, గోశాలక్ కాలినడకన పొరుగు ఊరికి వెళుతున్నారు. కాలిబాట పక్కన ఒక చోట చిన్న పూల మొక్క ఉండడం గోశాలక్ గమనించాడు. దాన్ని మహావీరుడికి చూపిస్తూ "గురువర్యా! ఈ పూల మొక్కను చూడండి. ఇది పెరిగి పెద్దదవుతుందంటారా? పూలు పూస్తుందంటారా?" అని ప్రశ్నించాడు.

ఎవరో ఒక మనిషి భవిష్యత్తు గురించి అడిగితే... జ్యోతిష్కులు ఆ వ్యక్తి పుట్టిన రోజు, సమయం, ప్రాంతం తెలుసుకుంటారు. తిథి, వార, నక్షత్ర, గ్రహ స్థితులను పరిగణనలోకి తీసుకొని, లెక్కలు వేసి... ఆ మనిషి భవిష్యత్తు ఎలా ఉంటుందో చెబుతారు. కానీ మొక్కల భవిష్యత్తు గురించి ప్రశ్నిస్తే... పేరుమోసిన జ్యోతిష్కులైనా ఏమీ చెప్పలేరు. నవ్వి ఊరుకుంటారు. ఈ ప్రశ్న వేసి, మహావీరుడు ఏ సమాధానం చెబుతాడా? అని గోశాలక్ ఎదురుచూస్తున్నాడు.

జ్ఞాననేత్రం



ఆ ప్రశ్న విన్న మహావీరుడు ఆ మొక్క దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. కళ్ళు మూసుకున్నాడు. అప్పుడు గోశాలక్ "తప్పించుకొనే ప్రయత్నం చేయకండి. నా ప్రశ్నకు కచ్చితమైన జవాబు ఇవ్వండి" అన్నాడు.

మహావీరుడు కళ్ళు తెరిచి, లేచి నిలబడి "ఈ మొక్క పెరిగి పెద్దదవుతుంది. సమృద్ధిగా పూలు పూస్తుంది" అని చెప్పాడు.

గోశాలక్ "అవునా!" అంటూ ఆ మొక్కను కూకటివేళ్ళతో సహా పెకిలించి అవతల పారేశాడు. "ఇది పెరుగుతుందట! పూలు పూస్తుందట!" అని నవ్వాడు. మహావీరుడు చిరునవ్వులు చిందిస్తూ ముందుకు నడిచాడు. గోశాలక్ ఆయనను అనుసరించాడు.

వారిద్దరూ కొంత దూరం వెళ్ళాక... ఆ ప్రాంతంలో పెద్ద వర్షం మొదలైంది. ఏడు రోజులపాటు ఎడతెరిపిలేని వానలు, గాలులతో ఆ ప్రదేశమంతా చిందరవందరయింది. వానలు తగ్గడంతో మహావీరుడు, గోశాలక్ తిరుగు ప్రయాణం ప్రారంభించి, మళ్ళీ ఆ మొక్క ఉన్న చోటికే వచ్చారు. గాలీ, వర్షం కారణంగా ఆ మొక్క అటూ దొర్లి, ఇటు దొర్లి... మళ్ళీ దాన్ని వేర్లు భూమిలో నిలిచేలా లేచి నిలబడింది. దాన్ని ఆశ్చర్యంతో గమనించిన గోశాలక్... మహావీరుడి వైపు చూశాడు.

అప్పుడు మహావీరుడు నవ్వుతూ "ఆ మొక్క పెరిగి పెద్దదై... పూలు పూసే దృశ్యాన్నే కాదు, నువ్వు దాన్ని కూకటి వేర్లతో పెకిలించి పారేసే దృశ్యాన్ని కూడా ఆనాడే చూశాను. ఒక్కసారి కాదు, వందసార్లు నీవు అలా చేసినా... ఆ మొక్క కచ్చితంగా పెరుగుతుంది. పూలు పూస్తుంది. ఇది తథ్యం" అంటూ ముందుకు కదిలాడు. సాధారణ జ్యోతిష్కులు ఏవేవో లెక్కలు వేయాల్సి ఉంటుందేమో! జ్ఞానులు తమ జ్ఞాననేత్రంలో దర్శించి చెప్పేది నిజం కాక తప్పదు.

• రాచమడుగు శ్రీనివాసులు

ఆత్మజ్ఞానమే శ్రేష్ఠమైన విద్య

చింతన



నేను మీకొక సరళమైన విషయం చెప్పాలనుకుంటున్నాను. ఎంతోమంది ఎన్నో రకాలైన కథలు వినిపిస్తారు. ఎక్కడో జరిగిన సంగతుల గురించి చెబుతారు. కానీ మీ గురించి, మీ జీవితం గురించి చెప్పాలని అనుకుంటున్నాను. ఎందుకంటే... మీ జీవితంలో మీరే ప్రముఖమైన వ్యక్తి. చాలామంది భగవంతుడు ముఖ్యమైనవాడని భావిస్తారు. కానీ మీకు భగవంతుడు అవసరమని అనిపించినప్పుడు మాత్రమే ఆయన ముఖ్యుడవుతాడు. ఆయన గురించి మీరు తెలుసుకోకూడదనుకుంటే... మీ ప్రపంచంలో ఆయనకు ఏమాత్రం ప్రాధాన్యత ఉండదు.

తెలుసుకోవాల్సింది అదే...

మిమ్మల్ని మీరు తెలుసుకోవడం చాలా ముఖ్యం. ప్రఖ్యాత గ్రీకు తత్త్వవేత్త సోక్రటీస్ తన బోధలలో 'నిన్ను నీవు తెలుసుకో, అర్థం చేసుకో' అనేవాడు. ఇదే విషయాన్ని కబీర్ దాస్ కూడా చెప్పాడు. 'ఆత్మజ్ఞానం' అంటేనే నిన్ను నువ్వు తెలుసుకోవడం. మనం ప్రతి దాన్నీ తెలుసుకోవాలనుకుంటాం. 'ఇదేమిటి, అదేమిటి, అతనెవరు, ఏం చేస్తూ ఉంటాడు'?... ఇలా ప్రతి దాని గురించి వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాం. కానీ మనిషి తను ఎవరో తెలుసుకోవడం కోసం ఎన్నడూ తనవైపు తిరిగి చూసుకోడు. మానవులమైన మనకు సంబంధించి ప్రధానమైన అంశాలు రెండు ఉన్నాయి. ఒకటి మనం జన్మించడం. జన్మించాం కాబట్టే మనం ఇక్కడ ఉన్నాం. రెండోది... మనం జన్మించాం కాబట్టి ఏదో ఒక రోజు ఈ లోకాన్ని వదిలిపోవడం కూడా తప్పనిసరిగా జరుగుతుంది. కానీ ఈ రెండో మాట చాలామందికి నచ్చదు. అలా జరగకుండా ఉండాలని ఎంతోమంది అనేక రకాల పాట్లు పడుతూ ఉంటారు. పరిగెడతారు, వ్యాయామం చేస్తారు, పద్ధతిగా తింటారు, బరువు పెరగకుండా చూసుకుంటారు. ఎందుకంటే మన మనందరం ఎప్పటికీ బ్రతికే ఉండాలని కోరుకుంటాం. ఏదో ఒక రోజు అంతమైపోతామనేది ఆలోచించాలని కూడా అనుకోం.

ఆ ఆనందం మీ సొంతం

సరే... ఇంతకు మీరెవరు? ఏఏ పదార్థాలతో మీరు తయారయ్యారో తెలుసా? ఆక్సిజన్, హైడ్రోజన్, కార్బన్, కాల్షియం, నైట్రోజన్, ఫాస్ఫరస్... ఈ మూలకాలతో మీరు తయారయ్యారు. మీలో ఉన్నదానిలో డెబ్భై శాతం నీరే. ఈ నీరు నడుస్తుంది, మాట్లాడుతుంది... ఇది అద్భుతం కాదా? కానీ దీన్ని మీరు అద్భుతంగా భావించరు. ఈ భూమండలంలో కూడా డెబ్భై శాతం నీరు. మీరు కూడా డెబ్భై శాతం నీరే! బయట జరుగుతున్న వాటిని చూసి ఆశ్చర్యపోవడం మీ నైజం. కానీ మీలోపల జరుగుతున్న వాటిని చూసి ఆశ్చర్యపోవాలని నేను చెబుతున్నాను. ఏ పదార్థాలతో మీరు తయారయ్యారో... బయట ఉన్నవన్నీ కూడా ఆ పదార్థాలతోనే తయారయ్యాయని గ్రహించండి. మీ లోపలికి వస్తూ పోతున్న శ్వాస మీ సొంతం. అందులో దాగి ఉన్న ఆనందం కూడా మీ సొంతమే. అందువల్ల మిమ్మల్ని మీరు తెలుసుకోకుండా మిగిలినవన్నీ తెలుసుకున్నా, తెలుసుకోకపోయినా ఎటువంటి తేడా ఉండదు. మిమ్మల్ని మీరు తెలుసుకోవాలనే ఆరాటం మీకు కలగనంతవరకు జీవితం అసంపూర్ణంగా మిగిలిపోతుంది. జీవితాన్ని కొనసాగించడానికి మీకు ఈ సమయం లభించింది. అసలైన ఆనందంతో మీ జీవితాన్ని పరిపూర్ణం చేసుకోగలితే... తద్వారా కలిగే ఆనందాన్ని మీరు మాత్రమే ఆస్వాదించగలరు. మీలో ఉన్న, మీ హృదయంలో ఉన్న దైవాన్ని తెలుసుకొని, స్వయంగా అనుభూతి చెందితే... సమస్తం మీరు తెలుసుకున్నట్టేనని వేదాలు, శాస్త్రాలు చెబుతున్నాయి. ఆత్మజ్ఞాన విద్యే అన్ని విద్యల్లో శ్రేష్ఠమైన విద్య. కాబట్టి తనను తాను తెలుసుకున్న వ్యక్తికి మాత్రమే తాను ఇక్కడ ఎందుకు జీవిస్తున్నదీ తెలుస్తుంది.



ప్రేమ్‌రావత్

తెలుసుకుందాం

కారణాలు మూడు

ఏ కార్యానికైనా దోహదకారులుగా మూడు కారణాలను పూర్వ వేదాంత గ్రంథాలు పేర్కొన్నాయి. అవి: నిమిత్తం, ఉపాదానం సహకారి. వీటికి పలు ఉదాహరణలను పూర్వులు చూపారు. వాటిలో కుండను ఉదాహరణగా చూపుతూ చేసిన వివరణ ప్రసిద్ధి చెందింది. మనం వీధిలో వెళ్తూ ఉంటాం. ఒక చోట మట్టి కుప్పగా పోసి ఉంటుంది. కొంత సమయం తరువాత మళ్ళీ అటువైపు వస్తూ గమనిస్తే... ఆ మట్టితో కుండలు, పాత్రలు చేసి ఉంటాయి. అంతకుముందు కేవలం మట్టి మాత్రమే ఉంది. ఇప్పుడు అవి వస్తువులుగా తయారయ్యాయి. అంటే ఒక కార్యం (పని) జరిగింది.. దానికి దోహదం చేసిన కారణాలు మూడుగా పూర్వులు పేర్కొన్నారు.



• వాటిలో మొదటిది... మట్టితో దేన్ని తయారు చేయాలి? దానికోసం ఎటువంటి పనితనాన్ని చూపాలి? ఎలాంటి ఉపకరణాలు ఉపయోగించాలి? అని తెలిసి, వాటి ద్వారా ఆ కుండలను, పాత్రలను తయారు చేసిన వ్యక్తి. అతణ్ణి 'నిమిత్త కారణం' అంటారు.

• ఇక... అతను ఆ వస్తువులను తయారు చేయడానికి మూల పదార్థమైన మట్టి... 'ఉపాదాన కారణం'. దానితో ఆ వస్తువులు రూపొందుతాయి. అది అనేక రూపాల్లోకి మారుతుంది. కానీ ఏ రూపంలో ఉన్నా... మట్టిగా దాని స్వభావంలో మార్పు ఉండదు. స్వతహాగా ఆ వస్తువులుగా అది మారలేదు. నిమిత్త కారణమైన కుమ్మరి దాన్ని వస్తువులుగా తయారు చేస్తాడు.

• అయితే... ఈ రెండు కారణాల వల్లా వస్తువులు తయారుకావు. ఆ మట్టిని కుండగానో, పాత్రగానో ఆకృతి తీర్చడానికి ఒక చక్రం, దాన్ని తిప్పుతూ ఉండడానికి ఒక కర్ర, పాత్రను సరైన రూపంలోకి తేవడానికి కర్ర ముక్క, చాకు, ఇనుపరేకు లాంటివి కూడా అవసరమే. వీటిని 'సహకారి కారణాలు' అంటారు.

దైవమార్గం

యేసు క్రీస్తు రెండువేల ఏళ్ళ క్రితం నరావతారుడైన దేవుడిగా జన్మించాడు. 33 సంవత్సరాలు ఈ భూమిమీద సంచరించాడు. సుమారు మూడున్నర ఏళ్ళపాటు సువార్తను బోధించాడు. తన సువార్త వ్యాప్తికి సహాయకులుగా పన్నెండు మంది శిష్యులను ఏర్పరచుకున్నాడు. వారిలో పేతురు, యోహాను, యాకోబు, తోమా (థామస్) ముఖ్యులు. క్రీస్తు మరణం, పునరుత్థానం తరువాత... ఆయన ప్రత్యక్ష శిష్యుడైన థామస్ భారతదేశంలో అడుగుపెట్టాడు. క్రీస్తు గురించి బోధించాడు, సేవలు అందించాడు. కేరళ (మలబారు) తీరానికి సముద్రమార్గం ద్వారా చేరుకొని, కొడంగలూరు, పలయూరు, కొక్కిమంగళం, కొల్లం, నిరనం, నీలక్కల్, పరవూరుల్లో ఏడు చర్చిలు నిర్మించాడు. తమిళనాడులోని కన్యాకుమారి సమీపంలో ఉన్న తిరువితమ్‌కోడ్ దగ్గర మరో చర్చి నిర్మాణం చేపట్టినా పూర్తి చేయలేకపోయాడు. అందుకే దాన్ని 'అరప్పల్లి' అంటారు. అంటే 'సగం' అని అర్థం.

భారతీయ అపోస్తులుడు

థామస్ క్రాస్...

థామస్ హయాంలో అనేక విద్య, వైద్య సంబంధమైన కార్యక్రమాలు అనాడే భారతదేశంలో ప్రారంభమయ్యాయి. ఇక్కడ క్రైస్తవ్యం బ్రిటిష్ వారి ద్వారా వచ్చిందనేది అవాస్తవం. దానికి ఆద్యుడు థామస్. అందుకే క్రీస్తు ప్రత్యక్ష శిష్యుడైన ఆయనను 'భారతీయ అపోస్తులుడు' అని పిలుస్తారు. అపోస్తులుడు అంటే 'పంపించినవాడు' అని అర్థం. థామస్... క్రీస్తు భారతదేశానికి పంపినవాడు. భారతదేశంలో ఏడున్నర చర్చిలు నిర్మించిన థామస్ ... చెన్నైలోని లిటిల్‌మౌంట్ (శాంథోమ్ చర్చి) దగ్గర ఒక గుహలో ప్రార్థన చేసుకుంటూ ఉంటగా... అతను బతికి ఉంటే క్రైస్తవం ఇంకా ప్రబలుతుందన్న భావనతో కొందరు దుండగులు శూలంతో వెనుకనుంచి పొడిచి ఆయనను చంపేశారు. అతని పేరిట చెన్నైలో 'శాంథోమ్ బసిలికా' ఉంది.



థామస్ భారత దేశంలో తన సేవా కార్యక్రమాల్లో ఉంటూనే... బైబిల్‌లోని కొత్త, పాత నిబంధనల కలయికతో... త్రిత్వాన్ని (దేవుడు, ఆయన కుమారుడైన క్రీస్తు, పరిశుద్ధాత్మ అనే మూడు) ప్రతిబింబించే విధంగా ఒక క్రాస్‌ను తయారు చేశాడు. దాన్ని 'థామస్ క్రాస్' లేదా 'భారతీయ క్రాస్' అంటారు. ప్రపంచంలో ఎన్నో క్రైస్తవ దేశాలు ఉన్నా.. థామస్ తయారు చేసిన క్రాస్‌ను మన దేశం పేరుతో పిలవడం మనకు గర్వకారణం. థామస్ తన సువార్త-సేవా ప్రయాణంలో ఎందరో రోగులను స్వస్థతపరిచాడు. మరణించిన వారిని బ్రతికించాడనీ, థామస్ మృతదేహాన్ని తాకి ఎందరో రోగులు స్వస్థత పొందారనీ, వారికి పట్టిన దుష్టశక్తులు వదిలిపోయాయనీ కథలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పలు క్రైస్తవ మందిరాలకు ఆయన భౌతిక అవశేషాలను పంపారు. అక్కడ వాటిని భద్రపరిచారు. ఇజ్రాయిల్ దేశంలోని గలిలియ ప్రాంతంలో, క్రీస్తుశకం ఒకటో శతాబ్దంలో థామస్ జన్మించాడు. క్రీస్తు పునరుత్థానం తరువాత... క్రీస్తుశకం 52లో భారతదేశానికి వచ్చాడు. క్రీస్తుశకం 72లో చెన్నైలో హత్యకు గురయ్యాడు. మన దేశాన్ని ఎంతో ప్రేమించిన థామస్ గౌరవార్థం భారత ప్రభుత్వం 1964లో ఒక తపాలా స్టాంపును విడుదల చేసింది.

• కె.జె.రమేష్

ఇక అడుగు దూరమే..

లీగ్ దశలో అత్యద్భుత ప్రదర్శనతో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు.. ఆ రెండింటి మధ్య క్వాలిఫయర్ 1 మ్యాచ్ అంటే అభిమానులు ఏ స్థాయిలో ఊహించుకుంటారు? ఈ హోరాహోరీ పోరులో గెలిచి ఫైనల్‌కు వెళ్లే జట్టేదో తెలుసుకునేందుకు అత్యంత ఆసక్తిగానే ఎదురుచూశారు. కానీ ఉత్కంఠ భరితంగా సాగాల్సిన ఆట పూర్తి ఏకపక్షమైంది. బెంగళూరు బౌలర్ల ధాటికి బెంబేలెత్తిన పంజాబ్ కనీసం వంద పరుగులు చేసేందుకే ఆపసోపాలు పడింది. ఇక 102 పరుగుల లక్ష్యాన్ని పది ఓవర్లలోనే ముగించిన ఆర్‌సీబీ తొమ్మిదేళ్ల తర్వాత ఫైనల్‌కు చేరింది.

జ్యోతికి స్వర్ణం



రజిత

- 4 x 400 రిలేలో తెలుగమ్మాయి కుంజా రజితకు పసిడి
- స్టీపుల్ చేజ్‌లో సబ్లే అదుర్స్
- ఆసియా అథ్లెటిక్స్

గుమి (కొరియా): ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ మూడోరోజు తెలుగమ్మాయిలు రెండు స్వర్ణాలు సాధించారు. జ్యోతి యర్రాజి మీట్ రికార్డు టైమింగ్‌తో స్వర్ణం నెగ్గగా..రిలేలో కుంజా రజిత పసిడి అందుకుంది. ఇక స్టీపుల్ చేజ్‌లో 36 ఏళ్ల తర్వాత అవినాష్ సబ్లే బంగారు పతకాన్ని అందించాడు. క్రీడలకు మూడో రోజైన గురువారం మూడు స్వర్ణాలు సహా ఆరు పతకాలు సాధించిన భారత్ మొత్తం 14 మెడల్స్‌తో రెండో స్థానంలో కొనసాగుతోంది. మహిళల 100 మీ. హర్డిల్స్‌లో డిఫెండింగ్ చాంప్ జ్యోతి 12.96 సెకన్ల టైమింగ్‌తో టాప్‌లో నిలిచింది. ఈ క్రమంలో 2000లో సూ యిపింగ్ (చైనా) 12.99 సెకన్ల రికార్డును జ్యోతి అధిగమించింది. అంతేకాకుండా ఈ ఈవెంట్‌లో స్వర్ణాన్ని నిలబెట్టుకొన్న ఐదో అథ్లెట్‌గా కూడా యర్రాజీ రికార్డులకెక్కింది. తనాక (జపాన్) రజతం, ఉ యన్ని (చైనా) కాంస్యం దక్కించుకొన్నారు. మహిళల 4X400 రిలేలో తెలుగమ్మాయి కుంజా రజితతోపాటు జిస్నా మాథ్యూ, రూపల్ చౌధరి, శుభా వెంకటేశన్‌లతో కూడిన భారత బృందం 3 నిమిషాల 34.18 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం నెగ్గగా.. వియత్నాం రజతం, శ్రీలంక కాంస్యం సాధించాయి. పురుషుల 3000 మీ. స్టీపుల్ చేజ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన సబ్లే 8 నిమిషాల 20.92 సెకన్ల టైమింగ్‌తో బంగారు పతకం సాధించాడు. పురుషుల 4X400మీ. రిలేలో జై కుమార్, ధరమ్‌వీర్ చౌధరి, మను, విశాల బృందం 3 నిమిషాల 3.67 సెకన్ల టైమింగ్‌తో రజతం దక్కించుకొంది. మహిళల లాంగ్ జంప్‌లో అన్సీ సోజన్ (6.33 మీ.) రజతం, షైలీ సింగ్ (6.30 మీ.) కాంస్యం సాధించారు.

చంద్రబాబు అభినందన: స్వర్ణ పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారిణులు యర్రాజి జ్యోతి, కుంజా రజితలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, శాప్ చైర్మన్ రవి నాయుడు అభినందించారు.

ఫైనల్లో బెంగళూరు

- 8 వికెట్ల తేడాతో ఘనవిజయం
- 101 రన్స్‌కే పంజాబ్ ఆలౌట్
- చెలరేగిన బౌలర్లు
- సాల్ట్ అజేయ అర్ధసెంచరీ



సుయాష్ (3 వికెట్లు)

1 ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో ఎక్కువ బంతులు (60) మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించిన జట్టుగా ఆర్‌సీబీ

ముల్లన్‌పూర్: 'ఈ సాల కప్ నమ్దే' అంటూ 18 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తమ కల నెరవేర్చుకునేందుకు మరో అడుగు దూరంలోనే నిలిచింది. గురువారం టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్‌తో జరిగిన క్వాలిఫయర్1లో 8 వికెట్ల తేడాతో ఆర్‌సీబీ ఘనవిజయం సాధించింది. దీంతో తొమ్మిదేళ్ల తర్వాత ఫైనల్లో అడుగు పెట్టింది. 2009, 2011, 2016 సీజన్లలోనూ తుది పోరుకు చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. అటు ఓడిన పంజాబ్‌కు జూన్1న జరిగే రెండో క్వాలిఫయర్‌లో ఆడే అవకాశముంది. గుజరాత్-ముంబై మ్యాచ్ విజేతతో ఈ పోరు ఉంటుంది. పటిష్ఠ బ్యాటింగ్ లైనప్ కలిగిన పంజాబ్‌ను ఆర్‌సీబీ బౌలర్లు చెడుగుడు ఆడేయడంతో 14.1 ఓవర్లలో 101 పరుగులకే కుప్పకూలింది. స్టొయినిస్ (26), ప్రభ్‌సిమ్రన్ (18), ఒమర్జాయ్ (18) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. సుయాష్, హాజెల్‌వుడ్‌లకు మూడేసి.. యష్ దయాల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో బెంగళూరు 10 ఓవర్లలో 2 వికెట్లకు 106 పరుగులు చేసి నెగ్గింది. సాల్ట్ (27 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 56 నాటౌట్) అర్ధసెంచరీ సాధించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సుయాష్ శర్మ నిలిచాడు.

10 ఓవర్లలోనే..: ఇదే వేదికలో కోల్‌కతాపై 111 పరుగుల స్కోరును పంజాబ్ కాపాడుకోగలిగింది. ఈసారి కూడా అలాంటి ఫలితాన్ని రిపీట్ చేస్తుందేమో అని ఆ జట్టు ఫ్యాన్స్ ఆశలు పెట్టుకున్నారు. కానీ మైదానంలో అంత సీన్ కనిపించలేదు. కేవలం 102 పరుగుల ఛేదనే అయినప్పటికీ ఓపెనర్ సాల్ట్ మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. విరాట్ (12) వికెట్‌తో పేసర్ జేమిసన్ నాలుగో ఓవర్‌ను మెయిడిన్‌గా వేశాడు. కానీ సాల్ట్ మాత్రం ఆరంభం నుంచే బ్యాట్‌కు పనిజెప్పాడు. అర్ష్‌దీప్ ఓవర్‌లో 4,6తో పాటు జేమిసన్ ఓవర్‌లో 4,4,4,6తో 21 పరుగులు రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలోనే 61/1 స్కోరుతో సగం కంటే ఎక్కువే లక్ష్యాన్ని పూర్తి చేసింది. అటు మయాంక్ (19) ముషీర్ ఓవర్‌లో 6,4 సాధించి అవుటయ్యాడు. 23 బంతుల్లో సాల్ట్ హాఫ్ సెంచరీ పూర్తయ్యాక.. పదో ఓవర్‌లో కెప్టెన్ పటీదార్ (15 నాటౌట్) 4,6తో 14 రన్స్ రాబట్టి మ్యాచ్‌ను ముగించాడు.

తిప్పేసిన సుయాష్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌ను ఆర్‌సీబీ బౌలర్లు బెంబేలెత్తించారు. భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన చందాన బ్యాటర్లంతా వేగంగా ఆడేందుకు ప్రయత్నించి మూల్యం చెల్లించుకున్నారు. నిర్లక్ష్యపు షాట్లతో చేజేతులా వికెట్లను సమర్పించుకున్నారు. అటు పేసర్లు హాజెల్‌వుడ్, భువీ, యష్‌లతో పాటు స్పిన్నర్ సుయాష్ బ్యాటర్లను ఏమాత్రం కుదురుకోనీయలేదు. ఏకంగా ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమై పెవిలియన్‌కు చేరారు. స్టొయినిస్ ఆత్మవిశ్వాసంతోనే కనిపించినా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేకపోయాడు. రెండో ఓవర్‌లో ఓపెనర్ ప్రియాన్ష్ (7)ను యష్ అవుట్ చేశాక వికెట్ల పతనం ఎక్కడా ఆగలేదు. పవర్‌ప్లే ముగిసేలోపే ప్రభ్‌సిమ్రన్, కెప్టెన్ శ్రేయాస్ (2), ఇన్‌గ్లిస్ (4) పెవిలియన్‌లో కూర్చున్నారు. అప్పటికి స్కోరు 38/4 మాత్రమే. ఆ తర్వాతైనా జాగ్రత్తగా ఆడతారనుకుంటే మధ్య ఓవర్లలో సుయాష్ సుడులు తిరిగే బంతులకు బలయ్యారు. తొమ్మిదో ఓవర్‌లో తను శశాంక్ (3), అరంగేట్ర బ్యాటర్ ముషీర్ (0)లను అవుట్ చేశాడు. ఇక రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో ఎదురుదాడికి దిగిన స్టొయినిస్‌ను తన తర్వాతి ఓవర్‌లోనే సుయాష్ దెబ్బతీయడంతో పంజాబ్ కనీసం వంద పరుగులైనా చేస్తుందా? అనిపించింది. అయితే ఒమర్జాయ్ పుణ్యమా అంటూ అతికష్టమ్మీద స్కోరు మూడంకెలకు చేరింది. 15వ ఓవర్ తొలి బంతికే ఒమర్జాయ్‌ను హాజెల్‌వుడ్ అవుట్ చేయడంతో పంజాబ్ ఇన్నింగ్స్ మరో 35 బంతులుండగానే ముగిసింది.

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) క్రునాల్ (బి) యష్ దయాల్ 7; ప్రభ్‌సిమ్రన్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 18; ఇన్‌గ్లిస్ (సి) భువనేశ్వర్ (బి) హాజెల్‌వుడ్ 4; శ్రేయాస్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 2; నేహల్ (బి) యష్ దయాల్ 8; స్టొయినిస్ (బి) సుయాష్ 26; శశాంక్ (బి) సుయాష్ 3; ముషీర్ (ఎల్బీ) సుయాష్ 0; ఒమర్జాయ్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 18; హర్‌ప్రీత్ (బి) షెఫర్డ్ 4; జేమిసన్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 14.1 ఓవర్లలో 101 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-9, 2-27, 3-30, 4-38, 5-50, 6-60, 7-60, 8-78, 9-97, 10-101; **బౌలింగ్:** భువనేశ్వర్ 2-0-17-1; యష్ దయాల్ 4-0-26-2; హాజెల్‌వుడ్ 3.1-0-21-3; సుయాష్ 3-0-17-3; క్రునాల్ 1-0-10-0; షెఫర్డ్ 1-0-5-1.

బెంగళూరు: సాల్ట్ (నాటౌట్) 56; విరాట్ (సి) ఇన్‌గ్లిస్ (బి) జేమిసన్ 12; మయాంక్ (సి) శ్రేయాస్ (బి) ముషీర్ 19; పటీదార్ (నాటౌట్) 15; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 10 ఓవర్లలో 106/2. వికెట్ల పతనం:** 1-30, 2-84. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 2-0-20-0; జేమిసన్ 3-1-27-1; ఒమర్జాయ్ 1-0-10-0; హర్‌ప్రీత్ 2-0-18-0; ముషీర్ 2-0-27-1.

నిష్క్రమించేదెవరో?

నేటి ఎలిమినేటర్‌లో గుజరాత్ x ముంబై | రా.7.30 నుంచి

ముల్లాన్‌పూర్: ఒకదశలో టైటిల్ ఫేవరెట్‌గా కనిపించిన గుజరాత్ టైటాన్స్ లీగ్ దశ చివరకు చేరేసరికి వరుస పరాజయాలతో కొంత డీలా పడింది. మరోవైపు ఆరంభంలో వరుస ఓటములు ఎదురైనా బలంగా పుంజుకొన్న ముంబై ఇండియన్స్ ఆఖరి ప్లేఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకొంది. శుక్రవారం జరిగే ఎలిమినేటర్‌లో గుజరాత్‌తో ముంబై అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు లీగ్ నుంచి నాకౌట్ కానుండగా.. గెలిచిన జట్టు ఆదివారం జరిగే క్వాలిఫయర్-2 ఆడనుంది.

గుకేష్ బోణీ



అర్జున్ ఓటమి

స్టావంగర్ (నార్వే): ప్రపంచ చాంపియన్ గుకేష్ నార్వే చెస్ టోర్నీలో తొలి విజయం అందుకున్నాడు. అయితే అర్జున్ ఇరిగేసికి మాత్రం ఓటమి ఎదురైంది. బుధవారం రాత్రి జరిగిన మూడో రౌండ్‌లో వరల్డ్ నెం.2 హికరు నకమురా (అమెరికా)ను 42 ఎత్తుల్లో చిత్తు చేసిన గుకేష్ 19వ జన్మదినాన్ని మరపురానిదిగా చేసుకున్నాడు. ఇక..కరువాన (అమెరికా)తో మూడో రౌండ్‌లో 44 ఎత్తుల్లో అర్జున్ ఓడిపోయాడు. కోనేరు హంపి (6 పాయింట్లు) మూడో రౌండ్‌లో ఖాదెమ్‌పై నెగ్గింది. దాంతో ముజిచుక్‌తో కలిసి ఆమె సంయుక్తంగా ఆధిక్యంలో కొనసాగుతోంది.

క్వార్టర్స్‌కు సాత్విక్ జోడీ

- సింధు, ప్రణయ్ ఇంటికి

సింగపూర్ ఓపెన్

సింగపూర్: భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి.. సింగపూర్ ఓపెన్ క్వార్టర్స్‌కు చేరుకోగా.. సింధు, ప్రణయ్ రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 19-21, 21-16, 21-19తో ఇండోనేసియాకు చెందిన సబర్-రెజా పహ్లావి ద్వయంపై చెమటోడ్చి నెగ్గింది. డబుల్ ఒలింపిక్ పతక విజేత సింధు 9-21, 21-18, 16-21తో చెన్ యూఫీ (చైనా) చేతిలో, పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ 16-21, 14-21తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యారు. మహిళల డబుల్స్‌లో ఎనిమిదో సీడ్ ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ 8-21, 10-21తో చైనాకు చెందిన జియా యి ఫాన్-జాంగ్ షు గ్జియాన్ చేతిలో, మిక్స్‌డ్‌లో రుత్విక శివాని-రోహన్ కపూర్ జంట 10-21, 16-21తో హాంకాంగ్‌కు చెందిన టాంగ్ చున్ మన్-సి యింగ్ సూట్ చేతిలో చిత్తయ్యారు.

సిన్నర్, జొకో ముందుకు


సిన్నర్

ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: టాప్ సీడ్ జానిక్ సిన్నర్‌తోపాటు మాజీ చాంపియన్ నొవాక్ జొకోవిచ్, అలెగ్జాండర్ జ్వెరెవ్, కొకొ గాఫ్ ఫ్రెంచ్ ఓపెన్ మూడో రౌండ్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో వరల్డ్ నెం:1 సిన్నర్ (ఇటలీ) 6-3, 6-0, 6-4తో రిచర్డ్ గాస్కెట్ (ఫ్రాన్స్)పై వరుస సెట్లలో గెలిచాడు. మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 3-6, 6-1, 6-2, 6-3తో జాస్పర్ డి జాంగ్ (నెదర్లాండ్స్)ను, రుబ్లేవ్ 7-6(1), 6-1, 7-6(5)తో ఆడమ్ వాల్టన్‌ను, ఆరో సీడ్ జొకోవిచ్ 6-3, 6-2, 7-6(1) కొరెంటిన్ మౌటెట్ (ఫ్రాన్స్)ను ఓడించారు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ కొకొ గాఫ్ (అమెరికా) 6-2, 6-4తో టెరెజా వెలెంటోవా (చెక్)పై, జెస్సికా పెగులా 6-3, 7-6(3)తో అన్ లిపై, ఆరో సీడ్ మిర్రా ఆండ్రీవా 6-3, 6-4తో అష్లిన్ క్రూగర్‌పై, మాడిసన్ కీస్ (అమెరికా) 6-1, 6-3తో కేటీ బౌల్టర్ (బ్రిటన్)పై, పౌలా బడోసా 3-6 6-4, 6-4తో ఎలెనా గాబ్రియెలా రూజ్‌పై నెగ్గారు.

భారత్ X ఆసీస్ పోరు

మహిళల 3 వన్డేల సిరీస్ షెడ్యూల్

న్యూఢిల్లీ: మహిళల వన్డే వరల్డ్‌కప్ సన్నాహకంగా భారత్-ఆస్ట్రేలియా మధ్య 3 మ్యాచ్‌ల సిరీస్ జరుగనుంది. సెప్టెంబరు 14, 17, 20వ తేదీల్లో చెన్నైలో ఈ మ్యాచ్‌లను నిర్వహిస్తారు.

ఆసీస్, దక్షిణాఫ్రికా పురుషుల 'ఏ' జట్లు కూడా..: ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత్ 'ఏ' జట్టు ఆ తర్వాత స్వదేశంలో బిజీ కానుంది. సెప్టెంబరు-నవంబరు మధ్యలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా 'ఏ' జట్లతో తలపడనుంది. ముందుగా ఆసీస్ 'ఏ'తో సెప్టెంబరు 16-23 మధ్య రెండు.. నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడుతుంది. అనంతరం అదే నెల 30, అక్టోబరు 3, 5తేదీల్లో వన్డే సిరీస్ ఉంటుంది. ఇక దక్షిణాఫ్రికా 'ఏ' జట్టుతోనూ నవంబరు 2-9 మధ్య రెండు.. నాలుగు రోజుల మ్యాచ్‌లు.. 13, 16, 19 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.

బిజినెస్

రూ.76.25 లక్షల కోట్లు

2024-25లో 8.2 శాతం పెరిగిన ఆర్‌బీఐ ఆస్తి-అప్పుల పట్టిక



ముంబై: ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) బ్యాలెన్స్ షీట్ (ఆస్తి-అప్పుల పట్టిక) వార్షిక ప్రాతిపదికన 8.20 శాతం వృద్ధితో రూ.76.25 లక్షల కోట్లకు పెరిగింది. విదేశీ మారక (ఫారెక్స్) లావాదేవీల ద్వారా లాభాలు 33 శాతం పెరగడం ఇందుకు దోహదపడిందని, దీంతో కేంద్రా నికి ఈసారి రూ.2.69 లక్షల కోట్ల భారీ డివిడెండ్ అందించగలిగినట్లు గురువారం విడుదల చేసిన వార్షిక నివేదికలో ఆర్‌బీఐ పేర్కొంది.

- 2023-24 ఆర్థిక సంవత్సరం చివరినాటికి రూ.70,47,703.21 కోట్లుగా ఉన్న బ్యాలెన్స్ షీట్.. 2024-25 చివరినాటికి రూ.5,77,718.72 కోట్ల (8.20 శాతం) పెరుగుదలతో రూ.76,25,421.93 కోట్లకు చేరుకుంది.
- గత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ ఆదాయం 22.77 శాతం వృద్ధి చెందగా.. వ్యయాలు 7.76 శాతం పెరిగాయి. మిగులు నిధులు వార్షిక ప్రాతిపదికన 27.37 శాతం పెరిగి రూ.2,68,590.07 కోట్లుగా నమోదయ్యాయి. ఈ మిగులు నిధులనే ఆర్‌బీఐ డివిడెండ్ రూపంలో కేంద్రానికి బదిలీ చేస్తుంది.
- గోల్డ్ (52.09 శాతం), దేశీయ పెట్టుబడులు (14.32 శాతం), విదేశీ పెట్టుబడుల (1.70 శాతం) పెరుగుదల ఆర్‌బీఐ బ్యాలెన్స్‌షీట్‌లో ఆస్తుల వృద్ధికి తోడ్పడింది.
- గత ఆర్థిక సంవత్సరంలో ఫారెక్స్ లావాదేవీల ద్వారా లాభాలు వార్షిక ప్రాతిపదికన 33 శాతం పెరిగి రూ.1.11 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

పెద్ద నోట్లలో నకిలీల బెడద

గత ఆర్థిక సంవత్సరం గుర్తించిన మొత్తం నకిలీ నోట్లలో 4.7 శాతం ఆర్‌బీఐ వద్ద పట్టుబడ్డాయి. రూ.10, 20, 50, 100 కరెన్సీల్లో నకిలీ నోట్ల బెడద కాస్త తగ్గగా.. రూ.200 నోట్లలో 13.9 శాతం, రూ.500 నోట్లలో 37.3 శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

చలామణిలో ఉన్న కరెన్సీలో రూ.500 నోట్లదే 86% వాటా

గత ఆర్థిక సంవత్సరం మార్కెట్లో చలామణిలో ఉన్న కరెన్సీ మొత్తం విలువ 6 శాతం, కరెన్సీ నోట్లు 5.6 శాతం పెరిగాయి. నాణేల విలువ 9.6 శాతం, వాటి సంఖ్య 3.6 శాతం పెరిగాయి. చలామణిలో ఉన్న ఈ-రూపీ విలువ 334 శాతం వృద్ధి చెందింది. కాగా, చలామణిలో ఉన్న కరెన్సీలో రూ.500 నోట్ల వాటా విలువ 86 శాతంగా ఉంది. నోట్ల సంఖ్య 40.9 శాతంగా ఉన్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఆ తర్వాత రూ.10 నోట్ల వాటా 16.4 శాతంగా ఉంది. చలామణిలో ఉన్న రూ.10, 20, 50 నోట్ల మొత్తం వాటా 31.7 శాతమని నివేదిక తెలిపింది. రూ.2000 నోట్లను మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు 2023 మే నెలలో ఆర్‌బీఐ ప్రకటించింది. ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఈ మార్చి 31 నాటికి 98.2 శాతానికి సమానమైన రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2,000 నోట్లు తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

రూ.4.32 లక్షల కోట్ల బంగారం

గత ఆర్థిక సంవత్సరంలో తమ వద్దనున్న పసిడి ఆస్తుల మొత్తం విలువ 57.12 శాతం పెరిగి రూ.4,31,624.8 కోట్లకు చేరుకుందని ఆర్‌బీఐ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం మరో 54.13 మెట్రిక్ టన్నుల బంగారాన్ని పోగేయడంతో పాటు మార్కెట్లో ఈ విలువైన లోహం ధర భారీగా పెరగడం ఇందుకు దోహదపడిందని వార్షిక నివేదికలో పేర్కొంది. ఈ మార్చి 31 నాటికి ఆర్‌బీఐ వద్దనున్న బంగారం నిల్వలు 879.58 మెట్రిక్ టన్నులకు పెరిగాయి.

కరెన్సీ ముద్రణ ఖర్చులు 25% పెరిగాయ్..

గత ఆర్థిక సంవత్సరం కరెన్సీ నోట్ల ముద్రణ ఖర్చు వార్షిక ప్రాతిపదికన 25 శాతం పెరిగి రూ.6,372.8 కోట్లకు చేరింది. బ్యాంకింగ్ నోట్ల ముద్రణ పెంచాల్సి రావడం ఇందుకు కారణమైంది. 2023-24లో ఈ వ్యయం రూ.5,101.4 కోట్లుగా నమోదైంది.

రూ.36,014 కోట్ల బ్యాంకింగ్ మోసాలు

గత ఆర్థిక సంవత్సరం దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో రుణ, డిజిటల్ చెల్లింపులకు సంబంధించిన మోసాల విలువ మూడింతలై రూ.36,014 కోట్లకు పెరిగింది. సుప్రీం కోర్టు ఆదేశానుసారంగా 122 కేసుల పునర్‌వర్గీకరణ ఇందుకు ప్రధాన కారణమని ఆర్‌బీఐ పేర్కొంది. 2023-24లో రూ.12,230 కోట్ల బ్యాంకింగ్ మోసాలు నమోదయ్యాయి. కాగా, 2023-24లో 36,060 మోసాలను గుర్తించగా.. 2024-25లో మాత్రం ఈ కేసులు 23,953కు తగ్గాయి.

చలామణిలో రూ.1,000 కోట్ల ఈ-రూపీ

ఈ మార్చి 31 నాటికి చలామణిలో ఉన్న సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) లేదా ఈ-రూపీ మొత్తం విలువ రూ.1,016 కోట్లకు చేరింది. 2023-24 చివరినాటికి నమోదైన రూ.234 కోట్లతో పోలిస్తే ఈ-రూపీ చలామణి 334 శాతం పెరిగింది. ఈ-రూపీ ద్వారా విదేశీ చెల్లింపులు జరిపే సదుపాయాన్ని సైతం అందుబాటులోకి తేవాలనుకుంటున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఎప్పటిలోగా ఇది ప్రారంభమవుతుందన్న విషయంలో మాత్రం స్పష్టతనివ్వలేదు. ఆర్‌బీఐ 2022 నవంబరులో తొలిసారిగా సీబీడీసీని ప్రవేశపెట్టింది. ప్రస్తుతం చలామణిలో ఉన్న ఈ-రూపీలో రూ.857 కోట్లు రూ.500 డినామినేషన్‌వే. రూ.200 డినామినేషన్ ఈ-రూపీ రూ.91 కోట్లు, రూ.100 డినామినేషనలో రూ.38 కోట్లు చలామణిలో ఉన్నాయి.

చిరిగిన నోట్లతో బోర్డుల తయారీ

బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చిన చిరిగిన కరెన్సీ నోట్లను ముక్కలు చేసి వాటిని పార్టికల్ బోర్డుల తయారీలో ఉపయోగించనున్నట్లు, ఇందుకోసం బోర్డు తయారీదారులను ఎంపికచేసే ప్రక్రియను ప్రారంభించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. దేశంలో ఏటా చిరిగిన బ్యాంక్ నోట్లు లేదా కుదించిన కాగితపు దిమ్మెల బరువు దాదాపు 15,000 టన్నుల స్థాయిలో ఉంటుందని, దాన్ని పారవేయకుండా పర్యావరణహిత పునర్‌వినియోగంపై దృష్టిసారించినట్లు ఆర్‌బీఐ రిపోర్టు పేర్కొంది.


ఐఎస్‌బీ హైదరాబాద్‌కు రూ.100 కోట్ల విరాళం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)కి భారీ విరాళం అందనుంది. మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్.. ఐఎస్‌బీకి రూ.100 కోట్ల విరాళం ప్రకటించింది. దీనికి సంబంధించి రెండు సంస్థలు ఒక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. ఐఎస్‌బీ చరిత్రలో ఒక సంస్థ నుంచి ఇంత పెద్దమొత్తంలో విరాళం అందడం ఇదే మొదటిసారి. ఈ విరాళంతో ఐఎస్‌బీ తన హైదరాబాద్ క్యాంపస్‌లో మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ పేరుతో 1,91,532 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్ ప్లస్ రెండంతస్తుల భవనాన్ని నిర్మిస్తుంది.

లాభాల్లోకి మార్కెట్

ముంబై: ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలను అమెరికన్ కోర్టు నిలిపివేయడంతో గురువారం మార్కెట్ తిరిగి పునరుజ్జీవం బాట పట్టింది. రెండు రోజుల నష్టాలకు స్వస్తి పలికి ఈక్విటీ సూచీలు లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ 320.70 పాయింట్లు పెరిగి 81,633.02 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 504.57 పాయింట్ల వృద్ధితో 81,816.89 పాయింట్లను తాకింది. నిఫ్టీ 81.15 పాయింట్ల లాభంతో 24,833.60 వద్ద క్లోజయింది. నెలవారీ కాంట్రాక్టుల ముగింపు దినాన్ని పురస్కరించుకుని సూచీ భారీ ఆటుపోట్లకు గురయింది. ఆటుపోట్ల ట్రేడింగ్‌లో మెటల్, రియల్టీ, ఫార్మా, ఐటీ సూచీలు లాభపడ్డాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	117
కరీంనగర్	115	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	100
కర్నూలు	115	నెల్లూరు	105
విశాఖపట్నం	111	అనంతపురం	105
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,040 ▼	88,950 ▼	1,11,000 ▲
విజయవాడ	98,000 ▼	92,000 ▼	1,00,000 ▲
విశాఖపట్నం	98,510 ▼	88,950 ▼	1,10,900 ▼
రాజమండ్రి	97,040 ▼	88,950 ▼	1,00,600 ▼
ప్రొద్దుటూరు	95,100 ▼	87,490 ▼	98,700 ▼
ముంబై	95,525 ▼	87,501 ▼	98,100 ▲

తగ్గిన అమర రాజా ఎనర్జీ లాభం

ఒక్కో షేరుకు రూ.5.20 డివిడెండ్ సిఫారసు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ.. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.161.57 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.229.78 కోట్లు)తో పోల్చితే లాభం 29.7 శాతం క్షీణించింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కార్యకలాపాల ఆదాయం మాత్రం రూ.2,907.86 కోట్ల నుంచి రూ.3,060.07 కోట్లకు పెరిగింది. నిర్వహణా వ్యయాలు గణనీయంగా పెరగటం మార్చి త్రైమాసికంలో కంపెనీ పనితీరును దెబ్బతీసింది. కాగా మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.12,961.91 కోట్ల రెవెన్యూపై రూ.944.67 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.5.20 (520 శాతం) తుది డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

2025-26లో సీఎస్ఆర్ కోసం రూ.150 కోట్లు

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్



హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కోసం రూ.150 కోట్లు కేటాయించినట్లు ప్రకటించింది. సీఎస్ఆర్ కింద దేశవ్యాప్తంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించింది. ఆరోగ్య సంరక్షణ, విద్య, ఆకలి తీర్చటం, పేదరిక నిర్మూలన, మహిళా సాధికారిత, పర్యావరణ పరిరక్షణ, నిరుపేదలకు గృహ నిర్మాణం వంటివి ఇందులో ఉన్నాయి. ఈ నెల 28 న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో వరల్డ్ హంగర్ డే సందర్భంగా నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ మలబార్ గ్రూప్ తదుపరి దశ సీఎస్ఆర్ కార్యక్రమాలను ప్రారంభించారు. మలబార్ గ్రూప్ ప్రధాన సేవా కార్యక్రమం అయిన ది హంగర్ ఫ్రీ వరల్డ్ కింద భారత్ సహా జాంబియా దేశాల్లోని నిరుపేదలకు ప్రతిరోజు 70,000 భోజనాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. 2025-26లో మొత్తం 2.5 కోట్ల భోజనాలు అందించనున్నట్లు మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో రోజుకు 2,100 మందికి భోజనాలు అందించే ఈ కార్యక్రమాన్ని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ ఆర్టిస్ట్రీ స్టోర్ వద్ద సోమాజీగూడ కార్పొరేటర్ సంగీత శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. నిరాశ్రయులైన మహిళల కోసం గ్రాండ్‌మా హోమ్స్ పేరుతో మలబార్ గ్రూప్ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. హైదరాబాద్, బెంగళూరు, కేరళల్లో ఈ హోమ్స్ ద్వారా ఉచిత వసతి, సంరక్షణ సేవలందిస్తోంది. త్వరలో దీన్ని చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, ముంబై నగరాలకు విస్తరించేందుకు మలబార్ గ్రూప్ ప్రణాళికలు రచిస్తోంది.

పోకర్ణ లాభంలో 280% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో పోకర్ణ లిమిటెడ్ కన్సాలిడేటెడ్ ప్రాతిదికన రూ.262.67 కోట్ల ఆదాయంపై రూ.58.90 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.15.51 కోట్లు)తో లాభం ఏకంగా 279.77 శాతం వృద్ధి చెందగా ఆదాయం 62.50 శాతం పెరిగింది. మార్చితో ముగిసిన మొత్తం ఆర్థిక సంవత్సరానికి గాను రూ.930.13 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.187.54 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అనుబంధ సంస్థ పోకర్ణ ఇంజనీర్డ్ స్టోన్ సామర్థ్యాలను విస్తరించామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం నుంచి ఈ విభాగం నుంచి మంచి ఆదాయాలు వస్తాయని అంచనా వేస్తున్నట్లు పోకర్ణ లిమిటెడ్ సీఎండీ గౌతమ్ చంద్ జైన్ తెలిపారు. అలాగే హైదరాబాద్, మేకగూడ ప్లాంట్‌లో మెషినరీ ఏర్పాటు డిసెంబరు నాటికి పూర్తి కావచ్చని కంపెనీ పేర్కొంది. 2026-27 ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో ఇది కార్యకలాపాలు ప్రారంభించనుందని తెలిపింది.

పవర్ తుపానుకు సిద్ధంగా ఉండండి!



తను నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రానికి పవన్‌కళ్యాణ్ డబ్బింగ్ చెప్పడంతో ఆ సినిమా విడుదలకు సిద్ధమైంది. ఏపీ ఉపముఖ్యమంత్రిగా బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ తీరిక చేసుకుని రాత్రి పది గంటలకు డబ్బింగ్ మొదలుపెట్టి ఏకధాటిగా నాలుగు గంటల్లో పూర్తి చేశారు పవన్‌కళ్యాణ్. ఈ విషయం వెల్లడిస్తూ 'పవర్ తుపానుకు సిద్ధంగా ఉండండి. జూన్ 12న మీ ఉత్తేజం ఉరకలేస్తుంది' అని చిత్ర బృందం పేర్కొంది. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకున్న 'హరిహర వీరమల్లు' చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయిక. ఏ.ఎం.రత్నం సమర్పణలో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి క్రిష్, జ్యోతికృష్ణ దర్శకులు.

ఉత్తమ నటుడు అల్లు అర్జున్

(మొదటి పేజీ తరువాయి)

అందించనున్న 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డు'లను జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ ప్రకటించారు. సమాచార భవన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుతో కలసి ఆమె అవార్డుల వివరాలు వెల్లడించారు. ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్(పుష్ప-2).. ఉత్తమ చిత్రంగా 'కల్కి 2898 ఏడీ', ఉత్తమ ద్వితీయ చిత్రంగా 'పొట్టేల్', ఉత్తమ తృతీయ చిత్రంగా 'లక్కీ భాస్కర్' ఎంపికైనట్టు తెలిపారు. జ్యూరీ కమిటీ నిష్పక్షపాతంగా అవార్డులకు అర్హులను ఎంపిక చేసిందని దిల్ రాజు తెలిపారు. జూన్ 14న ఈ అవార్డులను బహూకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా.. అవార్డుల కోసం మొత్తం 1248 నామినేషన్లు వచ్చాయని జయసుధ తెలిపారు. అవార్డుల ఎంపికలో ప్రభుత్వం తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని.. చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేకుండా అన్నింటినీ జ్యూరీ కమిటీ పరిశీలించిందని వివరించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా, కమిటీ ఏకాభిప్రాయంతో అవార్డులకు అర్హులను ఎంపిక చేసిందని.. కొత్త దర్శకులు, నటులతో తీసిన చాలా సినిమాలు పరిశీలనకు రావడం సంతోషాన్ని కలిగించిందని ఆమె చెప్పారు. కాగా, ఉత్తమ కథా రచయిత అవార్డుకు ఎంపికైన పాలడుగు శివ కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం ముదునూరుకు చెందిన వ్యక్తి. వీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ కుమారుడు అయిన శివ విదేశాల్లో చదువుకుని, వ్యాపారం చేసి, తెలుగు సినిమాపై అభిమానంతో తిరిగొచ్చాడు. తొలిచిత్రానికి అవార్డు సాధించడం పట్ల నిర్మాత వల్లభనేని వెంకటేశ్వరరావుతో పాటు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



ఇవీ అవార్డుల వివరాలు..

ఉత్తమ చిత్రం: కల్కి 2898 ఏడీ
రెండో ఉత్తమ చిత్రం: పొట్టేల్
మూడో ఉత్తమ చిత్రం: లక్కీ భాస్కర్
చైతన్యం కలిగించే కేటగిరీలో
ఉత్తమ చిత్రం: కమిటీ కుర్రాళ్లు
ఉత్తమ బాలల చిత్రం: '35' చిన్న కథ కాదు
చరిత్ర, వారసత్వం కేటగిరీలో ఉత్తమ చిత్రం: రజాకార్
ఉత్తమ పరిచయ దర్శకుడు: యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: ఆయ్
ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి 2898 ఏడీ)
ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప-2)
ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
ఉత్తమ సహాయ నటుడు: ఎస్.జె.సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ సహాయ నటి: శరణ్య ప్రదీప్
(అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ సిసిరోలియో (రజాకార్)
ఉత్తమ నేపథ్య గాయకుడు: సిద్ శ్రీరామ్ (ఊరుపేరు భైరవకోన)
ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయ ఘోషల్ (పుష్ప 2)
ఉత్తమ హాస్యనటులు: సత్య, వెన్నెల కిశోర్ (మత్తు వదలరా 2)
ఉత్తమ బాలనటులు: అరుణ్‌దేవ్ (35 చిన్నకథ కాదు), హారిక (మెర్సీ కిల్లింగ్)
ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి)
ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత: వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ గీత రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి)
ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్)
ఉత్తమ ఆడియోగ్రాఫర్: అరవింద్ మీనన్ (గామి)
ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేశ్ ఆచార్య (దేవర)
ఉత్తమ కళా దర్శకుడు: అద్వితిన్ జిహాని చౌదరి (కల్కి)
ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్:
కె.చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: నల్ల శ్రీను (రజాకార్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: అర్చన రావు,
అజయ్ కుమార్ (కల్కి 2898 ఏడీ)

స్పెషల్ జ్యూరీ అవార్డులు

దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్), అనన్య నాగళ్ల (పొట్టేల్)
సుజిత్,సందీప్ (క), ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి (రాజుయాదవ్)
స్పెషల్ జూర్యీ మెన్షన్: ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా-2)
తెలుగు సినిమాపై ఉత్తమ పుస్తకం
'మన సినిమా ఫస్ట్ రీల్': రెంటాల జయదేవ

గద్దర్ తెలంగాణ సినీ పురస్కారాలు 2024

ఉత్తమ చిత్రాలు.. కథ కమామిషు

ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ చిత్రాల అవార్డుల్లో 'కల్కి 2898', 'పొట్టేల్', 'లక్కీ భాస్కర్' సినిమాలు వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. ఈ మూడూ భిన్నమైన జానర్‌కు చెందినవి. ఒక దానితో మరోదానికి అసలు పోలిక ఉండదు. ఒక సినిమా ప్రేక్షకుల్ని కల్పిత ప్రపంచంలోకి తీసుకెళ్తే, మరొకటి 1970-80 మధ్య కాలంలో తెలంగాణ గ్రామీణ జీవన చిత్రాన్ని ఆవిష్కరింపజేస్తుంది. చివరిది మధ్య తరగతి మనస్తత్వాలను ఎండగడుతుంది.

హాలీవుడ్ స్థాయిలో విజువల్స్



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. మన పురాణాల ప్రకారం మహా విష్ణువు పదో అవతారమే కల్కి. కలియుగం చివరి పాదంలో దేవుడు కల్కి రూపంలో వచ్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసి అవతారం చాలిస్తాడని చెబుతున్నాయి. ఈ పాయింట్‌నే దర్శకుడు నాగ్ అశ్విన్ ప్రధాన ఇతివృత్తంగా ఎంచుకొని అద్భుతమైన కథ సృష్టించారు. దానికి సాంకేతికత జోడించి 'కల్కి 2898 ఏడీ'ని రూపొందించారు. ఈ చిత్రంలో కాశీ, కాంప్లెక్స్, శంబాలా అనే మూడు ప్రపంచాలు ఉంటాయి. ఈ మూడింటి మధ్య జరిగే కథే ఈ సినిమా. ఇందులో విజువల్స్‌ని హాలీవుడ్ చిత్రాలకు ఏ మాత్రం తగ్గకుండా తెరకెక్కించారు. హాలీవుడ్ సినిమాల స్ఫూర్తితో కూడిన పాత్రలు, కల్పిత ప్రపంచాలు ఈ సినిమాలో మనకు కనిపిస్తాయి.

చదువు గొప్పదనాన్ని చాటింది



తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో ఒకప్పుడు రాజ్యమేలిన పటేల్ వ్యవస్థలో ప్రజల జీవన విధానాన్ని 'పొట్టేల్' చిత్రంలో చక్కగా తెరకెక్కించారు దర్శకుడు సాహిత్. 1970-80 మధ్య కాలంలో సాగే కథ ఇది. గ్రామ పటేల్‌ని ఎదిరించి తన కూతుర్ని చదివించుకోవాలనుకునే ఓ తండ్రి తపన, తాపత్రయాన్ని తెరపై చక్కగా ఆవిష్కరించారు. పటేళ్ల పెత్తనం, మూఢ నమ్మకాలు, సమాజంలో ఉన్న అసమానతలను కళ్లకు కట్టినట్లు చూపిస్తూనే దర్శకుడు చదువు గొప్పదనాన్ని చాటి చెప్పాడు.

ఆర్థిక మోసాల నేపథ్యం



1990 నాటి ఆర్థిక మోసాల నేపథ్యంలో వచ్చిన చిత్రం 'లక్కీ భాస్కర్'. తెలుగు తెరపై ఈ తరహా కథ ఇప్పటి వరకు రాలేదనే చెప్పాలి. బాగా చదువుకున్న వారికి కూడా అర్థం కాని బ్యాంకింగ్ మోసాలను సాధారణ మధ్యతరగతి ప్రజలకు సైతం అర్థమయ్యేలా దర్శకుడు వెంకీ అట్లూరి తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. బ్యాంకింగ్ వ్యవస్థ, స్టాక్ మార్కెట్, మధ్య తరగతి మనస్తత్వాలు.. ఈ మూడింటినీ మేళవిస్తూ చిత్ర కథ సాగుతుంది. కథ, పాత్రలు, తెరపై సన్నివేశాలు అన్నీ ప్రేక్షకులకు సులభంగా కనెక్ట్ అయ్యేలా ఉంటాయి. ముఖ్యంగా ఈ చిత్రానికి సంభాషణలు బాగా ప్లస్ అయ్యాయి. 'ఒక రోజులో అరగంట నాకు నచ్చినట్టుగా సాగలేదని, రోజంతా ఏడుస్తూ కూర్చోవాలా', 'గెలుపు తర్వాత ఓటమి, ఓటమి తర్వాత గెలుపు' వంటి సంభాషణలు ప్రేక్షకుల్ని ఆలోచింపజేస్తాయి.

నిజానికి ఇది చిన్న కథ కాదు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల్లో మూడింటిని సొంతం చేసుకొని మరొక్కసారి అందరి దృష్టిని ఆకర్షించింది '35 చిన్న కథ కాదు' అనే సినిమా. దీన్ని నంద కిశోర్ ఇమాని తెరకెక్కించారు. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికవడంతో పాటు ఇందులో నటించిన నివేదా థామస్ ఉత్తమ నటిగా, మాస్టర్ అరుందేవ్ పోతుల, బేబీ హారిక ఉత్తమ బాల నటులుగా అవార్డులు కైవసం చేసుకున్నారు. పాటలు, యాక్షన్, రొమాన్స్ వంటి కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటేనే సినిమా కాదని, మంచి కంటెంట్ ఉన్న చిన్న సినిమా సైతం సూపర్ హిట్ అవుతుందని ఈ చిత్రం నిరూపించింది. నిజానికి ఇది చిన్న కథ కాదు. చాలా పెద్ద కథ. ఇందులో పిల్లలతోపాటు తల్లిదండ్రులు, సమాజం నేర్చుకోవాల్సిన ఎన్నో విషయాలను చర్చించారు. ప్రస్తుత విద్యా విధానం ఎలా ఉంది? ఎలా సాగితే పిల్లలకు ఉపయోగం అని తెలియజేసే సినిమా ఇది. ఈ చిత్రానికి ఉత్తమ కేటగిరీలో మూడు అవార్డులు రావడం చిన్న సినిమాకు లభించిన పెద్ద గౌరవం అనే చెప్పాలి.

ప్రభుత్వ గుర్తింపు ఎంతో విలువైనది



గద్దర్ సినీ పురస్కారాలకు ఎంపికైన వారందరికీ హృదయపూర్వక అభినందనలు. రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ఎంతో విలువైనది. సృజనాత్మక రంగంలో ఉన్న నటీనటులు, సాంకేతిక నిపుణులకు ఎంతగానో ప్రేరణనిస్తుంది. ఒక గొప్ప అద్భుత సంప్రదాయాన్ని తెలంగాణ ప్రభుత్వం పునరుద్ధరించడం, ఇండస్ట్రీకి గొప్ప ప్రోత్సాహాన్ని ఇస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు, అవార్డుల కమిటీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

- చిరంజీవి

అభిమానులకు అంకితం



తొలిసారి ప్రకటించిన 'గద్దర్ తెలంగాణ సినీ పురస్కారాలు 2024'లో ఉత్తమ నటుడి పురస్కారం నాకు దక్కినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఇది నాకు దక్కిన నిజమైన గౌరవం. అందుకు తెలంగాణ ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 'పుష్ప 2' చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా నన్ను ఎంపికచేసినందుకు సంతోషంగా ఉంది. దర్శకుడు సుకుమార్, నిర్మాతలతో పాటు 'పుష్ప 2' చిత్రబృందానికి ఈ ఘనత దక్కుతుంది. అలాగే నా అభిమానుల ప్రోత్సాహమే ప్రతిసారి నాలో స్ఫూర్తిని నింపుతోంది. అందుకే ఈ పురస్కారాన్ని వారికి అంకితమిస్తున్నా.

- అల్లు అర్జున్

విజేతలకు అభినందనలు



చిత్ర పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది నుంచి తెలంగాణ ప్రభుత్వం సినీ పురస్కారాలను ఇవ్వడం మంచి పరిణామం. 'గద్దర్ తెలంగాణ సినీ పురస్కారాలు-2024' విజేతలందరికీ అభినందనలు. 'దేవర' చిత్రానికి నృత్యరీతులు సమకూర్చిన గణేశ్ ఆచార్య ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా ఎంపికైనందుకు ఆనందంగా ఉంది.

-ఎన్టీఆర్

గద్దర్ సినీ పురస్కారాల్లో మా 'లక్కీ భాస్కర్' చిత్రం ఏకంగా నాలుగు విభాగాల్లో అవార్డులను దక్కించుకున్నందుకు ఆనందంగా ఉంది. ఇది చిత్రబృందానికి గర్వకారణం. ఈ సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు, తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- సూర్యదేవర నాగవంశీ

మా 'కమిటీ కుర్రాళ్లు' చిత్రబృందానికి ఇది గొప్ప విజయం. ఉత్తమ జాతీయ సమైక్యతా చిత్రం, ఉత్తమ నూతన దర్శకుడు పురస్కారాలు దక్కడం ఆనందాన్నిచ్చింది. ఇది మా గుర్తింపును, గౌరవాన్ని మరింత పెంచింది.

- నిహారిక కొణిదెల

'కల్కి 2898 ఏడీ' చిత్రబృందానికి ఇవి గర్వకారణమైన క్షణాలు. గద్దర్ సినీ పురస్కారాలు 2024లో ఉత్తమ చిత్రంగా నిలిచినందుకు ఎంతో ఆనందంగా ఉంది. వైజయంతీ మూవీస్ సుదీర్ఘ సినీ ప్రయాణానికి దక్కిన మరో గొప్ప గౌరవం ఇది. తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. - వైజయంతి మూవీస్

మా బేనర్‌లో తెరకెక్కిన 'ఆయ్' సినిమాకు ఉత్తమ ప్రజాదరణ చిత్రంగా, 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్' చిత్రానికి గాను ఉత్తమ సహాయనటిగా శరణ్య ప్రదీప్‌కు పురస్కారాలు దక్కినందుకు ఆనందంగా ఉంది. ఈ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేం.

- గీతా ఆర్ట్స్ 2

గద్దర్ సినీ పురస్కారాలు - 2024లో 'క' చిత్రానికి గాను స్పెషల్ జ్యూరీ పురస్కారానికి ఎంపికవడం మాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాం.

- దర్శకులు సందీప్, సుజిత్

సినీ గ్రంథానికి దక్కిన గౌరవం



సీనియర్ జర్నలిస్టు, ఉత్తమ సినీ విమర్శకుడిగా నంది అవార్డు గ్రహీత అయిన డాక్టర్ రెంటాల జయదేవను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'గద్దర్ ఫిల్మ్ అవార్డు' వరించింది. మరుగున పడిపోయిన భారతీయ సినీ చరిత్రలోని అనేక అంశాలను తవ్వితీసి, ఆయన రచించిన 'మన సినిమా.. ఫస్ట్ రీల్' పుస్తకం 2024వ సంవత్సరానికి గాను 'ఉత్తమ సినీ గ్రంథం'గా ఎంపికైంది. దక్షిణ భారతీయ భాషా చిత్రాల తొలి అడుగుల చరిత్రపై జయదేవ పాతికేళ్ల పరిశోధనా పరిశ్రమకు ప్రతిఫలం ఈ పుస్తకం. హిందీతో సహా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సినిమాల్లో వచ్చిన తొట్టతొలి టాకీలకు సంబంధించిన అనేక చారిత్రక సత్యాలను ఈ పుస్తకంలో జయదేవ అందించారు.

తమిళ నటుడు రాజేశ్ మృతి



సీనియర్ తమిళ నటుడు రాజేశ్ (75) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ని గురువారం ఉదయం చెన్నై నందంబాక్కంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళుతుండగా, మార్గమధ్యంలో తుదిశ్వాస విడిచారు. ఆయన భార్య గతంలోనే మృతి చెందారు. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాలుగు దశాబ్దాలుగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్న రాజేశ్ తమిళనాడు ప్రభుత్వ డాక్టర్ ఎంజీఆర్ ఫిల్మ్ అండ్ టీవీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కె.బాలచందర్ దర్శకత్వంలో తొలిసారి సినీ అవకాశాన్ని పొంది, తమిళం, తెలుగు, మలయాళ భాషల్లో 150కి పైగా చిత్రాల్లో నటించారు. - ఆంధ్రజ్యోతి, (చెన్నై)

క్షమాపణ చెప్పు.. లేదంటే మీ సినిమా ఆడదు..!

తమిళ భాష నుంచే కన్నడ పుట్టిందని నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రమంతటా రగులుతూనే ఉన్నాయి. కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజు ఆధ్వర్యంలో మైసూరు బ్యాంక్ సర్కిల్‌లో గురువారం నిరసన తెలిపారు. కన్నడ చరిత్ర గురించి కమల్ హాసన్‌కు ఏం తెలుసని వాటాళ్ నాగరాజు ప్రశ్నించారు. ఆయన వెంటనే కన్నడిగులకు క్షమాపణ చెప్పాలని, లేదంటే తమ సత్తా ఎమిటో చూపిస్తామని హెచ్చరించారు. కర్ణాటక రక్షణ వేదిక ముఖ్యుడు ధర్మరాజగౌడ నేతృత్వంలో ఫిల్మ్ చాంబర్ అసోసియేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఆ తర్వాత నేరుగా చాంబర్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. ఆంధ్రజ్యోతి, (బెంగళూరు)

మన సీఎం... విజనరీ లీడర్: విప్ మాధవి



కడప, మే 29(ఆంధ్రజ్యోతి): మన సీఎం చంద్రబాబు విజన్ ఉన్న లీడర్ అని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి పేర్కొన్నారు. గురువారం మహానాడు బహిరంగ సభ వేదికపై ఆమె ప్రసంగించారు. '43 ఏళ్ల చరిత్రలో మొట్టమొదటి సారి కడపలో మహానాడు నిర్వహించుకునే భాగ్యం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు. చివరి రోజు బహిరంగ సభకు ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారంటే మన కార్యకర్తల బలం ఇట్టే అర్థమవుతుంది. కడప మహానాడు విజయవంతమవడానికి కష్టపడిన అందరికీ కృతజ్ఞతలు. మహిళా సాధికారతకు టీడీపీ ఎప్పుడూ కృషిచేస్తూనే ఉంటుంది. రాయలసీమ కోసం ఆనాడు ఎన్టీఆర్ తెలుగు గంగను తీసుకొచ్చారు. నేడు చంద్రబాబు ఎస్ఆర్‌బీసీ, కేసీ కెనాల్ ఆధునీకరణ చేపట్టి తాగు, సాగునీరు అందిస్తున్నారు. ఎన్టీఆర్ ఆశయాలను నెరవేర్చే నాయకుడిగా చంద్రబాబు ఉన్నారు. కడప అభివృద్ధి పనులకు రూ.90 కోట్లు నిధులు విడుదల చేశారు.' అని ఆమె చెప్పారు.



పసుపు పండుగ



క్రమశిక్షణ గల పార్టీ టీడీపీ

'నాలుగు దశాబ్దాలుగా క్రమశిక్షణ గల పార్టీ టీడీపీ. గత ప్రభుత్వంలో గొంతుమీద కత్తిపెట్టినా జై తెలుగుదేశం అన్న చంద్రయ్య లాంటి కార్యకర్తలు గల పార్టీ. ఆగిన ఆ ఒక్క గొంతు కోట్ల జనాల గొంతై జగన్‌కు అసెంబ్లీలో సౌండ్ లేకుండా చేసింది. యువగళం అంటూ లోకేశ్ చేసిన పాదయాత్ర ఒక చరిత్ర. సీఎం చంద్రబాబు కడప ఇండస్ట్రియల్ పార్క్ కొప్పర్తికి రూ.2,300 కోట్లు ఇచ్చారు.'

- పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఎమ్మెల్యే, కమలాపురం

మహానాడును దిగ్విజయంగా చేశారంటూ కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు



బహిరంగ సభకు హాజరైన జనసందోహానికి లోకేశ్ అభివాదం

సంక్షేమాన్ని పరిచయం చేసింది ఎన్టీఆరే



ఎన్టీఆర్ అంటే మూడక్షరాలు కాదు.. ఓ ప్రభంజనం. పార్టీ పెట్టిన 9 నెలల్లో అధికారంలోకి రావడం ఓ చరిత్ర. దేశానికి సంక్షేమం అనే పదాన్ని పరిచయం చేసిన వ్యక్తి ఎన్టీఆర్. సినిమా స్క్రీన్ అయినా, పొలిటికల్ స్క్రీన్ అయినా ఆయనే లెజెండ్. ఆయనే రాముడు, కృష్ణుడు, భీముడు, అర్జునుడు, కర్ణుడు.. ఆయనే ప్రజల గుండెల్లో దేవుడు. తెలుగువారిని ప్రపంచ పటంలో పెట్టింది మన బ్రాండ్ సీబీఎన్. అప్పుడు ఐటీ.. ఇప్పుడు ఏఐ.. అప్పుడు హైటెక్ సిటీ, ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ.. అప్పుడు సైబరాబాద్, ఇప్పుడు అమరావతి.. అప్పుడు రూ.200 పెన్షన్, ఇప్పుడు రూ.4వేలు చేసింది మన సీబీఎన్. సీబీఎన్ అంటే డెవలెప్‌మెంట్.. సీబీఎన్ అంటే సంక్షేమం.. సీబీఎన్ అంటే మానవత్వం.

- లోకేశ్

రెడ్ బుక్‌తో వాళ్లకు వణుకు!

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం



'ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం. సూపర్ సిక్స్ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారంటూ జగన్ అండ్ కో తప్పుడు ప్రచారం చేస్తోంది. చెప్పిన సూపర్ సిక్స్‌నే కాదు చెప్పని అనేక పథకాలనూ అమలు చేస్తున్నాం. జగన్‌కు తన పరిస్థితి అర్థమవుతోంది. వైసీపీ పని అయిపోయిందన్న భావనతో ఆయన ఏదేదో మాట్లాడుతున్నారు. రాయలసీమలో ఒకప్పుడు ఫ్యాక్షనిజంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎంతో అభివృద్ధి చెందుతోంది.'

- సవిత, కడప జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి

విజన్ ఉన్న నేత చంద్రబాబు



'భవిష్యత్తు గురించి ఆలోచించే విజన్ ఉన్న నేత చంద్రబాబు. కడప ఎవరబ్బ సొత్తు కాదు. టీడీపీ నాయకత్వాన్ని, కార్యకర్తలను అనేక ఇబ్బందులకు జగన్ ప్రభుత్వం గురిచేసే సమయంలో ఆ సైకో పాలనను ఎదిరించేందుకు లోకేశ్ ముందుకు వచ్చారు. కార్యకర్తలకు భరోసా ఇస్తూ వారి అండతో ముందుకు కదిలారు. దీంతో తమ పార్టీ పని అయిపోతుందన్న ఆవేదనతో వైసీపీ ప్రభుత్వ పెద్దలు ఏకంగా చంద్రబాబును జైల్లో పెట్టారు. రాయలసీమలో కియా, శ్రీసిటీ, హీరో కంపెనీ లాంటి పరిశ్రమలతో అనేక మందికి జీవనాధారం అందుబాటులోకి వచ్చింది.'

- అనిత, మంత్రి

వైఎస్ కుటుంబాన్ని నమ్ముకుని నష్టపోయాం



'ఎన్నో తరాలుగా వైఎస్ కుటుంబంతో కలసి ఉన్నా. అయినా ఎటువంటి అభివృద్ధి సాధించింది లేదు. ఆ తరువాత టీడీపీలో చేరడం వల్ల అభివృద్ధిని సాధించుకున్నాం. జిల్లాలో గత ఎన్నికల్లో ఏడు స్థానాలు గెలుచుకున్నాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సంతోషంగా ఉన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలను ఆ పాలకులు హింసించారు. జిల్లాలోని పెండింగు ప్రాజెక్టులకు చంద్రబాబు ఒక రూపు తీసుకు వచ్చారు.'

- రాంప్రసాద్‌రెడ్డి, మంత్రి

కడప ఇక జగన్ అడ్డా కాదు



'కొన్ని పేపర్లు, టీవీల్లో జగన్ ఇలాఖాలో మహానాడు జరుగుతుందని ప్రచారం చేస్తున్నాయి. జగన్ హవా 2024కు ముందు ఉండేదేమో. ఇక్కడ పది అసెంబ్లీ స్థానాల్లో ఏడింటిని టీడీపీ గెలుచుకుంది. ఇంక ఎక్కడ ఇది జగన్ అడ్డా! రాయలసీమలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా వైసీపీ తీసుకురాలేదు. ఐదేళ్ల పాటు రాష్ట్రానికి సీఎంగా ఉన్న జగన్ తాను ప్రాతినిధ్యం వహించే పులివెందులకు కనీసం తాగు నీటిని కూడా అందించలేదు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం చంద్రబాబు ఇప్పటికే జిందాల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. రూ.3,200 కోట్ల వ్యయంతో కొప్పర్తి వద్ద అనేక పరిశ్రమలను తీసుకువచ్చి కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నారు. లిక్కర్, వివేకా కేసుల్లో వైసీపీ అగ్ర నేతలు జైలు కెళ్లక తప్పదు.'

- బీటెక్ రవి, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్

రాయలసీమ అంటే ఒకప్పుడు ఫ్యాక్షనిజమే



'1983 కంటే ముందు రాయలసీమ అంటే ఫ్యాక్షనిజమే. ఇదే అందరి మనసులో ఉండేది. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి రాయలసీమ అభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారు. చంద్రబాబు కుప్పం కంటే పులివెందులకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. మొట్టమొదటగా పులివెందులకు నీరిచ్చి ఘనత సాధించారు. ఎటువంటి అభివృద్ధి చేయని జగన్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు. ఆయనతో జైలు జీవితం అనుభవించిన విజయసాయిరెడ్డి కూడా నమ్మడం లేదు. ఐదేళ్ల పాలనలో అభివృద్ధి చేసినట్లు నిరూపిస్తే నా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తా. ఈ వేదికపై నుంచి ఒక్కటే కోరుతున్నా... చక్రాయపేటలో కాలేటి వాగును పూర్తి చేయండి.'

- రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ

జన సునామీ చూసి వైసీపీ నేతల గుండెలు గుభేల్



'రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన లక్షలాది మంది తెలుగుదేశం పార్టీ శ్రేణులను చూసి వైసీపీ నేతల గుండెలు గుభేల్‌మంటున్నాయి. గత పాలనలో టీడీపీ కార్యకర్తల నుంచి చంద్రబాబు వరకూ ఇబ్బందులు పెట్టిన పరిస్థితులు గమనించాం. ప్రతి ఒక్కరూ జగన్ పరిపాలనలో ఇబ్బందిపడ్డారు. చంద్రబాబు పరిపాలనలో ప్రజలకు ఉత్తమ సేవలందించిన అధికారులు అవార్డులు అందుకుంటుంటే జగన్ పరిపాలనలోని అధికారులు జైళ్లకు వెళుతున్నారు.'

- ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే

చంద్రబాబు హయాంలోనే అభివృద్ధి



'ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి సాధించింది. కడపలో మహానాడు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. మా జిల్లాలో మహానాడు నిర్వహించాలని ఎమ్మెల్యేలం, నాయకులం కోరిన వెంటనే అందుకు అంగీకరించి ఇక్కడ ఇంత పెద్ద కార్యక్రమం ఏర్పాటు చేసిన చంద్రబాబుకు కృతజ్ఞతలు. మరోసారి జగన్ లాంటి వ్యక్తులకు అవకాశం ఇవ్వవద్దు.'

- నంద్యాల వరదరాజులరెడ్డి, ఎమ్మెల్యే, ప్రొద్దుటూరు

(మొదటి పేజీ తరువాయి)

దృష్టి పెట్టాలి..' అని పిలుపిచ్చారు. ఇంకా ఏమన్నారంటే..

వాళ్లే పారిపోయే పరిస్థితి..

మన జెండా పీకేస్తామన్నారు. వాళ్లే ఇప్పుడు పార్టీ కార్యాలయానికి టూలెట్ బోర్డు పెట్టుకుని పారిపోయే పరిస్థితి.. మన పార్టీని లేకుండా చేస్తామన్నారు.. వాళ్లే అడ్రస్ లేకుండా పోయే పరిస్థితి.. వైనాట్ 175 అన్నారు. ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వని పరిస్థితి.. మన బొమ్మలు పెట్టి బాక్సింగ్ చేశారు.. ప్రజలే ఇప్పుడు ఫుట్‌బాల్ ఆడుకునే పరిస్థితి.. ఏ తప్పూ చేయని మన అధినేత చంద్రబాబును బంధించారు. ప్రజలు ఏకంగా ఆ నాయకుడినే ప్యాలెస్‌లో పెట్టి తాళాలు వేశారు. 2024 ఎన్నికల్లో మాస్ విక్టరీ చూశాం. మనకు అధికారం కొత్త కాదు.. ప్రతిపక్షం కొత్త కాదు. కానీ గత ఐదేళ్ల విధ్వంస పాలన ఎదుర్కొన్నాం. మన నాయకులు, కార్యకర్తలపై దాడులు, హత్యలు చేశారు. ప్రశ్నిస్తే కేసులు, పోరాడితే అరెస్టులు. మన అధినేతను అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టారు. రాజమండ్రి జైలులో చంద్రబాబును చూసినప్పుడు చాలా బాధేసింది. అలిపిరిలో ఆయన్ను చంపేందుకు బాంబు పేల్చారు. ప్రజలకు అండగా నిలిచేందుకు భగవంతుడు ఆయన్ను మన ముందుంచారు.

రాష్ట్రాన్ని కాపాడుకోవడానికే కూటమి

రాష్ట్రాన్ని కాపాడుకోవడానికే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఏర్పడింది. ప్రజల కోసం ప్రధాని మోదీ, జనసేన అధినేత పవనన్న, మన చంద్రన్న జెండాలు, ఎజెండాలు పక్కనపెట్టి కలిసి పనిచేశారు. జనం కూటమిని ఆశీర్వదించారు. ప్రజాప్రభుత్వం ఏర్పడింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. కూటమి అన్న తర్వాత చిన్న చిన్న సమస్యలు సహజం. చిన్న కుటుంబంలోనే సమస్యలుంటాయి. ఈగోలు పక్కనపెట్టి అందరినీ కలుపుకొని పనిచేయాలి. రాసిపెట్టుకోండి.. కూటమిలో విడాకులు ఉండవు. రాష్ట్రం బాగుపడాలి.. ప్రజలు సంతోషంగా ఉండాలంటే మనం కలిసి ఉండాల్సిందే. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నారు. మోదీ అన్ని విధాలా సహకరిస్తున్నారు. గుజరాత్‌లో బీజేపీ వరుసగా 7 సార్లు గెలిచింది. ఒకే ప్రభుత్వం ఉండడం వల్ల ఆ రాష్ట్రం ఎంతలా అభివృద్ధి చెందిందో చూడండి. ఒడిసాలో బిజూ జనతాదళ్ వరుసగా ఐదుసార్లు గెలిచింది. ఆ రాష్ట్రం కూడా అనేక రంగాల్లో అభివృద్ధి చెందింది. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు వరుసగా రెండుసార్లు గెలిచినప్పుడు ఎంతటి అభివృద్ధి సాధించిందో అందరికీ తెలుసు. అందుకే ప్రభుత్వ కొనసాగింపు అనేది ముఖ్యం. పెట్టుబడిదారులకూ నమ్మకం ఉంటుంది.

ఆరు శాసనాలే మన శ్వాస..

కడప మహానాడులో ఏకగ్రీవంగా ఆమోదించిన ఆరు శాసనాలను పొలిట్‌బ్యూరో సభ్యుడి నుంచి సామాన్య కార్యకర్త వరకు శ్వాసగా భావించి చిత్తశుద్ధితో అమలుకు కృషి చేయాలి. సమస్యలుంటే ఎక్కడివి అక్కడే పరిష్కరించుకోవాలి. స్థానికంగా పరిష్కారం కాకుంటే మా దృష్టికి తెండి. మేం పరిష్కరిస్తాం. యువగళం పాదయాత్ర సమయంలో రాయలసీమ ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా చూశాక ఈ కడపగడ్డపైనే మిషన్ రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించా. అప్పుడు ఇచ్చిన హామీ అమలు దిశగా చంద్రబాబు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాయలసీమను ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, రెన్యువబుల్ ఎనర్జీ, హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నాం.

వైసీపీ బాధిత కార్యకర్తల కుటుంబాలకు అండ..

దేశంలో ఏ పార్టీ కార్యకర్తలకు ఇవ్వని గౌరవం టీడీపీ ఇస్తోంది. రూ.5 లక్షల ప్రమాద బీమా అందిస్తోంది ఒక్క మన పార్టీ మాత్రమే. ఫ్యాక్షన్‌లో చనిపోయిన కార్యకర్తల పిల్లలు ఫ్యాక్షన్ వైపు వెళ్లకూడదని ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి చదివించింది మన సీబీఎన్. కేవలం కార్యకర్తల సంక్షేమానికి.. విద్య, వైద్యం, స్వయం ఉపాధి కోసం రూ.140 కోట్లు ఖర్చు చేశారు. నేను స్వయంగా వైసీపీ బాధిత కార్యకర్తల కుటుంబాలను కలుస్తున్నాను. వారి సమస్యలను ఒక్కొటిగా పరిష్కరిస్తున్నా. వారికి పార్టీ అండగా ఉంటుంది. చంద్రబాబు, నేను ఏ జిల్లాలో పర్యటించినా ముందు ఉత్తమ కార్యకర్తలను కలిశాకే ఇతర కార్యక్రమాలు పెట్టుకుంటున్నాం. సీనియర్లను, జూనియర్లను గౌరవిస్తాను. కానీ పనిచేసే వారిని ప్రోత్సహిస్తాను. అధికారంలో ఉన్నప్పుడే కాదు.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ జగన్‌ను వాళ్ల పార్టీ కార్యకర్తలు కలవలేరు. టీడీపీ కార్యకర్తల కోసం మా ఇంటి ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. అదీ వైసీపీకి, టీడీపీకి మధ్య తేడా. నామినేటెడ్ పదవులన్నీ ఓ పద్ధతి ప్రకారం ఇస్తున్నాం.



దేవుని కడప సాక్షిగా 4 ప్రశ్నలు..

తిరుమల తొలి గడప దేవుని కడప. ఒంటిమిట్ట రామాలయం, అమీన్‌పీర్ దర్గా, మరియాపురం చర్చి ఉన్న పుణ్యభూమి ఈ కడప. పౌరుషం, ఆత్మీయత, మహిళలను గౌరవించడం ఇక్కడి నుంచే నేర్చుకోవాలి. కడప మాస్ జాతర.. మహానాడు అదిరిపోయింది. పౌరుషాల గడ్డపై పసుపు జెండా రెపరెపలాడుతోంది. దేవుని కడప సాక్షిగా ఇక్కడి ప్రజలను నాలుగు ప్రశ్నలు అడగాలనుకుంటున్నా. 1. తల్లిని, చెల్లిని మెడపట్టి బయటకు గెంటిందెవరు? 2. సొంత బాబాయిని గొడ్డలిపోటుతో లేపేసిందెవరు? 3. జే-బ్రాండ్‌తో పేదల రక్తం తాగిందెవరు? 4. బల్లకింద రెడ్ బటన్ నొక్కి ప్రజలను బాదింది ఎవరు?



పసుపు పండుగ సూపర్ హిట్!



జనసంద్రమైన కడప గడప

మూడ్రోజుల వేడుకలో ఆద్యంతం లోకేశ్ మార్క్.. 'కార్యకర్తే అధినేత' సహా 6 శాసనాలకు ఆమోదం

చంద్రబాబు నుంచి నేతల వరకు చర్చ దానిపైనే.. పార్టీ నియమావళిని సవరించి చేర్చిన వైనం

మొత్తం 14 అంశాలపై తీర్మానాలు

(మహానాడు ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి కంచుకోటగా ఉన్న కడప గడ్డపై మహానాడు విజయ సంరంభం ముగిసింది. కడప జిల్లా సీకే దిన్నె మండలం పబ్బాపురంలో మంగళవారం ప్రారంభమైన మహానాడు.. గురువారం సాయంత్రం నిర్వహించిన భారీ బహిరంగ సభతో సమాప్తమైంది. లక్షలాదిగా తరలివచ్చిన జనాన్ని చూసి టీడీపీ నేతలు, కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. తొలిసారి కడపలో జరిగిన ఈ మహానాడులో ఆద్యంతం యువ నేత లోకేశ్ మార్కు స్పష్టంగా కనబడింది. తొలి రోజు ఆయన ఆలోచనలకు అనుగుణంగా కార్యకర్తలకు పెద్దపీట వేశారు. వారికి భరోసా ఇచ్చేందుకు.. పార్టీ పటిష్టానికి.. రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఆయన 'నా తెలుగు కుటుంబం' పేరుతో ఆరు శాసనాలను ప్రతిపాదించారు. వాటిలో 'కార్యకర్తే అధినేత' అనే ప్రతిపాదన సీఎం చంద్రబాబుతోపాటు సామాన్య కార్యకర్తనూ బాగా ఆకట్టుకుంది. చంద్రబాబు తన ప్రసంగాల్లో పదే పదే ఈ అంశాన్ని ప్రస్తావించారు. పార్టీ నియమావళిని సవరించి మరీ ఈ ఆరు శాసనాలను చేర్చారు. గతానికి భిన్నంగా.. ఈసారి మహానాడు వేదికపై మాట్లాడే అవకాశాన్ని కార్యకర్తలకు కల్పించారు. మొదటి రెండ్రోజుల్లో అతిరథ మహారథుల సమక్షంలో తమకు మాట్లాడే అవకాశం కల్పించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకుని ఉన్నవారికి అధిష్ఠానం పెద్దపీట వేస్తుందన్న సంకేతాలను బలంగా పంపేందుకు ఈ కొత్త విధానం ఉపయోగపడింది.

> మహానాడు తొలి రోజు ఐదు అంశాలపై తీర్మానాలు చేశారు. ఇవన్నీ లోకేశ్ ప్రతిపాదిత 6 శాసనాల్లో భాగం కావడం గమనార్హం. మరుసటి రోజు 9 తీర్మానాలపై చర్చించి ఆమోదం తెలిపారు. తెలంగాణకు సంబంధించి ఐదు తీర్మానాలను ఆమోదించారు. రెండు రాష్ట్రాలకు కలిపి ఉమ్మడిగా 4 తీర్మానాలు చేశారు.
>
> **23 తీర్మానాలు.**

తరలివచ్చిన తమ్ముళ్లు

కడప మహానాడుకు రాష్ట్రం నలుమూలల నుంచీ టీడీపీ కార్యకర్తలు, నాయకులు వేల సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 23 వేల మంది పార్టీ ప్రతినిధులకు అధికారికంగా ఆహ్వానాలు పంపారు. అదనంగా వేల మంది వరకు కార్యకర్తలు హాజరయ్యారు. సుమారు 125 ఎకరాల్లో ప్రాంగణాన్ని నిర్మించి ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూశారు. అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు.

కడప జనసంద్రం

మహానాడు బహిరంగ సభకు తరలివచ్చిన టీడీపీ అభిమానులు, ప్రజలు, కార్యకర్తలతో గురువారం కడప నగరం జనసంద్రంగా మారింది. చిత్తూరు, కర్నూలు, తిరుపతి, రాజంపేట వైపుల నుంచి వచ్చిన వేల వాహనాలు చీమల బారులను తలపించాయి. సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ మొదలవుతుందని ప్రకటించారు. అయితే సుదూర ప్రాంతాల నుంచి జనం తెల్లారేసరికే వేదిక వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నానికి బహిరంగ సభ ప్రాంగణంతో పాటు పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. 5 లక్షల మందితో భారీ సభ నిర్వహించాలని నిర్ణయించిన ఆ స్థాయిలో జనసమీకరణ చేసింది. సభకు దాదాపు 4 లక్షల మంది హాజరు కాగా.. అక్కడకు చేరుకోలేక వెనుతిరిగిన వారు మరో 2 లక్షల మంది ఉంటారని పార్టీ నాయకుల అంచనా.



శ్రీనివాసరెడ్డి భావోద్వేగం..

మహానాడు సక్సెస్ కావడంతో చంద్రబాబు టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి భర్త ఆర్.శ్రీనివాసరెడ్డిని మనస్ఫూర్తిగా అభినందించారు. దీంతో ఆయన భావోద్వేగానికి లోనై అధినేతను పట్టుకుని కన్నీరు పెట్టుకున్నారు. సీఎం ఆయన భుజం తట్టి ఊరడించారు. ఏర్పాట్లు బాగా చేశారని, జనసమీకరణ బాగా జరిగిందని, బాగా సక్సెస్ చేశారని కొనియాడారు. జిల్లా నేతలను కూడా ఆయన, లోకేశ్ ప్రశంసించారు.

చెప్పిన సమయానికే..

గతంలో జరిగిన మహానాడులకు, పార్టీ సభలకు భిన్నంగా ఈసారి సమయ పాలనపై నిర్వాహకులు దృష్టి సారించారు. లోకేశ్ ఈ విషయంలో కచ్చితంగా ఉండడంతో మహానాడు తొలి రోజు మంగళవారం సమయపాలన పక్కాగా పాటించారు. ఉదయం 8.30 గంటలకు ప్రతినిధుల నమోదు మొదలు.. వేదికపై చంద్రబాబు, లోకేశ్ ప్రసంగాల వరకు నిర్దేశిత సమయానికే ముగిశాయి. సాయంత్రం 6 గంటలకు తొలి రోజు కార్యక్రమాన్ని ముగించాల్సి ఉండగా 20 నిమిషాలు ఆలస్యం కావడంతో వేదికపైనే చంద్రబాబు ఈ విషయాన్ని ప్రస్తావించారు. బుధవారం రెండో రోజు కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా సమావేశాన్ని ముగించారు. చివరి రోజు బహిరంగ సభను నిర్వాహకులు అద్భుతంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన సభను నిర్దేశిత సమయం ప్రకారం సాయంత్రం 5.10 నిమిషాలకు ముగించారు.

డ్రోన్లతో పర్యవేక్షణ

బహిరంగసభకు భారీ ఎత్తున జనం పోటెత్తడం, పెద్దసంఖ్యలో వాహనాలు రావడంతో అత్యాధునిక డ్రోన్లతో ఐజీపీ సీహెచ్ శ్రీకాంత్ డ్రోన్లతో పర్యవేక్షించారు. 23 డ్రోన్లు, నాలుగు అత్యాధునిక టెక్నాలజీ డ్రోన్లను వినియోగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూశారు. మహానాడుకు ముందురోజు కడపలో భారీ వర్షం కురిసింది. అయితే తర్వాతి మూడు రోజులు కురవలేదు. గురువారం సభ ముగిశాక మాత్రం చినుకులు పడ్డాయి.

సుస్థిర పాలనపై చంద్రబాబు స్పష్టత

మహానాడు వేదికగా చంద్రబాబు సుస్థిర పాలన ఆవశ్యకతపై స్పష్టత ఇచ్చారు. గుజరాత్ అభివృద్ధికి సుస్థిర పాలన ఏ విధంగా దోహదపడింది.. ఏపీలో 2019లో టీడీపీ ఓటమి వల్ల రాష్ట్రానికి ఎలాంటి నష్టం జరిగిందన్న విషయాలను ప్రజలందరికీ అర్థమయ్యేలా వివరించారు. ప్రారంభం నుంచి ముగింపు వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులనుంచి అద్భుత స్పందన లభించింది. ముఖ్యంగా చంద్రబాబు, లోకేశ్ ప్రసంగాలకు భారీ స్పందన వచ్చింది. సభ ముగిసిన అనంతరం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి చంద్రబాబుకు నాగలి, చెర్నాకోల బహూకరించారు. ఆయన చెర్నాకోలను తిప్పడంతో తెలుగు తమ్ముళ్లు నృత్యం చేశారు. కాగా.. మహానాడు ముగిసిన తర్వాత చంద్రబాబు కడప విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో సుమారు 4 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా నిలబడిన కార్యకర్తలకు ఆయనకు వీడ్కోలు పలికారు. శ్రేణుల కోలాహలంతో ఆయన కాన్వాయ్ రెండుసార్లు ఆగింది.





బహిరంగ సభకు తరలివస్తున్న మహిళలు, మహానాడు ప్లకార్డును ప్రదర్శిస్తున్న చిన్నారి

మహానాడుకు గల్ఫ్ నుంచి తెలుగు తమ్ముళ్లు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడుపై విదేశాల్లోని పార్టీ అభిమానులు, కార్యకర్తలు ఎనలేని ఆసక్తి కనబరిచారు. గల్ఫ్ దేశాల్లోని ప్రవాసాంధ్రుల్లో కడప జిల్లా వారే ఎక్కువ. కడపలో మహానాడు ఘనంగా నిర్వహించడంతో దాని ప్రభావం గల్ఫ్ ప్రవాసీయులలో ఎక్కువగా కనిపించింది. ఇక్కడ నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ అభిమానులు మహానాడుకు హాజరయ్యారు. ఐరోపా, అమెరికా నుంచి కూడా ప్రతినిధులు ఎక్కువగా వచ్చినట్లు సమాచారం. ప్రతినిధుల నమోదుకు ఎన్నారైలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులకు టీడీపీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ కౌంటర్‌ను కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, ప్రవాసాంధ్ర వ్యవహారాల రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించారు. పార్టీలోని వివిధ విభాగాల ప్రముఖులకు వేదికపై సముచిత స్థానం ఇచ్చారు. రావి రాధాకృష్ణకు కూడా వేదికపై స్థానం కల్పించారు.



పసుపు పండుగ

మహానాడు నుంచి.. హస్తినకు బాబు

న్యూఢిల్లీ/అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) వార్షిక సదస్సు-2025లో కీలక ప్రసంగం చేసేందుకు సీఎం చంద్రబాబు గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. మహానాడు సభ అనంతరం కడప నుంచి హస్తిన వెళ్లారు. అక్కడి తాజ్ ప్యాలెస్‌లో శుక్రవారం సాయంత్రం 4:30 నుంచి 5:30 వరకు 'డ్రైవింగ్ ఎనామిక్ గ్రోత్ అండ్ సస్టెయినబులిటీ: ఆంధ్రప్రదేశ్ బ్లూప్రింట్' అనే ప్రత్యేక ప్లీనరీ సెషన్‌లో ఆయన మాట్లాడతారు. స్వర్ణాంధ్ర విజన్-2047కు సంబంధించి రాష్ట్ర వ్యూహాత్మక ప్రణాళికలను ఈ సందర్భంగా వివరిస్తారు.

మీవల్లే పరపతి పెరిగింది

మీరు బంపర్ మెజారిటీతో గెలిపించడం వల్ల కేంద్రంలో పరపతి పెరిగింది. దానివల్ల రాష్ట్రానికి పనులు చేయించుకుంటున్నాం. 2027నాటికి పోలవరాన్ని పూర్తి చేసి తీరుతాం. దీనికి కేంద్రం సాయం చేస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రూ.11,400 కోట్లతో గాడినపెడుతున్నాం. రైల్వేజోన్ తెచ్చాం. రాజధాని కోసం కేంద్రం రూ.15 వేల కోట్లు ఇచ్చింది.

- సీఎం చంద్రబాబు



ఈ పెద్దాయన స్ఫూర్తి ప్రదాత.. సీఎం కితాబు

ఏడు పదుల వయస్సులో..

మహానాడుకు 400 కి.మీ. సైకిల్‌పై ప్రయాణం

కడప, మే 29(ఆంధ్రజ్యోతి): ధూళిపూడి మునేశ్వరరావు... ఏడు పదులు దాటిన వయస్సు ఆయనది. కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు స్వగ్రామం. ఈ పెద్దాయన తెలుగుదేశం పార్టీకి వీరాభిమాని. మండేఎండలు, మధ్యలో వర్షాలు... లెక్కేలేదు. అభిమాన ప్రదర్శనకు అడ్డే కాదు. 400 కిలోమీటర్లు సైకిల్ తొక్కుతూ కడపలో జరిగిన మహానాడుకు హాజరయ్యారు. పెద్దాయన అభిమానం పార్టీ జాతీయ అధ్యక్షుడి దృష్టికి వెళ్లింది. మునేశ్వరరావుని చంద్రబాబు వేదికపైకి పిలిపించారు. అందరికీ చూపిస్తూ... 'ఈ పెద్దాయన అందరికీ స్ఫూర్తి ప్రదాత. తెలుగుదేశం పార్టీకి ఇలాంటి కార్యకర్తలు ఉండటం పూర్వజన్మ సుకృతం' అని చంద్రబాబు అన్నారు. వేదికపై ఉన్న మంత్రి లోకేశ్ లేచి చప్పట్లు కొడుతూ అభినందించారు.



టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి అచ్చెన్న, కేంద్రమంత్రి పెమ్మసాని సంభాషణ



మహానాడుకు తరలి వచ్చిన వాహనాలు, జనంతో రద్దీగా ప్రాంగణం



బహిరంగ సభకు వెళ్లే మార్గంలో కిక్కిరిసిన జనం



కార్యకర్తలు, నేతలతో కిక్కిరిసిన భోజనశాల

ఆపరేషన్ క్లీన్ పాలిటిక్స్

(మొదటి పేజీ తరువాయి)

మహానాడు ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

ఇదీ మన కార్యకర్త సత్తా..

"కడప తెలుగుదేశం అడ్డా అని మహానాడు నిరూపించింది. నేను చాలా మహానాడులు చూశాను. ఈసారి మాత్రం కార్యకర్తలు చాలా ఉత్సాహంగా తరలివచ్చారు. ఈ మహానాడు సమయపాలనను కచ్చితంగా పాటించింది. ఎన్నికల సమయంలో నేను కడప వచ్చినప్పుడు 'ఇక్కడ మార్పు స్పష్టంగా కనిపిస్తోం'దని చెప్పా. మీరు దాన్నే నిజం చేశారు. 2024 ఎన్నికల్లో పదికి ఏడు సీట్లు గెలిచాం. 2029కి 10కి 10 గెలవాలి. సీమలో 52 సీట్లకు 45 సీట్లలో కూటమిని గెలిపించారు. ఈ ప్రజాతీర్పు మనలో బాధ్యతను పెంచింది. ఈ తీర్పు మనకు అర్థమైంది. కానీ ఓటమి చెందిన పార్టీ మాత్రం(వైసీపీ) అర్థం చేసుకోలేదు. గత ఐదేళ్లలో టీడీపీ ఎన్నో పోరాటాలు చేసింది. హత్యలు, అవమానాలు, దాడులు.. ఇలా ఎన్నో ఎదుర్కొన్నారు మన కార్యకర్తలు. 2024 విజయం వెనుక టీడీపీ కార్యకర్త పాత్ర ఉంది. అరవై ఏళ్ల వయసులో ఓ కార్యకర్త కోడూరు నుంచి సైకిల్‌పై వచ్చాడంటే అదీ టీడీపీ కార్యకర్త సత్తా! సంపద సృష్టించడం తెలిసిన పార్టీ మనది. సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికిన నాయకుడు ఎన్టీఆర్. నా కష్టం నా కోసం కాదు.. నన్ను నమ్ముకున్న ఈ జనసంద్రం కోసం..".

సమస్యలున్నా సంక్షేమం అమలు చేస్తున్నా...

"దేశంలో ఏ రాష్ట్రంలోనైనా 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నా రా?. ఏడాదికి రూ.33వేల కోట్లు పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నారా?. ఏపీలో కూటమి ప్రభుత్వం మాత్రమే ఇంత భారీగా ఖర్చు చేస్తోంది. మాట ఇచ్చినట్లు రూ.4వేల పింఛను ఇవ్వడమే కాకుండా 3 నెలల పింఛను ఒకేసారి ఇచ్చి మాట నిలబెట్టుకున్నాం. 16 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. మొదటి సంతకం ఈ ఫైలుమీదే పెట్టాం. దీపం 2 కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. 4 నెలలకోసారి మీ ఖాతాల్లో డబ్బులు వేస్తాం. ఎస్సీ వర్గీకరణపై గత వైసీపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే దాన్ని అమలు చేసి సోషల్ రీయింజనీరింగ్ చేసిన పార్టీ టీడీపీ. వైసీపీ హయాంలో రోడ్లు ఎలా ఉన్నాయో మీరంతా చూశారు. మేం అధికారంలోకి రాగానే వాటన్నింటికీ మరమ్మతులు చేశాం. పేదవాళ్లు ఆకలితో ఉండకూడదని 203 అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాం. పేదవాడికి అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను మూసివేశాడంటే ఆ మనిషి ఎలాంటి వాడో మీరు అర్థం చేసుకోవచ్చు. అలాం టి వ్యక్తి మనకు అవసరమా?. దీంతోపాటు 21 దేవాలయాల్లో నిత్య అన్నదానాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాం. గత వైసీపీ ప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకుండా వాటిని అటకెక్కించింది. మనం అధికారంలోకి రాగానే 94 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 73 పథకాలను పునరుద్ధరించాం. ఇదీ మన చిత్తశుద్ధి."

> "ఐదేళ్ల వైసీపీ పాలనతో రాష్ట్రం చిమ్మచీకట్లలో ఉండిపోయింది. రూ.10 లక్షల కోట్ల అప్పులు, రూ.1.20 లక్షల కోట్ల బకాయిలు, అప్పులపై వడ్డీనే రూ.40వేల కోట్లు ఏడాదికి చెల్లించాలి. ఉద్యోగాలకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి. అయినా భయపడలేదు. రాష్ట్రాన్ని చక్కదిద్దే బాధ్యత తీసుకుని ఇటుక ఇటుక పేర్చుతూ విధ్వంసం నుంచి పునర్ నిర్మాణం దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. క్లైమోర్‌మైన్లకే భయపడని నేను సమస్యలకు భయపడతానా? అభివృద్ధి.. సంక్షేమం.. సంపద సృష్టి.. నిరంతం పేదల జీవనప్రమాణాల పెంపు...నా జీవిత ఆశయం."
>
> - చంద్రబాబు

అమరజీవి మెమోరియల్‌కు ఐదు ఎకరాలు


"టీడీపీకి వెన్నెముక బీసీలు. వారికి నేను అండగా ఉంటా. మనం అధికారంలోకి రాగానే వారికోసం రూ.47,456 కోట్లు కేటాయించాం. నాయీ బ్రాహ్మణులకు గౌరవవేతనాన్ని రూ.25వేలకు పెంచాం. చేనేతలపై జీఎస్టీ ఎత్తివేశాం. పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్స్‌కు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం. మద్యం షాపుల కేటాయింపులో గీత కార్మికులకు రిజర్వేషన్ అమలుచేశాం. 217 జీవోతో మత్స్యకారుల ఉపాధి దెబ్బతింటుండటంతో దాన్ని రద్దు చేశాం. స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. ఎస్సీలు, ఎస్టీలకు సోలార్ రూఫ్ టాప్‌లను ఉచితంగా ఏర్పా టు చేస్తాం. దీనికోసం బీసీలకు 98వేలు, ఓసీలు, ఇతరులకు రూ78 వేలు సబ్సిడీ ఇస్తాం. రైతులు కుసుమ్ కింద సోలార్ పెట్టుకుంటే ఉచితంగా ఇస్తాం. ఇలా చెప్పుకొంటూ పోతే 11 నెలల్లో కూటమిప్రభుత్వం చాలా చేసింది. ఆర్యవైశ్య ఇలవేల్పు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా చేస్తున్నాం. అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ఏర్పాటుకు ఐదు ఎకరాలు కేటాయిస్తాం. అక్కడ ఆయన విగ్రహం పెడతాం. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు తీవ్ర అవమానాలు ఎదుర్కొన్నారు. కూటమి అధికారంలోకి రాగానే టీచర్లకు మేలు చేసేలా 117 జీవో రద్దు చేశాం. పోలీసులకు రూ.213 కోట్ల విలువైన సరెండర్ లీవు సొమ్ము చెల్లించాం. ఉద్యోగుల సొమ్ము రూ.7,500 కోట్లు గత ప్రభుత్వం మళ్లించగా, వాటిని తిరిగి వారికి ఇచ్చాం. అంగన్వాడీలు, ఆశాలకు 1.50 లక్షల లబ్ధి చేకూరేలా గ్రాట్యుటీ అమలు చేస్తున్నాం. అధికారంలోకి రాగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. వచ్చే మహానాడు నాటికి భూసమస్యలన్నీ పరిష్కరిస్తాం."

యువతపైనే నా ఆశలన్నీ

"యువతకు అవకాశాలు ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని బలంగా నమ్ముతాను. అందుకే 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించాం. రాష్ట్రానికి రావడానికి పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారు. 'మీ రాష్ట్రంలో గత ఐదేళ్లు ఓ భూతం ఉండేది' అని అంటున్నారు. ఆ భూతాన్ని పాతి పెడతానని వారికి చెప్పాను. తిరుపతి, అనంతపురంలో ఒక్కో కేంద్రం పెట్టి ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నా. టెక్నాలజీ పెరుగుతోంది. మీకు వాట్సాప్‌లో వచ్చే నెల 12 నాటికి 500 సేవలకు పెంచుతాం."



చంద్రబాబు, మండిపల్లి, విజయమ్మ, రితేశ్‌రెడ్డి, చైతన్యరెడ్డి, పల్లా శ్రీనివాస్, ఆర్‌శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి, ముక్కా రూపానందరెడ్డి, మాధవి రెడ్డి, భూపేశ్‌రెడ్డి, రామగోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు అభివాదం



రాయలసీమ మిషన్

"రాయలసీమ బిడ్డగా రాళ్ల సీమను రతనాల సీమగా మారుస్తా. ఒకప్పుడు ఇక్కడ ఉన్న ఫ్యాక్షన్ భూతాన్ని రూపుమాపింది టీడీపీనే. రాయలసీమ అభివృద్ధికి నా వద్ద స్పష్టమైన బ్లూప్రింట్ ఉంది. ఇప్పటికే ఎన్నో తీసుకొచ్చాం. తిరుపతిలో హజ్ హౌస్‌ను టీడీపీ 90 శాతం పూర్తి చేస్తే దాన్ని ఐదేళ్లలో పూర్తిచేయకుండా వైసీపీ పక్కన పెట్టింది. దీన్ని త్వరలోనే పూర్తిచేస్తాం. లేపాక్షి, ఓర్వకల్లు కారిడార్‌లో డిఫెన్స్, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీ, ఆటోమొబైల్ సిటీని ఏర్పాటుచేస్తాం. కర్నూలుకు హైకోర్టు బెంచి తీసుకొస్తాం. ఓబులాపురం మైన్స్ స్కామ్‌లో ఉన్న వారు ఇప్పుడు జైలులో ఉన్నారు. గత ప్రభుత్వం కడప స్టీల్ ప్లాంటుకు నేను వేసిన పునాది తీసి కొత్తది వేసి నాటకాలాడింది. కడపకు స్టీల్ ప్లాంట్ మాత్రం రాలేదు. ఈ ఏడాది జూన్ 12 లోపల కడపలో సీమ స్టీల్ ప్లాంట్ ప్రారంభమవుతుంది. మూడు వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. కొప్పర్తి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులు రెండింటికీ ఐదువేల కోట్లు వస్తాయి. నీటి విలువ, రైతు కష్టం తెలిసిన పార్టీ టీడీపీ. రాయలసీమకు నీళ్లు ఇవ్వాలన్న ఆలోచన చేసిన నేత ఎన్టీఆర్. తెలుగుగంగ, గాలేరు-నగరి, కేసీ కెనాల్, హంద్రి-నీవా, ఇవన్నీ మనమే తెచ్చాం.

'అన్నమయ్య'ను పూర్తిచేస్తాం

అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే వైసీపీ నాడు పట్టించుకోలేదు. ఆ ప్రాజెక్టును నిర్మిస్తామని హామీ ఇస్తున్నా. టీడీపీ హయాంలో సీమకు రూ.12వేల కోట్లు ఖర్చు పెట్టాం. రాయలసీమను రాజకీయం కోసం వాడుకునే వైసీపీ ఈ ప్రాంతం కోసం కేవలం 2వేల కోట్లు ఖర్చు పెట్టింది. ఎవరు రాయలసీమ బిడ్డో మీరే చెప్పండి. రతనాలసీమగా రాయలసీమ కావాలంటే పోలవరం-బనకచర్లను పూర్తిచేయాలి. దీనికి రూ.80వేల కోట్లవుతుంది."

విధ్వంస రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం

"విధ్వంసం అయిన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని గత ఎన్నికల్లో మనం, మన మిత్రుడు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీకి చెందిన ప్రధాని మోదీ కలిసి ప్రజల ముందుకెళ్లాం. ప్రజలు మనల్ని నమ్మి ఘనవిజయం అందించారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో 10వేల మెజారిటీ వచ్చేది. మొన్న ఎన్నికల్లో కొత్తవారికి సీట్లు ఇచ్చినా 80వేలు.. 90వేలు మెజారిటీలు వచ్చాయి. 83 మందికి 30వేలు, 30 మందికి 50వేలు, 10 మందికి 70వేలు, ముగ్గురికి 90వేలుపైచిలుకు మెజారిటీ వచ్చింది."

4 లక్షల మందికి మహా భోజనం

చివరి రోజు చికెన్ బిర్యానీ.. పలుచోట్ల వంటావార్పులు

కడపలో నిర్వహించిన మహానాడులో మూడోరోజు గురువారం 2 లక్షల మందికి పైగా భోజన వసతి కల్పించారు. చికెన్ బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వాటర్ బాటిల్‌ను అందించారు. మహానాడులో మొదటి రోజు 70 వేల మందికి, రెండోరోజు లక్ష మందికి సీమ రుచులతో భోజన వసతి కల్పించా రు. మహానాడులో అంబికా క్యాటరింగ్ ఈవెంట్ ఆర్గనైజేషన్ ద్వారా దాదాపు 4 లక్షల మందికి పసందైన వంటకాలతో భోజనాన్ని అందించారు. ఇది గాక మహానాడు సభలో పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి కడప వచ్చిన వారికి దారి మధ్యలో భోజన ఏర్పాట్లు చేశారు. మూడో రోజు బహిరంగ సభకు కుప్పం, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, తంబళ్లపల్లి, మదనపల్లి, పలమనేరు, రాయచోటి, రాజంపేట, కోడూరు, కర్నూలు, ఆళ్లగడ్డ, నంద్యాల, తాడిపత్రి, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున అభిమానులు తరలివచ్చారు. ఆయా ప్రాంతాల నాయకులు టెంట్లు ఏర్పాటు చేసి కార్యకర్తలకు బుధవారం ఉదయం 10 గంటల సమయానికి నాన్‌వెజ్‌తో వంటలను సిద్ధం చేసి ఉంచారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు ఉదయం 10 గంటలకే శిబిరాలకు చేరుకుని అక్కడే భోజనం చేశారు. అటు నుంచి మహానాడు సభకు తరలివచ్చారు. మహానాడు బహిరంగ సభ మ ధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైంది. ఈ సమయంలో ప్రజలు, కార్యకర్తలు దాహంతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు హెరిటేజ్ మజ్జిగ ప్యాకెట్లను తీసుకొచ్చి పంపిణీ చేశారు. అలాగే మూడు లారీలలో వాటర్ బాటిళ్లను తీసుకొచ్చి పంపిణీ చేశారు.

(మహానాడు నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)







ఏరియల్ వ్యూ



బహిరంగ సభా వేదికపై మంత్రి లోకేశ్‌తో రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు

టీడీపీ కార్యకర్తల పార్టీ

'టీడీపీ కార్యకర్తల పార్టీ. తెలుగుదేశం పార్టీలో కష్టపడే కార్యకర్తలు ఎదిగేందుకు అవకాశాలున్నాయనేందుకు నేనే ఒక నిదర్శనం. ఒకప్పుడు కార్యకర్తను. ఈరోజు ఈ స్థాయికి చేరుకున్నా. యువగళం కార్యక్రమంతో మూడో తరం వెలుగులోకి వస్తోంది.'

- చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు

డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్‌గా నెల్లూరు వాసి

» 'ఆంధ్రజ్యోతి' విలేకరి నుంచి 2003లోనే ఐఏఎస్‌కు..



నెల్లూరు, మే 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా అల్లూరు మండలానికి చెందిన భానుప్రకాష్ ఎటూరి డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా (డీఈసీ)గా నియమితులయ్యారు. ఈయన స్వస్థలం నెల్లూరు జిల్లా అల్లూరు మండలం ఇందుకూరు గ్రామం. 2003 ఐఏఎస్ బ్యాచ్. అంతకముందు ఆయన 'ఆంధ్రజ్యోతి' పత్రికకు అల్లూరు విలేకరిగా పని చేశారు. జర్నలిజంలో కొనసాగుతూనే ఐఏఎస్ చేసి రాజస్థాన్ కేడర్‌కు ఎంపికయ్యారు. 2018-2021 వరకు డిప్యుటేషన్‌పై ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కార్యదర్శిగా కూడా పనిచేశారు. డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్‌గా ఐదేళ్ల పాటు కొనసాగుతారు.

అద్భుతంగా గండికోట

» ప్రఖ్యాత పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం: పెమ్మసాని



గండికోట లోయను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి తదితరులు

జమ్మలమడుగు, మే 29(ఆంధ్రజ్యోతి): గండికోటను అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. తాను ప్రపంచంలో చాలా అందమైన ప్రాంతాలను చూశానని, గండికోట లాంటి శత్రు దుర్భేద్యమైన కోట, లోయ ఎక్కడా లేవని అన్నారు. విశాలమైన కొండలు, లోయలు ఇక్కడ ఉన్నాయని అన్నారు. గురువారం కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి స్వగ్రామం దేవగుడికి ఆయన వచ్చారు. అక్కడి నుంచి పర్యాటక ప్రాంతమైన గండికోటను సందర్శించారు. గండికోటలోని ప్రధాన ద్వారం వద్ద నుంచి పావురాల మండపం, కారాగారం పరిశీలించారు. అక్కడి నుంచి జుమ్మా మసీదు, ధాన్యాగారం, లోయ వద్దకు వెళ్లారు. అనంతరం గండికోటలోని మాధవరాయస్వామి దేవాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గండికోటకు సుమారు 78 కోట్ల రూపాయలు పర్యాటక శాఖ నిధులను కేటాయించామన్నారు. ఈ ప్రాంతాన్ని మరో గ్రాండ్ కాన్యన్‌గా పర్యాటక అభివృద్ధి దిశగా నడిపించాలన్నారు. శ్రీకృష్ణ దేవరాయల కాలంలో భారతదేశం మొత్తం దండయాత్రలు జరిగినా గండికోటను మాత్రం శత్రువులు ఛేదించలేకపోయారన్నారు. దాదాపు 200 ఏళ్లకు పైగా మనవాళ్లు ఈ కోటను, విజయనగర సామ్రాజ్యాన్ని కాపాడారన్నారు. అందులో ప్రధాన పాత్ర పోషించిన తమ పూర్వీకుడు, చీఫ్ కమాండర్ పెమ్మసాని రామలింగనాయుడు కవచంలా నిలబడ్డారని వెల్లడించారు. శత్రువు కోట లోపలికి అడుగు పెట్టడానికి వీలు లేకుండా అద్భుతమైన ఆర్కిటెక్చర్‌తో ఈ కట్టడాలు నిర్మించారన్నారు. అమెరికాలోని గ్రాండ్ కాన్యన్ కూడా ఇలాగే ఉంటుందని, కానీ అక్కడ గండికోటలాగా నదీ ప్రవాహం లేదని చెప్పారు. గండికోట తమ పూర్వీకులకు చెందినది కాబట్టి అధికారంలోకి రాగానే ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేశామన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సైతం కేంద్ర టూరిజం శాఖ మంత్రితో మాట్లాడి రూ.78 కోట్ల నిధులు కేటాయించేలా కృషి చేశారన్నారు. టెండర్లు తుది దశలో ఉన్నాయని, ఆదినారాయణరెడ్డి చొరవ చూపి త్వరగా పనులు పూర్తయ్యేలా చేస్తారని తెలిపారు. సీఎం చంద్రబాబు ఇక్కడ శ్రీకృష్ణదేవరాయల వంద అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారన్నారు. ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గండికోట అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామన్నారు.

డిగ్రీ మారింది!



» కంప్యూటర్స్‌లో 'క్వాంటమ్' తప్పనిసరి
» రెండు మేజర్ సబ్జెక్టులు, ఒక మైనర్
» మూడేళ్ల డిగ్రీకి 150, నాలుగేళ్లకు 194 క్రెడిట్లు
» మధ్యలో ఆపితే అక్కడివరకు సర్టిఫికెట్

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): డిగ్రీ కోర్సుల స్వరూపం మారింది. సింగిల్ మేజర్ డిగ్రీని టు మేజర్‌గా (డ్యూయల్ మేజర్)గా మారుస్తూ ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీచేసింది. తాజాగా కోర్సులు ఎలా ఉండాలనేదానిపై సవివర మార్గదర్శకాలు విడుదల చేసింది. కొత్త విధానంలో రెండు మేజర్ సబ్జెక్టులు, ఒక మైనర్ సబ్జెక్టును విద్యార్థులు చదవాల్సి ఉంటుంది. ప్రస్తుత విధానంలో ఉన్నట్టుగానే విద్యార్థులు మూడేళ్ల డిగ్రీ లేదా నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ చదవొచ్చు. ఫస్టియర్, సెకెండియర్ తర్వాత కూడా మధ్యలోనే ఆపేసే వెసులుబాటు ఉంటుంది. టు మేజర్ డిగ్రీలో మూడేళ్లకు.. మొదటి మేజర్ సబ్జెక్టుకు 48 క్రెడిట్లు, రెండో మేజర్ సబ్జెక్టుకు 32 క్రెడిట్లు, మైనర్ సబ్జెక్టుకు 16 క్రెడిట్లు ఇస్తారు. భాషా సబ్జెక్టులకు 18, నైపుణ్య మెరుగుదల కోర్సులకు 12, మల్టీ డిసిప్లీనరీ కోర్సులకు 6, వాల్యూ యాడెడ్ కోర్సులకు 2, కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుకు 4, స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్‌కు 4, దీర్ఘకాలిక ఇంటర్న్‌షిప్‌కు 8 క్రెడిట్లు ఇస్తారు. మూడేళ్ల డిగ్రీ మొత్తం 150 క్రెడిట్లతో పూర్తవుతుంది. అదే విద్యార్థి నాలుగో ఏడాది ఆనర్స్ డిగ్రీ కూడా పూర్తిచేస్తే మరో 44 క్రెడిట్లు కలిసి మొత్తం 194 అవుతాయి. విద్యార్థి రెండు మేజర్ సబ్జెక్టులను మొదటి సెమిస్టర్‌లోనే ఎంపిక చేసుకోవాలి. మూడో సెమిస్టర్ సమయంలో మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి. ఏఐ, డేటా మైనింగ్, మెషీన్ లెర్నింగ్ కోర్సుల విద్యార్థులు తప్పనిసరిగా క్వాంటమ్ టెక్నాలజీపై మైనర్ చదవాలి. డిగ్రీలో చేరిన మొదటి సంవత్సరం తర్వాత ఆపేస్తే లెవెల్ 4.5తో సర్టిఫికెట్ జారీచేస్తారు. రెండో సంవత్సరం తర్వాత ఆపేస్తే వారికి లెవెల్ 5తో డిప్లొమా సర్టిఫికెట్ ఇస్తారు. మూడేళ్లు చదివితే లెవెల్ 5.5తో డిగ్రీ వస్తుంది. నాలుగేళ్లు చదివితే ఆనర్స్ డిగ్రీ ఇస్తారు. నాలుగో సంవత్సరం రిసెర్చ్ మెథడాలజీలో చదివితే ఆనర్స్‌తో పాటు రిసెర్చ్ డిగ్రీ వస్తుంది.

స్కూళ్ల గుర్తింపు పదేళ్లకు పెంపు

హామీ నెరవేర్చిన మంత్రి లోకేశ్

ప్రైవేటు పాఠశాలల గుర్తింపును ఎనిమిది నుంచి పదేళ్లకు పెంచుతూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో పదేళ్ల గుర్తింపు ఉండగా వైసీపీ ప్రభుత్వం దానిని మూడేళ్లకు తగ్గించింది. తాము అధికారంలోకి వస్తే మళ్లీ పదేళ్లు చేస్తామని ప్రతిపక్షంలో ఉండగా నారా లోకేశ్ హామీ ఇచ్చారు. దీంతో ఎన్నికలకు ముందు వైసీపీ సర్కారు ఎనిమిదేళ్లకు పెంచింది. కాగా, ఎన్నికలు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేటు స్కూళ్ల గుర్తింపును పదేళ్లకు పెంచుతూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

బీఆర్ఎస్‌ను బీజేపీలో కలిపే ప్లాన్

» నేను జైల్లో ఉన్నప్పుడే ఈ ప్రతిపాదన: కవిత
» అడ్డుకుంటాననే కేసీఆర్‌కు దూరం చేసే కుట్ర



హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే ప్రయత్నం జరుగుతోందని, తాను పార్టీలో ఉన్నంతకాలం అది కుదరదన్న ఉద్దేశంతో తనను కేసీఆర్‌కు దూరం చేసే కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఇంటి ఆడబిడ్డనైన తనపై పెయిడ్ సోషల్ మీడియాలో విషప్రచారం చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను ఇబ్బంది పెడితే ఊరుకోనని, తాను నోరు విప్పితే తట్టుకోలేరని హెచ్చరించారు. కొత్త పార్టీ అవసరం తనకు లేదని, ఉన్న పార్టీని కాపాడుకుంటే చాలునని వ్యాఖ్యానించారు. కేసీఆరే తన నాయకుడని, ఇతరుల నాయకత్వంలో పనిచేయనని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. "మా నాన్నకు నేను లేఖ రాస్తే తప్పేంటి? అయినా నీకు నొప్పేందిరా బై? అధినేతకు రహస్యంగా రాసిన లేఖను ఎవరు బయటపెట్టారని నేను ప్రశ్నిస్తే.. నా బృందమే లీక్ చేసిందంటూ కేసీఆర్ ఇంటి ఆడబిడ్డపైనే తమ పెయిడ్ సోషల్ మీడియా, పెయిడ్ పత్రికలు, యూట్యూబ్ చానళ్ల ద్వారా విషప్రచారం చేస్తున్నారు. పార్టీలో కోవర్టులున్నారంటూ నా మీద పడి ఏడుస్తున్నారు. లీకు వీరులను బయట పెట్టమంటే.. గ్రీకువీరులు నాపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. ఇక్కడ చాలదన్నట్టు విదేశాల్లో కూడా సోషల్ మీడియా వర్కర్లను పెట్టుకొని దుష్ప్రచారం చేయిస్తున్నారు" అని కవిత ధ్వజమెత్తారు. తనపై కాంగ్రెస్, బీజేపీ వారు సైతం ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేస్తుంటే పార్టీ నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన కమిషన్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి ఇబ్బంది పెడుతుంటే.. పార్టీ ఎందుకు కార్యాచరణ తీసుకులేదని కవిత ప్రశ్నించారు. పార్టీ ముఖ్యనాయకులు ట్వీట్లకే పరిమితమైతే ఎలా? అని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి, వర్కింగ్ ప్రెసిడెంట్ చేయాల్సిన పనులు చేయాలి కదా! అని అన్నారు. తాను కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నించాననడం అబద్ధమన్నారు. జాతీయస్థాయిలో కాంగ్రెస్ చేతకానితనం, రాహుల్‌గాంధీ అసమర్థత వల్లే కేంద్రంలో బీజేపీ గెలుస్తోందన్నారు.

కవిత వెంట మల్లారెడ్డి!

మేడ్చల్: ఎమ్మెల్సీ కవిత వ్యవహారం బీఆర్ఎస్‌లో సంచలనం సృష్టిస్తుండగా.. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం కవితతో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తూంకుంట మునిసిపల్ పరిధిలోని సేవాలాల్ తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయ 3వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కేసీఆర్ పులి.. కవిత పులిబిడ్డ. పెద్ద మనిషి వచ్చినప్పుడు కార్యక్రమానికి రావాలి కదా!" అని అన్నారు.

రేపే మిస్ వరల్డ్-2025 ఫైనల్



'మల్టీమీడియా చాలెంజ్' విజేతలు మిస్ థాయ్‌లాండ్, మిస్ కామెరూన్, మిస్ డోమినికన్ రిపబ్లిక్, మిస్ మాంటెనెగ్రో

» బాలీవుడ్ నటులు జాక్వెలిన్, ఇషాన్ ప్రదర్శన
» జ్యూరీలో సోనూసూద్, సుధారెడ్డి, మానుషి చిల్లర్
» 'మల్టీమీడియా చాలెంజ్'లో నలుగురు విజేతల ప్రకటన

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): గత మూడు వారాలుగా కొనసాగుతున్న ప్రపంచ అందాల పోటీలు తుది దశకు చేరుకున్నాయి. శనివారం సాయంత్రం మిస్ వరల్డ్-2025 ఫైనల్ కోసం నగరం సిద్ధమైంది. సాయంత్రం 6 గంటల నుంచి హైటెక్స్‌లో జరగనున్న ఈ పోటీల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. విదేశాల నుంచి వచ్చిన ప్రత్యేక డిజైనర్లు ప్రధాన వేదికను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. శనివారం వేడుకల్లో భాగంగా.. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండేజ్, ఇషాన్ ఖట్టర్‌తో పాటు పలువురు నటులు నృత్యప్రదర్శన ఇవ్వనున్నారు. ఫైనల్ పోటీల్లో న్యాయనిర్ణేతలుగా ప్రముఖ నటుడు సోనూసూద్, మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ డైరెక్టర్ సుధారెడ్డి, 2017 మిస్ వరల్డ్ విజేత మానుషి చిల్లర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. కాగా.. ఏటా మిస్ వరల్డ్ ఫైనల్లో ఇచ్చే మానవతావాది (హ్యూమానిటేరియన్) పురస్కారాన్ని ఈసారి సోనూసూద్‌కు ఇవ్వనున్నారు. అలాగే రెండు రోజుల క్రితం నిర్వహించిన 'మల్టీమీడియా చాలెంజ్' విజేతలను మిస్ వరల్డ్ సంస్థ గురువారం ప్రకటించింది. ఇందులో నాలుగు ఖండాల నుంచి నలుగురు విజేతలున్నారు. ఏషియా-ఓషియానా నుంచి థాయ్‌లాండ్, యూరప్ నుంచి మాంటెనెగ్రో, ఆఫ్రికా నుంచి కామెరూన్, అమెరికా-కరేబియన్ నుంచి డొమినికన్ రిపబ్లిక్ దేశాల ప్రతినిధులు ఈ చాలెంజ్‌లో విజేతలుగా నిలిచారు. దీంతో ఫైనల్ పోటీలో టాప్-40లో వీరి స్థానం ఖరారైంది.

పునఃమూల్యాంకనంలోనూ

మా అబ్బాయికి అన్యాయం!

» ఆర్టీసీ ఉద్యోగి ఆవేదన.. మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు

రాజమహేంద్రవరం అర్బన్, మే 29(ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల పునఃమూల్యాంకనంలోనూ తమ కుమారుడికి అన్యాయం జరిగిందని రాజమహేంద్రవరానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి వీరభద్రరావు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమారుడు మణికంఠ ఇటీవల టెన్త్ పరీక్షలు రాయగా తెలుగులో 97, ఇంగ్లి‌ష్‌లో 81, లెక్కల్లో 86, సైన్సులో 97, సోషల్‌లో 92 మార్కులు వచ్చాయని తెలిపారు. ఒక్క హిందీలో మాత్రం 52 మార్కులు వచ్చాయని పేర్కొన్నారు. దీంతో హిందీ పేపర్ పునఃమూల్యాంకనం కోరుతూ రూ.1,000 చెల్లించామన్నారు. కానీ, మళ్లీ అవే మార్కులు వేసి పంపారని, జవాబు పత్రాన్ని పునఃమూల్యాంకనం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరెక్టుగా రాసిన జవాబులను సైతం కొట్టివేశారని, మార్కులు వేయకుండా 'మార్పు లేదు' అని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేసినట్టు వీరభద్రరావు వెల్లడించారు.

మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం వ్యవహారంలో సీఐడీ నమోదుచేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. కుంభకోణంలో పిటిషనర్ పాత్రపై సవివరంగా కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. సోమవారంలోగా కౌంటర్ వేస్తామని, ఈ పిటిషన్‌పై వచ్చేవారం విచారణ జరపాలని అభ్యర్థించారు. మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టీ నిరంజన్‌రెడ్డి స్పందిస్తూ.. ప్రాసిక్యూషన్ కౌంటర్ వేసిన అనంతరం రిప్లై కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. వ్యాజ్యంపై విచారణను రెండు వారాలకు వాయిదా వేయాలని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ హరినాథ్ కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రాసిక్యూషన్‌కు సమయమిస్తూ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను జూన్ 12వ తేదీకి వాయిదా వేశారు.

సజ్జల కుటుంబ సభ్యులకు

హైకోర్టులో ఊరట

» 63.72 ఎకరాలపై యథాతథ స్థితి

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి సోదరుల కుటుంబ సభ్యులకు హైకోర్టులో ఉపశమనం లభించింది. కడప జిల్లా సీకే దిన్నె మండలం పరిధిలోని పలు సర్వే నంబర్లలో 63.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటూ ఈ నెల 21న జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌పై న్యాయస్థానం స్టే విధించింది. కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చేనాటికి ఉన్న స్థితిని యథాతథంగా కొనసాగించాలని అధికారులకు స్పష్టం చేసింది. విచారణను జూన్ 30కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. సీకే దిన్నె మండల పరిధిలోని పలు సర్వే నంబర్లలో రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లు, వారసత్వంగా తమకు సంక్రమించిన 63.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటూ జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ సజ్జల రామకృష్ణారెడ్డి సోదరుడు దివాకర్‌రెడ్డి సతీమణి భగీరథి, కుమారుడు సందీప్‌రెడ్డి, మరో సోదరుడు జనార్దన్‌రెడ్డి, సతీమణి విజయకుమారి, దివాకర్‌రెడ్డి అల్లుడు సత్య సందీప్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆ మండల పరిధిలో తమకున్న 201.17ఎకరాల భూముల విషయంలో అధికారులు జోక్యం చేసుకోకుండా నిలువరించాలని కోరారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఆ భూములు దశాబ్దాలుగా తమ స్వాధీనంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ప్రణతి స్పందిస్తూ.. భూమిని ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని, పూర్తి వివరాలతో మెమో దాఖలు చేశామని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చేనాటికి ఉన్న స్థితిని యథాతథంగా కొనసాగించాలని ఆదేశించారు.

లిక్కర్ గ్యాంగ్‌కు నేటి నుంచి

పోలీసు కస్టడీ

» రెండు రోజుల విచారణకు ఏసీబీ కోర్టు అనుమతి
» రాజ్ కసిరెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలను విచారించనున్న పోలీసులు
» వేర్వేరుగా, కలిపి విచారించాలని నిర్ణయం



విజయవాడ, మే 29(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నలుగురు నిందితులను ఏసీబీ కోర్టు రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇచ్చింది. కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను వారం పాటు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వాదనలు ముగియడంతో శుక్ర, శనివారాలు కస్టడీకి ఇస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నలుగురిలో ఇప్పటికే సిట్ అధికారులు ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని వారం పాటు కస్టడీకి తీసుకుని విచారణ చేశారు. ఈ కేసులో ఈ నలుగురు కీలకంగా వ్యవహరించారని అధికారులు గుర్తించారు. వీరిని వేర్వేరుగా, కలిపి విచారణ చేయాలని అధికారులు నిర్ణయించారు. శుక్రవారం ఉదయం సిట్ అధికారులు జైలు నుంచి నిందితులను కస్టడీకి తీసుకుంటారు.

బాలాజీ గోవిందప్పకు బయటి నుంచి భోజనం

బాలాజీ గోవిందప్పకు బయటి నుంచి భోజనాన్ని అనుమతిస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. బయటి నుంచి సోమ, బుధ, శుక్రవారాల్లో భోజనాన్ని అనుమతించాలని జైలు అధికారులకు ఆదేశాలిచ్చారు. అనారోగ్యం, వృద్ధాప్యం కారణంగా తనకు ఇంటి భోజనాన్ని అనుమతించాలని గోవిందప్ప వేసిన పిటిషన్‌పై వాదనలు ముగియడంతో న్యాయాధికారి తీర్పును వెలువరించారు.

పుష్ప తరహాలో గంజాయి స్మగ్లింగ్

» లారీ క్యాబిన్‌లోని రహస్య అరలో బస్తాలు
» ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టివేత
» లారీ సహా రూ.22 లక్షల విలువైన 730 కిలోల గంజాయి స్వాధీనం





గంజాయి తరలించిన లారీ, క్యాబిన్‌లో తయారు చేసిన రహస్య అర

దేవరపల్లి, మే 29(ఆంధ్రజ్యోతి): పుష్ప సినిమాలో.. పాల ట్యాంకరు అరలో గంధం చెక్కలు తరలించినట్లుగా.. నిజ జీవితంలోనూ ఓ లారీ డ్రైవర్ ప్రయత్నించాడు. లారీ క్యాబిన్‌లో సీటు వెనుక ప్రత్యేక అర తయారు చేయించి, అందులో గంజాయి బస్తాలు తరలిస్తూ పోలీసులకు దొరికిపోయాడు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు ఇలా గంజాయి తరలిస్తున్న లారీని తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అరెస్టు చేశారు. గురువారం జరిగిన మీడియా సమావేశంలో సీఐ బి.నాగేశ్వర్‌నాయక్ ఈ కేసు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన కర్రే శ్రీశైలంకు ఏపీ16టీఎక్స్ 5319 నంబర్ లారీ ఉంది. ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతానికి వెళ్లి గంజాయి తీసుకువస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులిస్తామని హైదరాబాద్‌కు చెందిన నర్సిరెడ్డి, యాదయ్య అనే ఇద్దరు అతడితో డీల్ కుదుర్చుకున్నారు. శ్రీశైలం.. ఒడిశా వెళ్లి, లారీ క్యాబిన్‌లో తన సీటు వెనుక.. అరలో గంజాయి బస్తాలను నింపేశాడు. అయితే ఈనెల 24న సాయంత్రం దేవరపల్లి మీదుగా వెళ్తూ.. గోల్డెన్‌ఫిష్ దాబా దగ్గర హైవేపై మోటర్‌సైకిల్‌ను ఢీకొట్టాడు. బైక్‌పై ఉన్న ఇద్దరు మరణించడంతో, భయపడి లారీతో సహా పరారయ్యాడు. కొవ్వూరు-నల్లజర్ల జాతీయ రహదారి సర్వీసు రోడ్డు పక్కన యర్నగూడెం శివారులోని ఓ ఇటుక బట్టీ వద్ద లారీని పార్కింగ్ చేశాడు. ఈ క్రమంలో ఈనెల 28న పోలీసులకు ఈ లారీపై ఉప్పందింది. పరిసర ప్రాంతాల్లో గాలించి చివరికి లారీని గుర్తించారు. అందులో రూ.22లక్షల విలువైన 730కిలోల 18 గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అరెస్టు చేశారు. అతడిపై గంజాయి రవాణాచేస్తూ పట్టుబడినట్టుగా చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో 2023లో కేసు నమోదు కాగా, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు. ఈ కేసులో గంజాయి తేవాలని ఒప్పందం చేసుకున్న హైదరాబాద్‌కు చెందిన నర్సిరెడ్డి, యాదయ్యలను అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు. నిందితుడిని కొవ్వూరు కోర్టుకు తరలిస్తున్నామని తెలిపారు.

అక్రమమైనింగ్ కేసులో

వంశీకి బెయిల్

» పలు షరతులతో హైకోర్టు మంజూరు
» నకిలీ ఇళ్ల పట్టాల కేసులో ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా
» ఆయుష్ ఆస్పత్రిలో వైద్యానికి అనుమతి
» వంశీ రిమాండ్ పొడిగించిన నూజివీడు కోర్టు



అమరావతి/నూజివీడు టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో అక్రమ మైనింగ్‌కు సంబంధించిన కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా పలు షరతులు విధించింది. గన్నవరం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు రూ. 20 వేలతో రెండు పూచికత్తులు సమర్పించాలని ఆదేశించింది. చార్జిషీట్ దాఖలు చేసేవరకు ప్రతీ రెండో శనివారం దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వంశీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా వంశీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఘటన జరిగిన ఆరేళ్ల తర్వాత దురుద్దేశపూర్వకంగా కేసు పెట్టారని చెప్పారు. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుత కేసులో పీటీ వారెంట్ అమలు చేయబోమని అడ్వొకేట్ జనరల్ కోర్టుకు హామీ ఇచ్చారన్నారు. కౌంటర్ వేసేందుకు వారం రోజులు ఇవ్వాలని కోరారు.

5న వైద్య నివేదిక ఇవ్వాలి: హైకోర్టు

నకిలీ ఇళ్ల పట్టాల జారీకి సంబంధించి నమోదైన కేసులో వంశీ బెయిల్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. వంశీని ఆయుష్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించాలని విజయవాడ జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. వైద్య పరీక్షల సమయంలో ఆయన సతీమణి లేదా ఆమె సూచించిన కుటుంబ సభ్యుల్లో ఒకరిని మాత్రమే అనుమతించాలంది. వైద్య పరీక్షల నివేదికను సీల్డ్ కవర్‌లో అందజేయాలని స్పష్టం చేసింది. ఆ నివేదికను జూన్ 5న కోర్టు ముందు ఉంచాలంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. వంశీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్, పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. కాగా, నకిలీ ఇళ్ల పట్టాల కేసులో వంశీ రిమాండ్‌ను మరో 14 రోజులు పొడిగిస్తూ నూజివీడు సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

నా కేసు దర్యాప్తు చేస్తున్నది మీరేనా?

» ఓ ఏసీపీని ప్రశ్నించిన పీఎస్ఆర్.. విచారణ మధ్యలో వేరే చాంబర్‌లోకి
» కస్టడీలో ఉండగా జరిగిన ఘటన.. విధుల్లో ఉన్న ఐపీఎస్‌లా వ్యవహారం



(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

'నా కేసును దర్యాప్తు చేస్తున్నది మీరేనా? ఎక్కడి ఏసీపీ మీరు?' అంటూ ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో నిందితుడిగా ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు పోలీసు కస్టడీలో ఓ ఏసీపీని ప్రశ్నించారు. కేసులో నిందితుడిగా ఉన్న పీఎస్ఆర్ విధుల్లో ఉన్న ఐపీఎస్‌గా వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. విజయవాడలోని జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన్ను కోర్టు రెండు రోజుల పోలీసు కస్టడీకి ఇచ్చిన విషయం తెలిసిందే. 25వ తేదీ ఉదయం నుంచి 26వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు ఆయన సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఉన్నారు. పీఎస్ఆర్‌తో పాటు కామ్‌సైన్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్ కూడా స్టేషన్‌లోనే ఉన్నారు. నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్.. పీఎస్ఆర్, మధుసూదన్‌ను విడివిడిగా విచారించారు. తొలిరోజు విచారణలో మధ్యాహ్నం కాగానే, పీఎస్ఆర్ టాయ్‌లెట్‌కు వెళ్తానని చెప్పారు. ఆయన గదిలో నుంచి బయటకు రాగానే సిబ్బంది టాయ్‌లెట్లు చూపించారు. టాయ్‌లెట్‌కు వెళ్లొచ్చిన తర్వాత పీఎస్ఆర్ విచారణ గదిలోకి వెళ్లకుండా పక్కనున్న ఏడీసీపీ చాంబర్‌కు వెళ్లారు. ఆ చాంబర్‌లో ఇద్దరు ఏసీపీలు కూర్చున్నారు. ఆయనను చూడగానే ఇద్దరు ఏసీపీల్లో ఒకరు బయటకు వెళ్లిపోయారు. తనను చూసి నిలబడిన మరో ఏసీపీని పీఎస్ఆర్ ప్రశ్నలు వేశారు. 'నా కేసు (ఏపీపీఎస్సీ)ను మీరే దర్యాప్తు చేస్తున్నారా? మీరు ఎక్కడి ఏసీపీ?' అని అడిగారు. కేసుతో సంబంధం లేనప్పుడు ఇక్కడెందుకున్నారన్న అర్థం వచ్చేలా పీఎస్ఆర్ మాట్లాడారు. ఆయన అడిగిన ప్రశ్నలకు ఏసీపీ సమాధానం చెప్పడంతో సరేనంటూ వెళ్లిపోయారు. టాయ్‌లెట్‌కు వెళ్లిన పీఎస్ఆర్ అక్కడి నుంచి నేరుగా ఏడీసీపీ చాంబర్‌లోకి వెళ్లి ఏసీపీని ప్రశ్నించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

పీఎస్ఆర్‌కు కఠిన షరతులు విధిస్తాం: హైకోర్టు

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుకు బెయిల్ మంజూరు సందర్భంగా కఠిన షరతులు విధిస్తామని హైకోర్టు ప్రకటించింది. దీనికి సంబంధించి సవివర ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై. లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. సినీనటి కాదంబరి జత్వాని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదుచేసిన కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పీఎస్ఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పీఎస్ఆర్ తరఫున న్యాయవాది నగేశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ 37 రోజులుగా జైల్లో ఉన్నారన్నారు. ఆయనపై అక్రమ కేసు పెట్టారని తెలిపారు. పిటిషనర్ మినహా నిందితులు బెయిల్ పొందారని పేర్కొన్నారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. జత్వానీపై పోలీసులు పెట్టింది అక్రమ కేసా? కాదా? అని తేల్చాల్సింది ట్రయల్ కోర్టు మాత్రమేనని అన్నారు. కేసు దర్యాప్తు పూర్తి చేసి, చార్జిషీట్ దాఖలు చేయడం వరకే పోలీసుల పని అని తెలిపారు. తమపై అక్రమ కేసు పెట్టారని నిందితులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసులు పెట్టుకుంటూ పోతే న్యాయ విచారణకు అంతు ఉండదన్నారు. కేసులో నిందితులుగా ఉన్న ఇతర పోలీసు అధికారులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఉన్నతాధికారి చెప్పారని ఐపీఎస్ అధికారులు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడతారా? వారికి విచక్షణ లేదా? అని ప్రశ్నించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ బదులిస్తూ.. కేసు నమోదుకు ముందే జత్వానీపై పిటిషనర్, ఇతర నిందితులు కుట్ర పన్నారని తెలిపారు. కేసు నమోదు చేయడానికి ఒకరోజు ముందే ముంబైకి వెళ్లి జత్వానీని అరెస్టు చేసేందుకు విమాన టికెట్లు బుక్ చేశారన్నారు. పిటిషనర్ సూచనలకు అనుగుణంగా ఐపీఎస్ అధికారులు, ఇతర పోలీసు అధికారులు నడుచుకున్నారన్నారు. సాక్ష్యుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కేసు దర్యాప్తును పిటిషనర్ ప్రభావితం చేస్తున్నారని, దర్యాప్తు అధికారులను బెదిరిస్తున్నారని తెలిపారు. వాట్సప్ కాల్ వివరాలను కోర్టు ముందు ఉంచారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. పీఎస్ఆర్ బెయిల్ మంజూరు సందర్భంగా కఠిన షరతులు విధిస్తామని ప్రకటించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.